అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 01-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 132
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50

ఎన్జీఓలపై ఉక్కుపాదం తగదు
క్రూరమైన చట్టాలతో వేధింపులు సరికాదు
700 సంస్థలపై ఆధారాలే లేవు
అంతర్జాతీయ సంస్థ ఎఫ్ఏటీఎఫ్ నివేదిక



3లో

గుజరాత్‌లో పేపర్ లీకేజీల బాగోతం !
బీజేపీ మోడల్ రాష్ట్రంలో పలు ప్రశ్నాపత్రాలు లీక్



లక్షలాది ఉద్యోగార్థుల ఆశలు ఆవిరి
నిందితులకు బీజేపీతో సంబంధాలు
వివరాలు 12లో

నైజీరియాలో ఆత్మాహుతి దాడులు..
పెండ్లి వేడుకలు, ఆస్పత్రి, అంత్యక్రియల్లో ఘటనలు
- 18 మంది మృతి
- 48 మందికి గాయాలు
- ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు

మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని తెలిపిన ఆస్పత్రి వర్గాలు
వివరాలు 11లో

విపక్ష సభ్యుల విశ్వాసం పొందుతారా?
వరుసగా రెండోసారి స్పీకర్‌గా ఓం బిర్లా
గత లోక్‌సభలో ఆయన తీరుపై ప్రతిపక్షాల అసంతృప్తి
ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు
బిల్లులను పార్లమెంటరీ కమిటీలకు పంపకుండానే ఆమోదించారన్న అపవాదు

విస్తారంగా వర్షాలు
715 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- వచ్చే వారం రోజులు వానలే
- ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ
- రిజర్వాయర్లలోకి ఇంకా చేరని నీరు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో వచ్చే వారం రోజులపాటు విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 715 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూర్‌లో అత్యధికంగా 5.28 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జులై 7వ తేదీ వరకు రాష్ట్రంలో ఇదే తరహాలో వర్షాలు పడనున్నాయి. ఉత్తర ఒడిశా-గ్యాంగ్‌టక్ పశ్చిమ బెంగాల తీరాలకు ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతంపై ఏర్పడిన ఆవర్తనం తాజాగా తూర్పు జార్ఖండ్ ఆ పరిసరాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. దీనివల్ల తెలంగాణలో కింది స్థాయి గాలులు పశ్చిమ, నైరుతి దిశల నుంచి వీస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయనీ, దీనివల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొన్ని చోట్ల, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసినట్టు వాతావరణ శాఖ వివరించింది. రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఎల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు తెలిపారు. అయితే హైదరాబాద్, ఆ పరిసర ప్రాంతాల్లోనూ తేలికపాటి నుంచి ఒకమోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఒక మోస్తరు వర్షాలు కురిస్తే వ్యయసాయానికి అనుకూలంగా ఉంటాయనీ, భారీ వర్షాలైతే నష్టం తప్పదని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కొమరంభీం, మంచిర్యాల, కామారెడ్డి జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. అదే సమయంలో కరీంనగర్, సంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, వికారాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. నారాయణ్‌పేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, నల్గొండ జిల్లాల్లో అధిక వర్షాలు కురిసినట్టు వ్యవసాయశాఖ తెలిపింది. మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా వార్షిక సగటు వర్షపాతం 919.0 మిల్లీమీటర్లు కాగా, నైరుతీ రుతుపవనాల వల్ల ఇప్పటి వరకు 720.4 మి.మీ., వర్షపాతం...11లో



రాష్ట్రంలో భారీ వర్షాలు..

రాజధానిలో..

హైదరాబాద్‌కు తాగునీటిని అందించే రిజర్వాయర్లలో కూడా పూర్తిస్థాయి సామర్థ్యంతో నీరు లేదు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూర్, మంజీరా, అక్కంపల్లి, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 39.783 టీఎమ్‌సీలు కాగా, ప్రస్తుతం ఈ మొత్తం రిజర్వాయర్లలో 19.025 టీఎమ్‌సీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఈ రిజర్వాయర్లలో 23.392 టిఎమ్‌సీల నీరు ఉన్నట్టు హైదరాబాద్ వాటర్‌బోర్డ్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించింది. యాక్షన్ ప్లాన్ రూపొందించింది. సహాయక బృందాలను అప్రమత్తం చేసింది. ఎక్కడైనా వాగులు, వంకలు పొంగితే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించింది.

స్మార్ట్ సిటీ మిషన్
గడువు పొడిగింపు
సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో స్పందించిన కేంద్రం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్మార్ట్ సిటీ మిషన్‌ను 2025 మార్చి వరకు పొడిగించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితిని వచ్చే ఏడాది జూన్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితి ఈ నెలాఖరుతో ముగియనుంది. వరంగల్, కరీంనగర్ నగరాల్లో స్మార్ట్ మిషన్ పనులు చేపట్టారు. వరంగల్‌లో ఇప్పటివరకు 45 పనులు పూర్తయ్యాయి. రూ. 518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయి. కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయి. రూ. 287 కోట్లతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయి. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. పనులు పూర్తికానందున ప్రజల ప్రయోజనార్థం మేరకు పథకం గడువును పొడిగించాలని కోరారు. దీంతో ఆ పథకాన్ని 2025 మార్చి 31 వరకు పొడిగిస్తూ శనివారం రాష్ట్రాలకు లేఖ రాసింది. ఇప్పటికే నిధులు కేటాయించి ఆమోదించిన పనులను కొనసాగించాలనీ, కొత్త పనుల మంజూరు ఉండవని స్పష్టం చేసింది. జరుగుతున్న పనులకు సంబంధించిన నిధులను ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఫస్ట్ కమ్ ఫస్ట్ పద్ధతిన విడుదల చేయనున్నది. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించింది.

విద్యార్థుల సంఖ్యకనుగుణంగా
టీచర్ల బదిలీలు
గత తప్పిదాలకు తావులేకుండా చర్యలు
బదిలీల్లో వెబ్ ఆప్షన్ల కేటాయింపు
వివరాలు 10లో

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణకు
కాంగ్రెస్ కుట్ర
మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్‌రంగాన్ని ప్రయివేటీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మీడియాకు లీకులు ఇస్తున్నారనీ, ఆ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దీనిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. పాతబస్తీలో కరెంటు బిల్లు వసూళ్లను అదానీకి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయివేటు వ్యక్తులు విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు పైలెట్ ప్రాజెక్టుగా పాతబస్తీని ఎంచుకున్నారనీ, అది అక్కడికే పరిమితం కాదనీ, క్రమేణా రాష్ట్రం మొత్తం విద్యుత్ బిల్లుల వసూళ్లు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోడీ చెప్పినట్టు చేస్తున్నారనీ, విద్యుత్ సంస్కరణల అమలుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్రం ఎన్ని వత్తిళ్లు తెచ్చినా, విద్యుత్ సంస్కరణలు అమలు చేసేది లేదని మాజీ సీఎం కే చంద్రశేఖరరావు అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఈ సంస్కరణలు అమలైతే విద్యుత్ సబ్సిడీలు, రైతులకు ఉచిత కరెంటు వంటివి ఉండబోవనీ, మోటార్లకు మీటర్లు పెడతారని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ, అదానీ ...11లో



పోస్టర్ ఆవిష్కరణలో రైతు నేతలు

కనీస మద్దతు ధరల కోసం నేడు, రేపు ఆందోళనలు
తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరల చట్టం చేయాలని కోరుతూ సోమ, మంగళవారాల్లో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ...2లో

అమ్మ పేరుతో ఓ మొక్క
మన్ కీ బాత్‌లో మోడీ నాలుగు నెలల తర్వాత పున: ప్రారంభం



న్యూఢిల్లీ : దాదాపు నాలుగు నెలల తర్వాత... మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ మరలా తొలిసారిగా ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతిని ఉద్దేశించి ఆయన ఇందులో పలు కీలకాంశాలను ప్రస్తావించారు. " మన్ కీ బాత్ స్ఫూర్తి దేశంలో వికసిస్తూనే ఉంది. మా ప్రభుత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసం చూపించారు. అందుకే మీ అందరి మధ్య ఉన్నాను. వికసిత్ భారత్ కోసం కృషి చేస్తున్నాము" అని అన్నారు. అనంతరం లోక్‌సభ ఎన్నికలపై మాట్లాడారు. 2024 ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలని, ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత పెద్ద ఎన్నికలు జరగలేదని, అందులో 65 కోట్ల మంది ఓట్లు వేశారని మోడీ అన్నారు. దీని కోసం కృషి చేసిన ఎన్నికల కమిషన్‌తోపాటు ఓటింగ్ ప్రక్రియతో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

' టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. ఈ విజయంతో 17 ఏండ్ల తర్వాత టీ20 ప్రపంచ కప్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. ఈ చారిత్రాత్మక విజయంపై సంతోషాన్ని వ్యక్తం చేసిన ప్రధాని.. భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. తమదైన స్టైల్లో ట్రోఫీని మరోసారి ఇంటికి తీసుకొచ్చిన భారత జట్టును ...11లో

వెంకయ్య వాగ్ధాటి అమోఘం
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయన జన్మదినం సందర్భంగా
జీవిత ప్రస్థానంపై మూడు పుస్తకాలు ఆవిష్కరణ 2లో..

డీఎస్‌కు అశ్రు నివాళి
జనసంద్రంగా మారిన మాజీ మంత్రి అంతిమయాత్ర
నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పర్యవేక్షించిన కలెక్టర్, డీఐజీ, సీపీ
శ్రద్ధాంజలి ఘటించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంతో జన హృదయ నేతగా పేరొందిన మాజీ మంత్రి డి.శ్రీనివాస్‌కు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డులో డి.శ్రీనివాస్ కుటుంబీకులకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రగతినగర్‌లోని డి.శ్రీనివాస్ నివాసం నుంచి బైపాస్ రోడ్డులోని వ్యవసాయ క్షేత్రం వరకు నిర్వహించిన అంతిమయాత్రలో అశేష జనవాహిని పాల్గొని డీఎస్‌కు అశ్రు నివాళులర్పించారు. దాంతో రహదారంతా జనసంద్రంగా మారింది. అంత్యక్రియల్లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వేల సంఖ్యలో అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్‌కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి.. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌లో రోడ్డు మార్గం గుండా ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి ...11లో

బదిలీల్లో ఎస్‌జీటీ ఖాళీలన్నీ చేపట్టాలి

- నేడు టీఆర్‌టీఎఫ్ నిరసన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్జీటీ తత్సమాన ఉపాధ్యాయ ఖాళీ పోస్టులన్నీ ఓపెన్ చేయాలని టీఆర్‌టీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు వినతి పత్రాన్ని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, అంజిరెడ్డి సమర్పించింది. పదోన్నతుల్లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. తిరిగి బదిలీల్లో కూడా తీవ్ర నష్టం జగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో డీఎస్సీ ఉన్నందున మిగతా కాలేజీల్లో నూతన ఉపాధ్యాయులు చేరే అవకాశం ఉన్నదనీ, సీనియర్ సర్వీస్ ఉపాధ్యాయులకు అన్ని ఖాళీలు చూపెట్టాలని కోరారు. ప్రతి పాఠశాలలకు ఉపాధ్యాయిన్ని కేటాయిఇస్తానని సీఎం చేసిన వాగ్దానానికి భిన్నంగా పాఠశాల విద్యాశాఖ ఖాళీలను చూపడం లేదని పేర్కొన్నారు. ఎస్‌జీటీలకు జరుగుతున్న నష్టంపై నిరసన తెలియ జేస్తూ సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరౌతామని పేర్కొన్నారు.

విద్యార్థి, యువజన సంఘాల రాజ్‌భవన్ ముట్టడి

- మద్దతు ప్రకటించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేడు విద్యార్థి యువజన సంఘాలు తలపెట్టిన రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ప్రొఫెసర్ కె చక్రధరరావు, ప్రొఫెసర్ జి. హర గోపాల్, ప్రొఫెసర్ కె లక్ష్మినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టిఏ ఆధ్వర్యంలో జరిగిన నీట్ పరీక్ష పేపర్లు అమ్ముకోవడం, లీక్ చేయడంతో 23 లక్షల మంది విద్యార్థుల శ్రమ, డబ్బులు, వృధా అయిందని వారు విమర్శించారు. ఆ పరీక్ష అవకతవకల వలన విద్యావ్యవస్థకి మూలస్తంభమైన పరీక్షా వ్యవస్థే విశ్వసనీయతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2016 ముందు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ ప్రాంతాల్లో వైద్య విద్య ప్రవేశాల కోసం పరీక్షలు నిర్వహించుకునేదనీ, విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నదనే విషయాన్ని ఖాతరు చేయకుండా, రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, కేంద్ర ప్రభుత్వం నీట్ పేరు మీద వైద్య విద్యకు పరీక్షలు నిర్వహించడం రాజ్యాంగంలో పొందుపరిచిన సమైక్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఇటువంటి కేంద్రీకృత పరీక్షలకు, విద్యా వ్యతిరేక విధానాలకు జాతీయ విద్యా విధానం ఆమోదముద్ర వేయడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలను దెబ్బతీసే జాతీయ విద్యా విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని తెలియజేయాలని డిమాండ్ చేశారు.

కార్పొరేటీకరణ దిశగా ఉన్నత విద్యారంగం

- జులై 10న నిరసనలు : టీయూఈడబ్ల్యూయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం విశ్వ విద్యాలయాలను వ్యాపార సంస్థలుగా మారుస్తున్నదనీ, దీనిని నిరసిస్తూ ఈ నెల పదో తేదీన నిరసనలు తెలుపుతామని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్(టీయూఈడబ్ల్యూయూ- సీఐటీయూ అనుబంధం) ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్షులు మెట్టు రవి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఉన్నత విద్యకు రెండు శాతం నిధులను కూడా కేటాయించకపోవడం వల్ల యూనివర్సిటీల్లోని టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని తెలిపారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం వర్సిటీలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా రెండో పీఆర్సీ, రెగ్యులరైజేషన్, పెండింగ్ వేతనాల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సాహిత్య వారసత్వానికి చేసిన గొప్ప కృషి 'రామచిలుక'

- గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాహిత్య వారసత్వానికి చేసిన అమూల్యమైన కృషి 'రామచిలుక' పుస్తకమని పుదుచ్చేరి తెలంగాణ, లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రామచిలుక తెలుగు అనువాద పుస్తకాన్ని రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. అనంతరం రాధాకృష్ణన్ మాట్లాడుతూ అనువాదకుడు ఎల్‌ఆర్ స్వామి తెలుగు అనువాదం రచన యొక్క సారాంశాన్ని పూర్తిగా ప్రతిబింబించిందన్నారు. ఈ పుస్తకానికి తగిన గుర్తింపు, విజయం లభిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు, రచయిత అసాధారణ ప్రతిభ, స్ఫూర్తినిచ్చే సామర్థ్యాల్ని కొనియాడారు. "రామచిలుక" ఏడు కథల సంపుటి అని చెప్పారు. రచనలో తన సాహిత్య నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. తెలివైన, ఆలోచింపజేసే కథలతో పాఠకులను కట్టిపడేశారని కొనియాడారు. "రామచిలుక" అతని బహుముఖ ప్రజ్ఞకు, శ్రేష్ఠతకు నిబద్ధతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, గోవా గవర్నర్ కార్యదర్శి యం.ఆర్.యం. రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, కవి, రచయిత కె. శివారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతి భేష్

- డాక్టర్ ఏ ముఖర్జీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతి వైద్యం భేష్ అని డాక్టర్ ఏ. ముఖర్జీ తెలిపారు. నేటి సమాజంలో చాలా మంది రుమాటిక్ ఆర్థరైటిస్, ఆస్తమా, అలర్జీ, సంబంధిత సమస్యలు, ఐబీఎస్ సమస్యలు, గుండె జబ్బులు వంటి క్లిష్టమైన కేసులను ఎదుర్కొంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి సరైన చికిత్స అందిస్తే ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఆధునిక కాలంలో హోమియోపతి చాలా వ్యాధులకు పరిష్కారం చూపగలదని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో హోమియోపతి ప్రపంచంలోని ప్రతి ఇంటికి చేరుకోగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్ సంప్రదింపుల కోసం 6302761047కు కాల్ చేయండి లేదా sevahomoeoclinic.comలో సంప్రదించండి. క్లినిక్ చిరునామా - ఫ్లాట్ 102, నెస్ట్ అపార్ట్‌మెంట్స్, డీకే రోడ్, అమీర్‌పేట్ హైదరాబాద్ - 500016.

గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ద్వారా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు - 2025 కొరకు రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్ లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణను ప్రభుత్వం ఇవ్వనున్నది. అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల ఏడు వరకు ప్రభుత్వం పొడిగించింది. అభ్యర్థులు ఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడుతారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.మూడు లక్షలు మించరాదు. అభ్యర్థులు http://studycircle.cgg.gov.in లో లాగిన్ కావాలి. ఆన్ లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్ లైన్ అప్లికేషన్,సూచనలు .cgg.gov http://studycircle.in, http://twd.telangana.gov.in వెబ్‌సైట్ లో అందుబాటులో కలవు. మరిన్ని వివరాలకు 6281766534కు అన్ని పని దినాల్లో ఉదయం . 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల లోపు సంప్రదించాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కనీస మద్దతు ధరల కోసం

నేడు, రేపు ఆందోళనలు

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి, అరిబండి ప్రసాదరావుతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పంటల మద్దతు ధరలు సహేతుకంగా లేవన్నారు. పెరుగుతున్న రైతుల పెట్టుబడిని పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. వెంటనే ఆ ధరలను సవరించాలని డిమాండ్ చేశారు. అందుకోసం అన్ని జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో నిరసనలు తెలియజేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. గతేడాది నిర్ణయించిన ధరలపై 5 నుంచి 7 శాతం మాత్రమే పెంచారని తెలిపారు. అదే సందర్భంలో వ్యవసాయోత్పత్తి ఖర్చులు 20 నుంచి 22 శాతం పెరిగాయన్నారు. 'వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను తగ్గించి చూపి, దానికి 50 శాతం కలిపి ధరలు ప్రకటించింది. ధరల నిర్ణయాక కమిషన్ రికమండేషన్లను ప్రధాని నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ పరిగణనలోకి తీసుకోలేదు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ తరహాలో రాష్ట్రంలో 'ధరల నిర్ణయాక కమిషన్' (సీఏసీపీ) వేసి రాష్ట్రంలో పండే అన్ని పంటలకు మద్దతు ధరలను నిర్ణయించి అమలు చేయాలి. కూరగాయలతోపాటు పండ్లకు కూడా మద్దతు ధరలను నిర్ణయించాలి. దీంతో నిర్ణయించిన ధరలను అమలు జరపడం రైతులకు వీలు అవుతుంది' అని సూచించారు. ధరలు నిర్ణయించడంతోపాటు నిర్ణయించిన ధరలను అమలు జరిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని కోరారు.

పంటలు- కేంద్రం నిర్ణయించిన ధర - వాస్తవంగా పెరగాల్సింది - రైతుకు నష్టం (క్వింటాల్ లెక్కన)

	(ఎంఎస్‌పీ)	(సీ2శాతం +50)	
వరి	2300	3012	712
పత్తి	7121	9345	2224
మొక్కజొన్న	2225	2795	570
జొన్న	3371	4437	1066
సజ్జలు	2625	2904	279
రాగులు	4290	5198	908
కందులు	7550	9756	2206
పెసర	8682	10956	2274
మినుములు	7400	9744	2344
వేరుశనగ	6783	8496	1713
పొద్దుతిరుగుడు	7280	9891	2611
సోయాబీన్	4892	6437	1555
నువ్వులు	9267	12228	2961

వెంకయ్య వాగ్ధాటి అమోఘం

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
- ఆయన జన్మదినం సందర్భంగా

జీవిత ప్రస్థానంపై మూడు పుస్తకాలు ఆవిష్కరణ

హైదరాబాద్: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గ్రామీణం ప్రాంతం నుంచి వచ్చి ఉన్నత స్థానానికి ఎదిగిన వ్యక్తి అని, ఆయన వాగ్ధాటి ముందు ఎవరూ నిలవలేరని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. వెంకయ్యనాయుడి జన్మదినం సందర్భంగా ఆయన జీవిత ప్రస్థానంపై రూపొందించిన మూడు పుస్తకాలను వర్చువల్‌గా ప్రధాని ఆవిష్కరించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. వెంకయ్య నాయుడు జీవితంపై వచ్చిన 'సేవలో వెంకయ్యనాయుడు జీవితం', '13వ ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు లక్ష్యం, సందేశం', 'మహానేత వెంకయ్యనాయుడు జీవితం, ప్రయాణం' అనే పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఇవి దేశ ప్రజలకు మార్గనిర్దేశం చేస్తాయని చెప్పారు. " వెంకయ్య నాయుడితో సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం నాకు దక్కింది. వేలాది కార్యకర్తలు ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన 17 నెలల జైలు జీవితం గడిపారు" అని అన్నారు. గ్రామీణ, పట్టణాభివద్ధి శాఖలో వెంకయ్యనాయుడు తనదైన ముద్ర వేశారని తెలిపారు. స్వచ్ఛభారత్, అమత్ యోజన వంటి ఎన్నో పథకాలు సమర్థవంతంగా అమలు చేసిన వ్యక్తి వెంకయ్య అని చెప్పారు. ఆయన రాజ్యసభ ఛైర్మెన్‌గా సభను సజావుగా నడిపారని, ఆయన సేవలను దేశం మరవదని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు బిల్లు తొలుత రాజ్యసభ ముందుకు వచ్చి ఆమోదం పొందడంలో వెంకయ్య పాత్ర కీలకమని తెలిపారు. రాజ్యసభ నిర్వహణలో ఆయన అనుభవం ఉపయోగపడిందని అన్నారు.

పార్టీ ద్వారా వచ్చిన పదవిని వదిలిన తరువాతే పార్టీ మారాలి : వెంకయ్యనాయుడు

" చట్ట సభలకు ఎంపికైన వారు హుందాగా ప్రవర్తించాలి. సిద్ధాంతం నచ్చకపోతే నాయకులు పార్టీ మారవచ్చు. పార్టీ ద్వారా వచ్చిన పదవిని వదిలి వెళ్లాలి. కార్యకర్తలకు నేతలు నియమావళి రూపొందించాలి. రాజకీయాల్లో జవాబుదారీతనం తీసుకురావడానికి ప్రయత్నించాలి. కులం, ధనం ప్రభావం తగ్గిపోవాలి. గుణం చూసి నాయకులకు ఓటు వేయాలి. మార్పు రాకపోతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. దేశ ప్రతిష్ఠను నిలబెట్టాలంటే చెడు పోకడలను అడ్డుకోవాలి" అని వెంకయ్యనాయుడు అన్నారు.

దేశ ప్రజలకు ప్రధాని అందిస్తున్న సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్ ట్రాన్స్‌ఫార్మ్ నినాదంతో మోడీ ముందుకెళు తున్నారని చెప్పారు. అవసరం ఉన్నంత వరకు ఉచిత రేషన్ పథకంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కొనసాగించాలని వెంకయ్యనాయుడు కోరారు. మాతభాషలను కేంద్రం ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. తాను ఆంగ్ల భాషకు వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలన్నీ భారతీయ భాషల్లో ఉండాలని చెప్పారు. ఆ తర్వాతే ఆంగ్ల భాషలో ఉండాలని కోరారు. మాతభాష, సోదర భాష తర్వాతే ఇతర భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు

సొంత డబ్బులతో అభివృద్ధి.. బిల్లులిప్పించండి

గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్‌కు సర్పంచుల బృందం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



గ్రామాల్లో అభివృద్ధి పనులను సొంత డబ్బులు ఖర్చుపెట్టి చేశామనీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ పనులకు సంబంధించిన బిల్లులను ఇప్పించాలని రాష్ట్ర గవర్నర్ సీ.పీ. రాధాకృష్ణన్‌కు సర్పంచుల బృందం విన్నవించింది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డితో కూడిన బృందం వినతిపత్రాన్ని అందజేసింది. సర్పంచుల పదవీకాలం పూర్తై ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక పాలనపై దృష్టి పెట్టడం లేదని గవర్నర్‌కు బృందం సభ్యులు వివరించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలను తమ సొంత డబ్బులతో ఖర్చు పెట్టి చేశామని వాపోయారు. పనులు చేసి ఏండ్లు గడుస్తున్నా నేటికీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కలెక్టర్లకు, మంత్రులకు, ముఖ్యమంత్రికి వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోలేదని వాపోయారు. తమ ఆస్తులు తాకట్టు పెట్టి పనులు చేసిన సర్పంచులు వాటిని ఎలా తీర్చుకోవాలో అర్థంకాక, అప్పుల బాధతాళలేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించేలా చూడాలని వేడుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేయిస్తానని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హామీనిచ్చారని యాదయ్య, లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సుభాష్ గౌడ్, గణేష్ సముద్రాల, రమేష్, రాజేందర్, లక్ష్మారెడ్డి, సురేష్ కూడా ఉన్నారు.

కార్టూన్లకు తగ్గుతున్న ఆదరణ

- ప్రాధాన్యతను తగ్గించిన పత్రికలు
- డిజిటల్ ప్లాట్‌ఫామ్ రాకతో కుదేలు
- తెలుగు కార్టునిస్టు వర్క్‌షాపులో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

" కార్టున్లకు రాను రాను ఆదరణ తగ్గుతోంది. ప్రపంచీకరణతో వచ్చిన మార్పుల కారణంగా సాంప్రదాయ వ్యంగ్య చిత్రాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. డిజిటల్ ప్లాట్‌ఫాం రాకతో వచ్చిన నూతన ఒరవడుల నేపథ్యంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని కార్టునిస్టులు కొత్తనైపుణ్యాలతో తమ వృత్తిలో రాణించాలి" అని పలువురు వక్తలు అన్నారు. వ్యంగ్య చిత్రాలు వేయడంలో మెళుకువలు, డిజిటల్ ప్లాట్‌ఫాం రాకతో వచ్చిన మార్పులు తదితర అంశాలపై ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన "తెలుగు కార్టునిస్టుల మెగా వర్క్‌షాప్"లో ప్రముఖ కార్టునిస్టులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మూడు దశాబ్దాలకు పూర్వం తెలుగు పత్రికా రంగంలో రాజకీయ, సామాజిక కార్టున్లు బహుళ ప్రాచుర్యం పొందాయని అన్నారు. గ్లోబలైజేషన్ నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థ దెబ్బకు కుదేలైన పత్రికలు తమ స్వీయ మనుగడకు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యంగ్య చిత్రాలను తగ్గించాయని పేర్కొన్నారు. దాంతో కార్టునిస్టులు ఇతర మార్గాల ద్వారా వాటికి ప్రాచుర్యం తీసుకొచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫొటోషాప్, ఐ ప్యాడ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర సాంకేతికతలు ప్రపంచాన్ని ఏలుతున్న తరుణంలో, కాలానుగుణంగా వచ్చిన మార్పులను అందిపుచ్చుకొని కొత్త తరహాలో కార్టునిస్టులు దూసుకుపోవాలని సూచించారు. రాజకీయ విధానాలు, స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, తదితర అంశాలతో గీసే వ్యంగ్య చిత్రాలకు సృజనాత్మకతను జోడించి సమాజాన్ని, వ్యవస్థలను ప్రశ్నించే వారి సంఖ్య రోజు రోజుకు తగ్గుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దిశలో వెళ్లే వారికి వచ్చే బెదిరింపులు, ఒత్తిడిలు కూడా తప్పటం లేదని పేర్కొన్నారు.

గత ముప్పై ఏండ్ల కాలంలో దేశంలో వచ్చిన రాజకీయ మార్పుల నేపథ్యంలో కార్టునిస్టులకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు.ఈ క్రమంలో కులం, మతం, ప్రాంతం, జాతి తదితర అంశాల విషయంలో జాగ్రత్తగా చిత్రాలను గీయాలని సూచించారు. కార్టున్లలోని క్రిటిజం, ఫన్, సెటైర్లు మనిషికి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపే సాధనంగా కూడా ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తెలుగు కార్టునిస్టులు సిండికేషన్స్ వరకు వెళ్లే ప్రయత్నం చేయక పోవడం దురదృష్టకరమన్నారు. ప్రపంచ ప్రేక్షకులను మెప్పించేలా కార్టున్లను గీసి తెలుగువారి సత్తా చాటాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్టునిస్టులు టీవీ, సుభాని, సురేంద్ర, నర్సిం, శంకర్, శంకు, మృత్యుంజయ్, రాము, సంగీత తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యం

- డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ సతీష్‌రెడ్డి
- 'డాక్టర్స్ డే' సందర్భంగా 5కే వాక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జల సంరక్షణ కు, భూగర్భ జలాల పెంపుదలకు, వాన నీటిని సద్వినియోగానికి ప్రజలందరూ తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఆర్‌డీవో మాజీ ఛైర్మెన్ డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు, నీటి సంరక్షణను ఒక ఉద్యమంగా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు.

వాన నీటి సంరక్షణ చేయకపోతే మానవాళి మనుగడ ప్రమాదం లో పడుతుందని ఆయన హెచ్చరిం చారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ దుర్గం చెరువు పార్కులో ఇగ్నైటింగ్ మైండ్స్, వాక్ ఫర్ వాటర్, సింగరేణి సంస్థల ఆధ్వర్యంలో జల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు 5కే నడక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఖాదీ బోర్డు సభ్యులు పేరాల శేఖర్‌రావు, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఐఎంఏ నూతన అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డితోపాటు 200 మందికి పైగా వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలుపాల్గొన్నారు.

సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్‌కు అవార్డు


- ప్రదానం చేసిన గ్రీన్ మ్యాపుల్ సంస్థ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మొక్కలు నాటడమే కాకుండా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్‌కు 'ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ' అనే అవార్డును గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ -2024 అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. సింగరేణి సంస్థను పర్యావరణ హితగా మార్చడమే కాకుండా అందరిలోనూ పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు తానే స్వయంగా 18వేలకు పైగా మొక్కలు నాటి, తెలంగాణలోని 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను (మినీ ఫారెస్ట్) సృష్టించారని ఆ సంస్థ ప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ కూడా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేస్తున్న సంస్థల్లో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న తమ సంస్థ నిబంధనల ప్రకారం పచ్చదనాన్ని కాపాడడంతోపాటు స్వచ్ఛందంగా కూడా పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటినట్టు తెలిపారు. అలాగే పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు వీలుగా సింగరేణి పాఠశాలల్లో పర్యావరణ సిలబస్ బోధిస్తున్నామనీ, ప్రతీ క్లాస్‌లోనూ గ్రీన్ కెప్టెన్లను నియమించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ, ఆయిల్ ఇండియా తదితర కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశ్వగురువుగా మార్చడంలో ప్రయివేటు సంస్థలే కీలకం

- 2015 నుంచి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు
- వాణిజ్య, వ్యాపార వేత్తల ఆత్మీయ సదస్సులో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశాన్ని విశ్వగురువుగా మార్చడంలో ప్రయివేటు సంస్థల భాగస్వామ్యం చాలా కీలకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నొక్కిచెప్పారు. అందులో భాగంగానే ప్రయివేటు సంస్థలకు 2015 నుంచి పెద్దఎత్తున ప్రోత్సహకాలు అందిస్తున్నామని చెప్పారు. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల కోల్ గ్యాసిఫికేషన్ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నామనీ, అందులో ప్రయివేటు రంగం కీలక పాత్ర పోషించబోతున్నదని అన్నారు. వ్యాపార వేత్తలకు మోడీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వాణిజ్య వ్యాపార వేత్తల ఆత్మీయ సదస్సు జరిగింది. అందులో కేంద్ర మంత్రి పీయుష్ గోయల్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లా డుతూ..ప్రభుత్వానికి, పారిశ్రామికవేత్తలకు మధ్య నిర్మాణాత్మకమైన చర్చల ద్వారానే దేశ భవిష్యత్తుకు బాటలు పడుతాయన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు ఎదురయ్యే సవాళ్లపై కార్పొరేట్ కంపెనీలతో చర్చించడానికి, ఆలోచనలు పంచుకోవడానికి, శక్తివంతమైన భాగస్వామ్యాలను నిర్మించడానికి ఇలాంటి వేదికలు అవసరమని అభిప్రా యపడ్డారు. పరిశోధన, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉందనీ, ఇక్కడ తయారైన వ్యాక్సిన్ యావత్ ప్రపంచంలో కరోనా భయాన్ని తొలగించిందని చెప్పారు. ప్రయివేటు రంగ భాగ స్వామ్యం, సాంకేతిక పురోగతి ద్వారా సుస్థిరమైన ఆర్థిక ప్రగతిని సాధ్యమ వుతుదని స్పష్టం చేశారు. ఉద్యోగ కల్పన, ఎగుమతులు పెండానికి వినూత్న ఆలోచనలు అవసరమన్నారు. అందులో భాగంగానే తమ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొస్తున్నదని చెప్పారు. జీఎస్టీ, బ్యాంకింగ్ రంగ సంస్కరణలు, డిజిటలైజేషన్ వంటి చర్యలు దేశాన్ని ముందుకు నడిపించాయన్నారు. స్టార్టప్ కల్చర్ దేశ ప్రగతిలో కొత్త అధ్యాయాన్ని లిఖిం చిందనీ, ఆర్‌అండ్‌డీ సంస్థలకు పెద్దఎత్తున గ్రాంట్లు లభించాయని చెప్పారు. ఆర్టిఫిషియల్, ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీలో సాంకేతి పరిజ్ఞానాన్ని పెంచడానికి ఏఐ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నామన్నారు.

ఎస్ఐ కనబడుట లేదు

నవతెలంగాణ - అశ్వారావుపేట



ఆదివారం ఉదయం నుండి అశ్వారావుపేట ఎస్.హెచ్.ఓ కనిపించడంలేదని సమాచారం. సర్వీస్ రివాల్వర్ అధికారిక నివాసంలో వదిలిపెట్టి పై అధికారులకు సమాచారం లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లినట్టు విశ్వసనీయ సమాచారం. వదంతులు పై వివరణ కోరడానికి అశ్వారావుపేట సీఐ జితేంద్ర రెడ్డి ని సంప్రదించగా ఎటు వెళ్ళాడు అనే సమాచారం లేదు. సాదారణ దుస్తుల్లో ఓ ప్రైవేట్ వాహనంలో వెళ్ళాడు అట. ఇంట్లో సమాచారం ఇవ్వలేదు అని తెలిసి గాలిస్తున్నాం అని తెలిపారు.



స్నేహ్ మాయజాలం

8 వికెట్లతో చెలరేగిన ఆఫ్ స్పిన్నర్
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 266/10

నవతెలంగాణ-చెన్నై : భారత్, దక్షిణాఫ్రికా మహిళల ఏకైక టెస్టులో టీమ్ ఇండియా ఆఫ్ స్పిన్నర్ స్నేహ్ రానా (8/77) మ్యాజిక్ చేసింది. 8 వికెట్ల ప్రదర్శనతో సఫారీ బ్యాటర్లను మాయలో పడేసింది. మరో స్పిన్నర్ దీప్తి శర్మ (2/47) సైతం మెరవటంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 84.3 ఓవర్లలో 266 పరుగులకే కుప్పకూలింది. సఫారీ తరఫున మారజానె కాప్ (74, 141 బంతుల్లో 8 ఫోర్లు), సునె లుస్ (65, 164 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో రాణించారు. 337 పరుగుల వెనుకంజలో నిలిచిన దక్షిణాఫ్రికాను భారత్ ఫాలోఆన్‌కు పిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో సఫారీలు ప్రతిఘటిస్తున్నారు. ఓపెనర్ లారా (93 నాటౌట్, 252 బంతుల్లో 12 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో, సునె లుస్ (109, 203 బంతుల్లో 18 ఫోర్లు) సెంచరీతో కదం తొక్కారు. 85 ఓవర్లలో 2 వికెట్లకు దక్షిణాఫ్రికా 232 పరుగులు చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా మరో 105 పరుగుల వెనుకంజలో నిలిచింది. నేడు చివరి రోజు ఆటలో భారత స్పిన్నర్లు మెరిస్తే.. మరోసారి బ్యాట్ పట్టకుండానే భారత్ విజయం సాధించేందుకు అవకాశం ఉంది.



హెచ్‌సీఏ క్రికెట్ హెడ్‌గా వెంకటేశ్ ప్రసాద్?!

అపెక్స్ కౌన్సిల్‌లో అధ్యక్షుడు జగన్ ప్రతిపాదన

హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) క్రికెట్ వ్యవహారాల హెడ్‌గా భారత మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ప్రతిపాదించినట్టు సమాచారం. హైదరాబాద్‌లో ప్రపంచ శ్రేణి సదుపాయాలతో కూడిన ఆధునాతన స్టేడియం నిర్మాణంపై హెచ్‌సీఏ సిద్ధంగా ఉందని, స్థలం కేటాయింపు కోసం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించనున్నారు. జిల్లా కేంద్రాల్లో ఫస్ట్ క్లాస్ క్రికెట్ స్థాయి మూడు స్టేడియాలను నిర్మించేందుకు అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ నివేదికలను ఆమోదించటంతో బీసీసీఐ నిధుల విడుదలకు మార్గం సుగమం అయ్యింది. హెచ్‌సీఏ క్రికెట్ ఈ నెల 8 నుంచి ఆరంభం కానుండగా.. మహిళల లీగ్ క్రికెట్ రోడ్‌మ్యాప్‌పై అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించారు. హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు ఆర్. దేవరాజ్, సికె శ్రీనివాసరావు, సునీల్ అగర్వాల్‌లు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.



భారత్ జయించిందిలా!

హార్దిక్ పాండ్య.. ఐపీఎల్‌లో దేశవ్యాప్తంగా విద్వేషం చవిచూశాడు. అతడు ఇప్పుడు ప్రపంచ చాంపియన్

జస్‌ప్రీత్ బుమ్రా.. వెన్నునొప్పి గాయంతో ఏడాదికి పైగా ఆటకు దూరంగా ఉన్నాడు. 2022 టీ20 ప్రపంచకప్‌లో ఆడలేకపోయాడు. ఇప్పుడు 2024 టీ20 ప్రపంచకప్‌ను సాధించాడు.

రిషబ్ పంత్.. 2022 రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. సుమారు రెండేండ్లు ఆటకు దూరమయ్యాడు. పంత్ ఇప్పుడు పొట్టి ప్రపంచకప్ విజేత.

2022 టీ20 ప్రపంచకప్ సెమీస్, 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఫైనల్.. కెప్టెన్‌గా రోహిత్ శర్మ గుండెకోత ఎదుర్కొన్న సందర్భాలు. భారత జట్టు సారథిగా నాల్గో ప్రయత్నంలో రోహిత్ శర్మ దేశం గర్వపడే విజయాన్ని అందించాడు. దిగ్గజ ఎం.ఎస్ ధోని సరసన నిలిచాడు.

రాహుల్ ద్రవిడ్.. 2007 వన్డే వరల్డ్‌కప్‌లో మరిచిపోలేని పరాజయం చవిచూశాడు. ఇప్పుడు అదే గడ్డపై 2024 టీ20 ప్రపంచకప్‌ను కోచ్‌గా అందుకుని ఔరా అనిపించాడు.

దశాబ్ది కాలంగా కంటి దిగువన దాగి ఉన్న కన్నీళ్లు ఒక్క విజయంతో ఉబికి వచ్చాయి. క్రికెటర్లు, సహాయక సిబ్బందితో పాటు మాజీ క్రికెటర్లు, అభిమానులు సైతం భావోద్వేగ సంద్రంలో మునిగిపోయారు. 2024 టీ20 ప్రపంచకప్ విజయం అందుకే ప్రత్యేకం.



పొట్టి ప్రపంచకప్ విజేతలకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ నజరానా ప్రకటించింది. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ సాధించిన రోహిత్‌సేనకు రూ.125 కోట్ల నగదు బహుమతి అందిస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించాడు. అద్వితీయ విజయం సాధించిన క్రికెటర్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి బీసీసీఐ అభినందనలు తెలిపింది.

- కెప్టెన్ రోహిత్, కోచ్ ద్రవిడ్ దూకుడు మంత్ర
- ఫలించిన నలుగురు ఆల్‌రౌండర్ల కూర్పు
- జట్టులోని ప్రతి ఆటగాడిపై ఎనలేని నమ్మకం
- టీమ్ ఇండియా భావోద్వేగ విజయ ప్రస్థానం

నవతెలంగాణ క్రీడావిభాగం

ప్రపంచ క్రికెట్ అగ్రజట్టు. అత్యంత ధనిక క్రికెట్ బోర్డు. స్వదేశంలో వంద కోట్ల విశేష అభిమాన ఆదరణ. అయినా, పదేండ్లుగా ఐసీసీ టైటిల్ విజయం లేదనే వెలితి. టీమ్ ఇండియా ద్వైపాక్షిక సిరీస్ పులి అంటూ.. పాశ్చాత్య మీడియా, క్రికెట్ విశ్లేషకులు హేళన చేసిన సందర్భాలు సైతం ఉన్నాయి. పదేండ్ల నిరీక్షణకు తెరదించుతూ రోహిత్‌సేన టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను స్వదేశానికి పట్టుకొచ్చింది. పొట్టి ప్రపంచకప్ ట్రోఫీని భారత్ అందుకునేందుకు.. తెరవెనుక, తెర ముందు అవిశ్రాంత పోరాటం చేసిన హీరోల గురించి...!

నాయకుడు రోహిత్

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో రోహిత్ ఒకడు. ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిల్స్ అందించిన రోహిత్.. భారత్‌కు ఐసీసీ టైటిల్ లోటు తీర్చగలడని అప్పటి బీసీసీఐ బాస్ గంగూలీ గట్టిగా విశ్వసించాడు. రోహిత్ శర్మకు కెప్టెన్సీ పగ్గాలు దక్కటంలో దాదా పాత్ర ఎక్కువ. 2022 టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్లో పోటీ ఇవ్వకుండా ఓటమి పాలైంది. అక్కడే కెప్టెన్ రోహిత్ శర్మ ఓ నిర్ణయానికి వచ్చాడు. సంప్రదాయ క్రికెట్‌తో ఐసీసీ టైటిల్ సాధించలేమని.. బ్రేకుల్లేని దూకుడు మంత్ర అవసరమని భావించాడు. జట్టుకు దూకుడు మంత్ర ఎక్కించాడు. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో ముందుండి ఎదురుదాడి చేశాడు. అజేయంగా ఫైనల్‌కు చేర్చినా.. ఆఖర్లో నిరాశే ఎదురైంది. అదే పంథా కొనసాగించి కరీబియన్ దీవుల్లో కప్పు కైవసం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో రోహిత్, పంత్, సూర్య పవర్‌ప్లేలో నిష్క్రమించినా.. క్రీజులోకి వస్తూనే అక్షర్ పటేల్ బౌండరీ బాదటం వెనుక రహస్యం ఇదే ఫార్ములా. వికెట్లు పడినా.. ఎదురుదాడి ట్రాక్ వీడొద్దనే ఫార్ములా భారత్‌ను నేడు చాంపియన్‌గా నిలిపింది.

ది వాల్.. గురువు

భారత క్రికెట్ జెంటిల్‌మెన్ రాహుల్ ద్రవిడ్. స్వతహాగా సంప్రదాయ క్రికెటర్. కానీ కోచ్‌గా తన టీమ్‌ను పూర్తి భిన్న పథంలో నడిపించాడు. ఆటగాడిగా దక్కని ఐసీసీ టైటిల్‌ను.. కోచ్‌గా చివరి రోజు సాధించాడు. గతంలో తుది జట్టు కూర్పులో ప్రతి మ్యాచ్‌కు మార్పులు చేర్పులు సహజం. కానీ ఈ ప్రపంచకప్‌లో భారత్ 12 మంది ఆటగాళ్లతో బరిలోకి దింపింది. ప్రదర్శనతో సంబంధం లేకుండా ఆటగాళ్లపై విశ్వాసం ఉంచిన ద్రవిడ్.. గొప్ప ఫలితం సాధించాడు. తుది జట్టు కూర్పులో నలుగురు ఆల్‌రౌండర్లను ఎంచుకోవటం భారత్‌కు బాగా కలిసొచ్చింది. రవిశాస్త్రి, అనిల్ కుంబ్లేలు ఐసీసీ టైటిల్‌కు చేరువగా వచ్చినా.. రాహుల్ ద్రవిడ్ ఒక్కడే గత దశాబ్ది కాలంలో చాంపియన్‌గా నిలిచిన భారత చీఫ్ కోచ్.

విరాట పర్వం

టీ20 ప్రపంచకప్ జట్టులో విరాట్ కోహ్లి చోటుపై ప్రశ్నలు. గ్రూప్, సూపర్8 మ్యాచుల్లో వైఫల్యంతో విమర్శలు. అయినా, జట్టు మేనేజ్‌మెంట్ కోహ్లిపై నమ్మకం ఉంచింది. కెరీర్ చివరి టీ20 మ్యాచ్‌లో కోహ్లి క్లాస్ చూపించాడు. బ్యాటింగ్‌కు సహకరించిన పిచ్‌పై సహచర బ్యాటర్లు నిరాశపరిచినా.. ఓ ఎండ్‌లో గట్టిగా నిలబడ్డాడు. 2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్ తరహాలో 2024 టైటిల్ పోరులో అర్ధ సెంచరీతో ఆదుకున్నాడు. అన్ని మ్యాచుల్లో పరుగుల వేట ఓ ఎత్తు.. టైటిల్ పోరు ఒక్కటీ ఓ ఎత్తు అని మరోసారి నిరూపించాడు. ఫైనల్లో విన్నింగ్ ఇన్నింగ్స్‌తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

రథ సారథి బుమ్రా

బ్యాటింగ్‌కు పెద్దగా అనుకూలించని పిచ్‌లపై టీమ్ ఇండియాను విజయ తీరాలకు చేర్చిన రథ సారథి, పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా. గ్రూప్ దశలో పాకిస్థాన్‌పై నిప్పులు చెరిగిన బుమ్రా.. స్వల్ప స్కోరును నిలబెట్టాడు. ఫైనల్లోనూ చేజారింది అనుకున్న మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. చరిత్ర పుటల్లో నిలిచిపోయే బుల్లెట్ల వంటి బంతులను సంధించాడు. భారత్ కష్ట కాలంలో ప్రతి సారి బంతి అందుకుని వికెట్ల వేట సాగించాడు. యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 8 మ్యాచుల్లో 17 వికెట్లు కూల్చగా.. బుమ్రా 8 మ్యాచుల్లో 15 వికెట్లు కూలదోశాడు. అర్ష్‌దీప్ సింగ్ సగటు 12.64 కాగా.. బుమ్రా సగటు 8.26 కావటం విశేషం. ముంబయి ఇండియన్స్‌కు ఐపీఎల్ నరాలు తెగే ఉత్కంఠ ఫైనల్లో అద్వితీయ విజయాలు అందించిన బుమ్రా.. ఈసారి ఆ పని భారత్‌కు చేసి పెట్టాడు. బుమ్రా లేకుండా భారత టీ20 ప్రపంచకప్ విజయాన్ని ఊహించలేం.

ప్రజానేతగా ఎదుగుతారా ?

రాహుల్‌పై బాధ్యతల బరువు

- మిత్రులను కలుపుకుపోవాలి
- పార్టీలో కుమ్ములాటలను నిలువరించాలి
- తరాల అంతరాలు తగ్గించాలి
- మోడీని దీటుగా ఎదుర్కోవాలి



న్యూఢిల్లీ : రాజకీయాల్లో ఉత్థానపతనాలు సర్వసాధారణమే. పలువురు నాయకులు పడి లేచిన కెరటం మాదిరిగా పరాజయాలు, పరాభవాలను దాటుకుంటూ ప్రజా జీవనంలో తమ ప్రస్థానాన్ని కొనసాగించారు. అలాంటి వారిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను రాహుల్ అభినందిస్తుంటే ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆయన వెనుక నిలబడిన దృశ్యాన్ని చూసిన వారికి అదే భావన కలిగి ఉంటుంది.

రాజకీయాల్లో రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం లోక్‌సభలో ప్రతిపక్షాల ముందు వరుసలో రాహుల్‌కు స్థానం లభించింది. ఆయన తండ్రి రాజీవ్ గాంధీ, తల్లి సోనియా గాంధీ కూడా గతంలో ప్రతిపక్ష నేతలుగా వ్యవహరించారు. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో సోనియా దాదాపు ఐదు సంవత్సరాల పాటు ప్రతిపక్ష నేతగా కొనసాగారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీకి ఇప్పుడు ఎన్నో అధికారాలు, సౌకర్యాలు లభించాయి.

ఇప్పటి వరకూ పాత్ర తక్కువే

ఇరవై సంవత్సరాలకు పైగా ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీ చట్టసభలో కేవలం 99 ప్రశ్నలు మాత్రమే వేశారు. 26 చర్చల్లో మాత్రమే భాగస్వామి అయ్యారు. సమావేశాలకు హాజరైంది కూడా చాలా తక్కువే. 2014 నుండి జరిగిన పలు బడ్జెట్ సమావేశాలకు ఆయన హాజరు కాలేదు. అప్పుడప్పుడు మాత్రం తళుక్కుమని సభలో మెరిసేవారు. ఆయన నియమించిన వారు కూడా ప్రధాని మోడీని గట్టిగా నిలదీయలేకపోయారు. ఇప్పుడు రాహుల్ స్వయంగా ప్రతిపక్ష నేత అయినందున ఇకపై ఆయన ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వచ్చిన ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. ఆయన ఆ పని చేస్తారా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

భాగస్వాములను కలుపుకుంటూ...

ఇప్పుడు రాహుల్ తిరిగి కాంగ్రెస్‌కు జీవం పోశారు. సామాజికంగా ఆయన అందరికీ ఆమోదయోగ్యుడయ్యారు. వయసు కూడా ఏమంత ఎక్కువ కాదు. అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, సుప్రియా సూలే, కనిమొళి, ఒమర్ అబ్దుల్లా, అభిషేక్ బెనర్జీ, కేజ్రీవాల్, ఆదిత్య ఠాకరే వంటి నేతలు ఇప్పుడు రాహుల్‌కు సహజ మిత్రులు. డీఎంకే, ఆర్జేడీ పార్టీలు రాహుల్‌ను భావి ప్రధానిగా చూపాయి. అయితే ఇప్పటికీ కాంగ్రెస్‌కు చాలా రాష్ట్రాల్లో సరైన ఉనికి లేదు. కానీ అక్కడ ప్రాబల్యం కలిగిన మిత్రులు ఉండడం కలిసొచ్చే అంశం. వారి ఆధిపత్యాన్ని అంగీకరిస్తూ రాహుల్ ముందుకు సాగాల్సి ఉంటుంది. ఒకప్పటి తన విమర్శకుడైన శరద్ పవార్‌కు సోనియా గాంధీ పెద్దపీట వేసి, 2004లో అధికారంలోకి రాగలిగారు. యూపీఏ మిత్రపక్షాలకు కీలకమైన మంత్రి పదవులు ఇచ్చారు. సంకీర్ణ రాజకీయాల్లో ఇది అందరికీ ఓ పాఠం కావాలి.

1984 నుండి 2019 వరకూ...

కాంగ్రెస్ తనంత తానుగా ఇప్పట్లో అధికారాన్ని సొంతం చేసుకునే అవకాశాలు లేవు. 1984 తర్వాత ఆ పార్టీకి లోక్‌సభలో ఎప్పుడూ మెజారిటీ రాలేదు. 1984లో మాత్రం రాజీవ్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్‌కు అత్యధికంగా 404 స్థానాలు వచ్చాయి. ఎనిమిది సంవత్సరాల పాటు రాజకీయ ఎడారిలో గడిపిన కాంగ్రెస్ పార్టీ 2004లో బీజేపీని ఓడించింది. 2009లో కూడా సోనియా నేతృత్వంలోనే కాంగ్రెస్ బలం 200 దాటింది. 2014లో సీన్ రివర్స్ అయింది. ఆ పార్టీ కేవలం 44 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2019లోనూ ఆ పార్టీకి దక్కింది 52 సీట్లే. కాంగ్రెస్ కంటే గాంధీలనే ఎక్కువగా లక్ష్యంగా చేసుకొని మోడీ రాజకీయాలు నడిపారు.

పాత, కొత్త తరాల కలయికతో...

పది సంవత్సరాల పాటు ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన నరేంద్ర మోడీ ఇప్పుడు తొలిసారిగా సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నారు. మిత్రుల నుండి అప్పుడే డిమాండ్లు మొదలయ్యాయి. బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని జేడీయూ అధినేత నితీష్ కుమార్ కోరుతున్నారు. అందుకు మోడీ తలవంచడమో లేదా తిరస్కరించడమో చేయాల్సి ఉంటుంది. ఈ కీలకమైన పరిణామాన్ని రాహుల్ తనకు అనుకూలంగా మలచు కోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్‌లో ముఠాల కుమ్ములాటలు కొత్తేమీ కావు. పార్టీ నేతలందరినీ ఏకం చేసి, పార్టీని యుద్ధానికి సన్నద్ధం చేయడం రాహుల్ ముందున్న కర్తవ్యం. కాంగ్రెస్‌లో వృద్ధ నేతల సంఖ్య తక్కువే. యువత, మధ్య వయస్కులే ఎక్కువగా ఉన్నారు. సచిన్ పైలట్, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్, గౌరవ్ గొగోయ్, నానా పాటోల్, దీపేందర్ హూడా, శశి థరూర్, భూపేష్ బాఘేల్ వంటి నేతలు వ్యక్తిగతంగా, పార్టీ పరంగా తమ తమ ప్రాంతాలలో విజయాలు సాధించగలరు. వారందరినీ కూడగట్టుకొని, పాత కొత్తల మేలు కలయికతో ముందడుగు వేస్తే రాబోయే కాలంలో బీజేపీని నిలువరించడం కష్టమేమీ కాబోదు. అప్పుడే ఆయన ప్రజా నేతగా ఎదుగుతారు.

ఎన్జీఓలపై ఉక్కుపాదం తగదు

- క్రూరమైన చట్టాలతో వేధింపులు సరికాదు
- 700 సంస్థలపై ఆధారాలే లేవు
- అంతర్జాతీయ సంస్థ ఎఫ్ఏటీఎఫ్ నివేదిక

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలపై ఉక్కుపాదం మోపుతోందని అంతర్జాతీయ సంస్థ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) అభిప్రాయపడింది. ఉగ్రవాదులకు ఆర్థిక సాయం, మనీలాండరింగ్ కార్యకలాపాలపై ఈ సంస్థ పరిశీలన జరుపుతోంది. జూన్ 23-28 తేదీల మధ్య సింగపూర్‌లో ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశం జరిగింది. కువైట్, భారత్‌లో నెలకొన్న పరిస్థితులపై రూపొందించిన నివేదికలను ఈ సమావేశంలో చర్చించారు. భారత్‌లో స్వచ్ఛంద సంస్థల విషయంలో తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా లేవని అంటూ నేరస్థులను విచారించే విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని సమావేశం సూచించింది. ఉగ్రవాదానికి సాయం అందకుండా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అదే సమయంలో ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందిస్తున్నాయన్న కారణం చూపి స్వచ్ఛంద సంస్థలను వేధించకూడదని తెలిపింది.

స్వచ్ఛంద సంస్థలను అణచివేసేందుకు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) వంటి వాటిని భారత్ ప్రయోగిస్తోందని, ఈ వైఖరి తమ మార్గదర్శకాలకు అనుగుణంగా లేదని ఎఫ్ఏటీఎఫ్ స్పష్టం చేసింది. ప్రమాణాలను సాకుగా చూపి ఎన్‌జీఓలపై విరుచుకుపడడం సరికాదని హితవు పలికింది. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఎఫ్‌సీఆర్ఏను 2020లో మరోసారి సవరించిన విషయం తెలిసిందే. విదేశీ విరాళాలు పొందే ఎన్జీఓలపై నిఘాకు, నియంత్రణకు ఈ సవరణ ప్రభుత్వానికి అధికారాలు కట్టబెట్టింది. అదే విధంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం, ఉపాను కూడా మోడీ ప్రభుత్వం సవరించి వాటిని మరింత క్రూరమైన చట్టాలుగా మార్చింది. ఎఫ్ఏటీఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం చెప్పుకుంది.

ఈపీఎఫ్ఓలో తగ్గిన కొత్త సభ్యులు



న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ)లో కొత్త సభ్యుల చేరిక తగ్గిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే 2023-24లో కొత్త చందాదారుల సంఖ్య 4 శాతానికి తగ్గి 10.9 మిలియన్లకు చేరిందని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక తెలిపింది. 2022-23లో ఈపీఎఫ్ఓలో 11,498,453 మంది కొత్త సభ్యులు అదనంగా చేరగా 2023-24లో 10,993,119 మాత్రమే చేరారు. నూతన సభ్యుల చేరిక తగ్గడానికి కోవిడ్ కూడా కారణమేనని భావిస్తున్నారు. 2019-20లో 11,040,683 మంది కొత్త సభ్యులు చేరగా 2020-21లో 8,548,898 మంది చేరారు. 2021-22లో సభ్యుల సంఖ్య మళ్లీ పెరిగి 10,865,063కు చేరింది.

ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2020, 2021లో పలు ఆంక్షలు విధించాయి.

ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగాలపై ప్రభావం పడింది. 2023-24కు ముందు ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఈపీఎఫ్ఓలో చేరిన నూతన సభ్యుల సంఖ్య కోవిడ్‌కు ముందున్న 2018-19 స్థాయికి చేరుకోలేకపోయింది. 2018-19లో ఈపీఎఫ్ఓలో 13,944,349 మంది కొత్త సభ్యులు చేరారు. కాగా ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ)లో కూడా నూతన సభ్యుల చేరిక తగ్గింది. 2022-23లో 17,760,672 మంది సభ్యులు చేరితే 2023-24లో మంది 16,773,023 మాత్రమే చేరారు. జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్)లో మాత్రం నూతన చందాదారుల సంఖ్య పెరిగింది.

ఇసుక వాన

నజీబ్ కావచ్చు నారాయణ కావచ్చు
ఆకలి వేటగాడి బాణం ములుకులు
తప్పించుకోవడానికి
పచ్చని తరువుల గొడుగులు
చల్లని నదీ ప్రవాహాలు కన్ను తెరిచిన ఊరు
కన్నతల్లికి దూరంగా సాగే వలస పాటలు
దుఃఖ గీతాల పల్లవులు
ఎటు చూసినా ఇసుక అలల సముద్రం
ఇరవైనాలుగు గంటలు వెట్టిచాకిరీ చేసినా
గుక్కెడు నీళ్లు, రొట్టెముక్క విదిలించని
ఇనపగుండెల షేక్‌లు
మనసు బరువు దించుకోవడానికి
ఒంటరితనం ముళ్ళకంపల్ని పెరికి వేయడానికి



మరో మనిషి తోడు లేని
ఎడారిలో జ్ఞాపకాలే ఊపిరి
పగలూ రాత్రీ వారాలూ నెలలూ ఏళ్ళూ
కాల గమనం ఆగిపోయి
చుట్టూ మూగిన గొర్రెల మందలో
తానూ ఒక జంతువైన విషాద వాస్తవం
మాటా పలుకూ మరచి
పెరిగిన వెంట్రుకలే వస్త్రాలై
ఆది మానవుడిగా తిరోగమించిన వేళ
ఆకలి ఒక నరకం వలస ఒక నరకం
భాష కాని భాష దేశం కాని దేశంలో
ఎటు చూసినా ఇసుక మేరువులు
కళ్ళు మూసినా కళ్ళు తెరచినా ఇసుక తుఫాన్లు
చిన్నప్పుడు ఆటల్లో
ఇసుక పడి మంటలు పుట్టిన కళ్ళు
పెద్దయ్యాక ఆకలి బతుకుల్లో
ఆగక కురుస్తున్న ఇసుక వాన

- మందరపు హైమవతి,
9441062732

ఊహలకు రెక్కలు తొడిగి



- పుప్పాల కృష్ణమూర్తి
99123 59345

నేడు తెలుగునాట బాలలు రచనలపంటలు పండిస్తున్నారు. గత పదేళ్ళ నుంచి నేటి వరకూ, పాఠశాల విద్యార్థులు రాసిన (142) సంకలనాలు వెలుగు చూశాయి. ఇందులో ఎక్కువగా కథా సంకలనాలు తెలంగాణ రాష్ట్రం నుండే వెలువడటం మన రాష్ట్రానికి గర్వకారణం. దీనికి కారణం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు చిన్ననాటినుండే పిల్లలకు అవగాహన ఏర్పడాలనే ఆలోచనతో కొత్త పాఠ్యాంశాలను రూపకల్పన చేయడం.

ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు గల తెలుగు పాఠ్యపుస్తకాలలో పాఠం చివర సృజనాత్మకత, ప్రశంస ఉండేలా ఏర్పాటు చేశారు. ఇందులో కథ, కవిత, సంభాషణ, లేఖారచనా, కరపత్రం, ఇంటర్వ్యూ, విశ్లేషణ మొదలగు సాహితీ ప్రక్రియలపై ప్రశ్నలు ఉంటాయి. పరీక్షల్లో వాటికి మార్కులు ఉంటాయి. కాబట్టి విద్యార్థులు తప్పకుండా వీటిని చదవడం, రాయడం చేస్తున్నారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయించే కార్యక్రమంలో భాగంగానే, తెలుగును బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మక రచనల్లో తర్ఫీదునిస్తున్నారు. మన తెలుగు వాచకాలు రూపొందించిన రచయితలు కొత్తగా ఈ అంశాన్ని చేర్చారు. ఇది పిల్లల ఆలోచనలకు రెక్కలు తొడిగి, సృజనకారులుగా తయారవడానికి ఎంతో దోహదం చేస్తోంది. నిబద్ధత, రచనా రంగంలో ప్రవేశమున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పిల్లలను ఎక్కువగా ప్రోత్సహిస్తూ, వారినుండి మరిన్ని రచనలు రావడానికి రాచబాటలు వేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులకు, రోజూ పిల్లలు రాసే రచనలను చూడడం ఒక దినచర్యగా, బోధనలో భాగంగా మారిపోయింది.

నేటి పిల్లలు స్వతహాగానే తెలివైన వారు. క్రియేటివిటీ అంశంగా, వారి మెదళ్ళకు పని పెట్టడంతో లెక్కకు మిక్కిలి కథలు, కవితలు, వ్యాసాలు, లేఖా రచనలు మొదలగునవి రాస్తున్నారు. స్వరాష్ట్రం ఏర్పాడ్డాక వారిలోని సృజనాత్మక రచనలను మొదటిగా పుస్తకరూపంలో తెచ్చిన ఉపాధ్యాయులు గరిపల్లి అశోక్ గారిని ప్రశంసించాలి. 2014 లో తాను పనిచేసే ముస్తాబాద్ పాఠశాల పిల్లలతో 'జాంపండ్లు' కథా సంకలనాన్ని తీసుకొచ్చారు. ఇందులో 34 మంది పిల్లలు రాసిన కథలున్నాయి. అది మొదలు తెలంగాణ రాష్ట్రంలోని (33) జిల్లాల్లో, వివిధ పాఠశాలల్లోని విద్యార్థులు సృజనాత్మక రచనలతో సంకలనాలను వెలువరించారు. ఇందుకు ఆర్థికంగా అదే పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు, కొన్నిచోట్ల సాహిత్యంపై ప్రేమ ఉన్న దాతలు సహకరించారు. అప్పటి నుండి ఈ ఏడాదిలో షాద్‌నగర్ పిల్లలు రాసిన 'రంగుల ప్రపంచం' వరకూ ఈ కథా సంకలనాల పరంపర కొనసాగుతోంది. ఇది సామాన్య విషయం కాదు. సుమారు నాలుగు వేల మంది పిల్లలు సృజనాత్మక రచనల్లో ఉన్నారు. నూతనంగా ఆలోచించి రాయడం ఒక్క మార్కుల ప్రయోజనం కోసమే కాదు. వారు కథ రాసినా, కవిత రాసినా అన్యాయాన్ని ఎదిరిస్తూ, న్యాయం వైపు నిలబడి గెలిచేలా చేస్తారు. ఆ మేరకు విద్యార్థుల్లో భాషపట్ల మమకారం, విస్తృత పద పరిచయం, పెద్దల పట్ల గౌరవం, పిన్నల పట్ల ప్రేమ, ప్రకృతి పట్ల మమకారం, తార్కిక శక్తి, సమస్యలను ఎదుర్కునే నేర్పు, ప్రజల పట్ల అనుబంధం, జాతీయనాయకుల పట్ల ఆరాధన, దేశభక్తి, నైతిక విలువలు... మొదలగు సద్ లక్షణాలు వారిలో రూపుదిద్దుకుంటాయి. ఇందుకు ఎక్కువగా పాఠశాలల్లో పనిచేసే తెలుగు భాషోపాధ్యాయులను అభినందించాలి. వీరే కాక బాల సాహిత్య రచయితలు చొక్కాపు వెంకటరమణ, పత్తిపాక మోహన్, పుప్పాల కృష్ణమూర్తి, డాక్టర్ సిరి, పైడిమర్రి రామకృష్ణ వంటి ఉపాధ్యాయులు కాని వారు కూడా విద్యార్థులకు కథా రచనలో శిక్షణనిచ్చి బాలల రచనలతో సంకలనాలు వచ్చేలా కృషి చేస్తున్నారు. కానీ వీరి ద్వారా వచ్చేవి పరిమిత సంఖ్యలోనే. నిత్యం విద్యార్థులతో ఉపాధ్యాయులకు పాఠశాల అనుబంధం ఉంటుంది కనుక, ఎక్కువగా ఉపాధ్యాయులు పూనుకొని, తమ సంపాదక బాధ్యతలతో వెలువరించినవే ఎక్కువ.

అదే క్రమంలో ముక్కామల జానకిరామ్ అనే తెలుగు ఉపాధ్యాయుని గురించి కూడా చెప్పుకోవాలి. తను స్వయంగా కవి. ఉగాది, తెలుగు భాషా దినోత్సవం, వివిధ కవిసమ్మేళనాల్లో కవితలు రాసి సీనియర్ కవుల అభినందనలు అందుకున్నాడు. గేయ రచయితగా తాను పల్లెపై రాసిన కొన్ని పాటలకు బాణీలు కట్టించి, సంగీత దర్శకునితో కంపోజ్ చేయించి 'యూ' ట్యూబులో పెట్టాడు. ఈ పాటలకు చాలా ప్రశంసలు వచ్చాయి. కథారచయితగా తెలుగునాట బాల సాహిత్యం రాసే వారందరికీ వీరి పేరు పరిచయమే. పలు తెలుగు దినపత్రికల్లో వీరి అనేక కథలు ప్రచురింపబడ్డాయి. పిల్లలు ఆన్‌లైన్ మోజులో పడి, పుస్తకాలను దూరం చేసుకుంటున్నారనే ఆవేదనతో ఇటీవలే 'ఆఫ్ లైన్' పిల్లల కథల పుస్తకాన్ని (22), రంగుల్లో తీసుకు వచ్చారు. ఈ పుస్తకం మీద జాతీయ దినపత్రికల్లో చక్కటి సమీక్షలు వచ్చాయి.

ఈ ఉపాధ్యాయుడు రెండేళ్ల క్రితం సూర్యాపేటలోని మేళ్లచెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చాడు. తాను వచ్చింది మొదలు విద్యార్థుల మీద ప్రత్యేక దృష్టి పెట్టాడు. వారిలోని సృజనాత్మకతను కనిపెట్టి ప్రత్యేక తరగతులు తీసుకొని, కథారచనలో శిక్షణ ఇచ్చాడు. వారిలో యాభై మందికి పైగా విద్యార్థులు వివిధ అంశాల మీద కథలు రాసి, గురువు చేతిలో పెట్టారు. వాటిని జల్లెడ పట్టి (33) కథలతో 'ఊహలకు రెక్కలొస్తే' పేరుతో కథా సంకలనం తీసుకొచ్చాడు. ప్రధానోపాధ్యాయులు నారపరెడ్డి, వారి మిత్ర బృందం ఆర్థిక తోడ్పాటును అందించగా, అందంగా పుస్తకం ముస్తాబై అదే పాఠశాలలో ఆవిష్కరణ జరిగి విద్యార్థుల చేతుల్లోకి వచ్చింది. తమ రచనలను అచ్చులో చూసుకున్న విద్యార్థుల సంతోషం వర్ణించలేనిది. సభకు హాజరైన తల్లిదండ్రుల ముఖాల్లోని సంతృప్తి కొలవలేం. అత్యాశ పనికి రాదని సమీర్ అనే 10వ తరగతి విద్యార్థి జంతువుల కథతో 'గుణపాఠం' కథ రాస్తే, విద్యార్థుల పాత్రలతో చదువును అశ్రద్ధ చేయకూడదని నాగేశ్వరి అనే 7వ తరగతి విద్యార్థిని 'చదువు విలువ' రాసింది. కొందరు పర్యావరణం మీద, మరికొందరు జంతువుల పట్ల ప్రేమ కలిగి ఉండాలని, మరో విద్యార్థి 'జంక్ ఫుడ్' తినకూడదని, మరో విద్యార్థిని 'సమయం విలువ' పాటించాలని... ఇలా విద్యార్థులు అలవరచుకోవాల్సిన, ఆచరించాల్సిన మంచి లక్షణాలను కథల్లో ఇమిడ్చి ఎంతో చక్కగా రాశారు. పుస్తక ఆవిష్కరణకు హాజరైన రిటైర్డ్ కె.ఆర్.ఆర్. కళాశాల తెలుగు ఉపన్యాసకులు భరతారావు, ప్రజా వైద్యులు సుబ్బారావు... 'వీరిలో నాకు గొప్ప భావి రచయితలు కనిపిస్తున్నారని' ప్రశంసించి, చందమామ కథల పుస్తకాలు (4) వాల్యుములు పాఠశాలకు అందజేశారు.

నూతనంగా ఆలోచించి రాయడం ఒక్క మార్కుల ప్రయోజనం కోసమే కాదు. వారు కథ రాసినా, కవిత రాసినా అన్యాయాన్ని ఎదిరిస్తూ, న్యాయం వైపు నిలబడి గెలిచేలా చేస్తారు. ఆ మేరకు విద్యార్థుల్లో భాషపట్ల మమకారం, విస్తృత పద పరిచయం, పెద్దల పట్ల గౌరవం, పిన్నల పట్ల ప్రేమ, ప్రకృతి పట్ల మమకారం, తార్కిక శక్తి, సమస్యలను ఎదుర్కునే నేర్పు, ప్రజల పట్ల అనుబంధం, జాతీయనాయకుల పట్ల ఆరాధన, దేశభక్తి, నైతిక విలువలు... మొదలగు సద్ లక్షణాలు వారిలో రూపుదిద్దుకుంటాయి.



ఇటీవలే కెనడాలో నివసించే తెలుగు సాహిత్య ప్రేమికులు ఏర్పాటు చేసిన 'గడుగ్గాయి' అంతర్జాతీయ ఆన్ లైన్ పిల్లల మాస పత్రిక వారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కథల పోటీ నిర్వహించగా, ఈ పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులు కథలు రాసి పోటీకి పంపారు. మాడుగుల మహా లక్ష్మి అనే 8వ తరగతి విద్యార్థిని రాసిన 'ఆకుపచ్చని ఆలోచన' కథకు ప్రథమ బహుమతి లభించింది. 1500/- రూపాయలు ప్రైజ్ మనీ పంపారు. మిగతా నలుగురు శృతి, మేఘన 8వ తరగతి, స్రవంతి, గణేశ్ అనే 10 వ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు లభించాయి.

పిల్లల హృదయం మెత్తని పట్టుదూది లాంటిది. సృజనాత్మకత అనే నిప్పురవ్వను అంటిస్తే, కథై, కవితై వెలుగుతారు. ఆ వెలుగులో సమాజంలోని చీకట్లను తొలగించడానికి ప్రయత్నిస్తారు. వారి సాహిత్య ప్రయాణం నిరంతరంగా కొనసాగాలని కోరుకుందాం.

మేడి పండు



నా చూపులతోనే అందరూ
నాగరికతను అధ్యయనం చేయాలి
నా రహస్య ఎజెండానే
వాచకం కింద చెదలులా
జ్ఞానమందిరాల్లో విస్తరించాలి...
హేతువును చంపి
కాలం చెల్లిన పురాతన తత్వాన్ని
తరగతిగది సాక్షిగా బతికించాలి..
అసమసమాజ విషనీతిని
భావిభారత పౌరుల నరాల్లోకి దట్టించాలి
ప్రసిద్ధ సత్యాలను ప్రణాళికాబద్ధంగా చెరిపి వేసి
అస్మదీయుల ఘనతంత్రాలు వల్లించిన
కుటిల పుటలను చరిత్రకు అతికించాలి..
అమేయ మానవ మేధను
ఉక్కుపాదంతో తొక్కిపెట్టి,
అలౌకిక శక్తుల పాదాలకు మోకరిల్లే
సిద్ధాంతాలను ప్రబోధించాలి..
కుంకుమరంగులో మెరిసే నా మెదడును
రేపటి తరం బుర్రలో ప్రతిష్ఠించాలి..
నా ఆలోచనలకు కాసిన
మేడిపండును దేశభావి నిర్ణేతలకు
మెరుగైన ఆహారంగా పంచిపెట్టాలి ..
ఏ నోరూ నన్ను ప్రశ్నించకూడదు
ఏ పెన్నూ రాజ్య ధిక్కారాన్ని లిఖించకూడదు
పాత గడ్డి మేసి పరమ విధేయంగా
ఏలిన వారికి దండం పెట్టే
నవ యువ గంగిరెద్దులను
తక్షణం తయారు చేయటమే నా విధానం

- కోయి కోటేశ్వర రావు, 9440480274

అంటరాని మనిషి



దరి దొరికేది ఎక్కడో
తీరం చేరేది ఎప్పుడో
జీవితం చిత్ర విచిత్రంగా
సర్కస్ తీగ మీద ఆడుతున్నది
వెతుకుతున్న దారం కొస
ఇంకెవడో లాగుతున్నట్టు
బ్రతుకు చిక్కుబడుతున్నది
పైసకు ముఖం వాచినట్టు
కూలి పనికి ఎగబాకుతున్న కొద్దీ
ఎన్నుబొక్కకు డొక్క అంటుకుపోతున్నది
ఎంత ఒళ్ళొంచినా
జేబు నిండా మనసు మెచ్చని ఖాళీ
ఆపద ఏదో గుండెల మీద
దాడి చేసినప్పుడు ఊరుచెట్టు ఎంత ఊపినా
రూపాయి రాలదు
సాయం కొరకు ఏ గడప తొక్కినా
ఇంటి ముందున్న మనీ ప్లాంటు
బిచ్చగాడిని తరిమినట్టు తరిమే
విదేశీ కుక్కపిల్ల
డబ్బును ప్రేమించే లోకంలో
మనిషే అంటరానోడు
కాసుల చుట్టూ తిరిగే ప్రపంచంలో
పేద బక్కోడు దిక్కులేనోడు.

- గజ్జెల రామకృష్ణ,
8977412795

అత్తరుపూల రాగం

తొలకరిలో.. మట్టి ఊరంతా అత్తరు పూల
రాగమాలపించినట్టు సాయిబు తాత.
నా తోపుడు బండి మీద
జాజిపూల అత్తరు గులాబీ అత్తరు
మొగలిపూల అత్తరు సంపంగిపూల అత్తరు
లిల్లీ పూల అత్తరు షాజహానా అత్తరు
ఫిరదౌస్ అత్తరు శాండిల్ అత్తరు
నిజాం అత్తరులను
వీధి అంతా పరిచయం చేస్తూ
బతుకుదెరువు రాగమయ్యేవాడు.
సాయిబు తాత వస్తుంటే
ఊరంతా పండుగ సందడేదో
సీతాకోకల్లా పలకరించిపోయేది.
చిన్నప్పుడు మేమంతా పెళ్లిళ్లకు వెళ్లేప్పుడు
అమ్మ మా బట్టలకు అత్తరు పూసేది.
అప్పుడు మా చుట్టూ గులాబీ గులాబీ తోటలు
మత్తుగా పాటలు పాడేవి.
తాత కనిపించడం లేదు.
అచ్చూ ఎండాకాలంలో
ఆవిరైన ఏటి వాగులానే అత్తరు దుఃఖం
అత్తరు పాట లేదు.
మాయమైన మానవ సంబంధాల
అలాయి బలాయి
సీతాకోక పలకరింపులు లేవు.
విరగబూసిన బతుకు తోటలు లేవు.
ఊరూరికీ షాపింగ్ మాల్స్ అవతరించాక
ప్రేమానురాగాల అత్తరు పాటలు లేవు.



గంట కొట్టే పీచు మిఠాయి తాత
పలకరింపులు లేవు.
గాజుల తాత గలగల మాటల
అనుబంధం లేదు.
అత్తరు పాటలు లేవు.
సాయిబు తాత
జ్ఞాపకాలు పరిమళిస్తూనే ఉన్నాయి.

- రేపాక రఘునందన్,
9440848924

ఒక దుఃఖ దిమ్మరి ట్రావెలాగ్



- ప్రసేన్, 98489 97241


తెలుగులో ప్రస్తుతం సాహిత్య విమర్శ లేదు అంటున్నాం. కవులను లేదా రచయితలను సంతోష పెట్టే విమర్శకుల తాకిడి ఎక్కువయిందనీ అంటున్నాం. పుస్తక సమీక్షలు మాత్రమే సాహిత్య విమర్శగా చెలామణి అవుతున్నాయనీ అంటున్నాం. అలా ఎందుకనాల్సి వస్తోంది. ఎన్ని పేర్లు పెట్టినా చివరకు నిజంగానే ప్రశంస, లేదూ పరామర్శ మాత్రమే విమర్శగా మిగిలి పోవడమేనా కారణం. మౌలిక సిద్ధాంతాలు లేని అప్లయిడ్ క్రిటిసిజమేనా కారణం. అవునేమో! సహృదయత, నిష్పాక్షికత లేకపోవడం కూడా కావచ్చేమో! అసలైన విమర్శను స్వీకరించే స్థితిలో సృజనకారులు లేకపోవడం కూడా ఈ చెడు పరిణామాలకు కారణం కావచ్చు కామోసు!

జాబితా చేస్తూపోతే విమర్శ చాలారకాలు. అప్పట్లో వ్యాఖ్యానమే విమర్శ. ఆ తరవాతి విమర్శలో సామాజిక, సాహిత్య, భాషా, ఛందో, అలంకారిక, రస చర్చ సంబంధిత విషయాలు కలగలిసిపోయి ఉండేవి. సాంప్రదాయ విమర్శ, నైతిక విమర్శ, తాత్విక విమర్శ ఇంకా చాలా ఉండేవి. ఉన్నాయి. అయితే ఏ భాషా సాహిత్యంలోనైనా పరామర్శ, సమీక్ష, ప్రశంస, ఖండన మాత్రమే మౌలికంగా ట్రెండింగ్‌లో ఉండేవి, ఉన్నాయి. నిజం చెప్పాలంటే విమర్శకులు ఎక్కడనుంచో పుట్టుకురారు. ప్రతి సృజనకారుడిలోనూ ఒక విమర్శకుడుంటాడు. ప్రతి పాఠకుడిలోనూ విమర్శకుడుంటాడు. ఒక రచన చదివాక పాఠకుడేమనుకుంటాడో అదే ఆ రచన అసలు సిసలు జీవం. దాన్నే పాఠక ప్రతిక్రియ అంటున్నాం. రీడర్స్ రెస్పాన్స్ థియరీ అంటున్నాం. ఇప్పుడిదంతా ఎందుకూ అంటే... మీరు అడుగుబెట్టబోతున్న ఫణి మాధవి కన్నోజు విమర్శా వ్యాసాలను ఏ గాటన కట్టేయాలి అన్న సమస్యకు పరిష్కారం వెదకడం కోసం.

ఫణి మాధవి పరిచయం ప్రత్యేకంగా అవసరం లేదు. కవయిత్రి. విమర్శకురాలు. ఒకటీ అరా కథలు కూడా రాసారు.

వివిధ రకాల విమర్శలలో ఫణి మాధవి చేస్తున్న విమర్శ ఏ రకం? ఫణి మాధవి విమర్శను ఏ పనిముట్లతో అర్థం చేసుకోవాలి. స్త్రీల సమస్యలు, స్త్రీల వేదన, స్త్రీల చుట్టూ అలుముకున్న చీకటి గురించిన కవిత్వ విశ్లేషణ ఈ సంపుటిలో ఉంది. కేవలం తెలుగు కవిత్వాన్నే కాక దేశ విదేశ కవులను ఆమె తన పరిధిలోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆమె తన విశ్లేషణలో కవిత్వ రూపం గురించి ఎక్కడా చర్చించలేదు. సాహిత్య కళ గురించిన చర్చ కూడా చేయలేదు. కేవలం ఆయా కవులు ఎంచుకున్న సారం గురించి మాత్రమే చర్చించారు.

కవిత్వాన్ని గురించి మాత్రమే మాట్లాడుతున్నాం అనే ప్రిమైజ్ రూఢీ అయినపుడు ఇక కవిత్వ విశ్లేషణ అవసరమా, అది కవిత్వం ఎందుకయింది, ఎలా అయింది, కవిత్వం చేయడంలో కవి ఏయే మెళకువలు పాటించాడనే విశ్లేషణ దేనికి అనే నిర్ధారణలోకి వస్తే కవిత్వ సారాన్ని గురించి మాత్రమే మాట్లాడాల్సి ఉంటుంది. విప్లవ సాహిత్య సమర్థకులు ఇలాంటి విమర్శే చేశారు. కవితా రూపం, రూప ప్రయోగం వంటి అంశాలను పట్టించుకోలేదు. స్త్రీ వాద సాహిత్యం ఉధృతంగా వస్తున్న సమయంలో వచ్చిన సానుకూల విమర్శ కూడా కేవలం సారం గురించే చర్చించింది తప్ప కవితా రూపం గురించి చర్చించలేదు. చాలా మంది స్త్రీ వాద విమర్శకులు ఇప్పటికీ ఇదే తరహా విశ్లేషణను సాహిత్య విమర్శగా కొనసాగిస్తున్నారు. ఇదొక నిర్ధారిత పద్ధతి. అందుకే ప్రిమైజ్ అన్నది. ఈ సంపుటిలో ఫణిమాధవి కూడా అదే పద్ధతిని పాటించారు. ఆమెకు సారమే ముఖ్యం. అందుకే కావచ్చు 'మేఘాల నీలాల్లోకి' అని ఈ సంపుటికి శీర్షికనిచ్చారు. స్త్రీవాద కవిత్వానికి పెదబాలశిక్షగా చెప్పుకోదగ్గ 'నీలి మేఘాలు' సారాన్ని లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయడం, లేదా తదనంతర కవిత్వాన్ని లోకానికి విపులీకరించడం అనే అర్థంతో ఆమె ఈ శీర్షికనిచ్చి ఉంటారు. అదే నిజం అని వ్యాసాలు చదివాక కచ్చితంగా తెలిసొస్తుంది.



ఈ సంపుటిలో మలయాళ, బెంగాలీ, కన్నడ, హిందీ, ఇరానీ, ఆంగ్ల, తెలుగు కవిత్వ సారాంశ వివరణ ఉంది. ఆయా కవుల కవితలు ఏ సారం గురించి, ఏ వేదన గురించి చర్చించారో చర్చించాయో ఉంది. ఇదొక ప్రయోగం. ఇదొక కొత్త చూపు. అందుకే గాయం సలుపుతున్నా కన్ను విప్పార్చి చూస్తున్న ముఖం ముఖచిత్రంతో విషయమంతా చెప్పేసారు ఫణి మాధవి.

మంచి విమర్శ వచ్చినపుడే మంచి సాహిత్యం వస్తుందన్న మాట నిజమే అయితే మంచి స్త్రీ వాద సాహిత్యం రావడానికి ఫణి మాధవి వ్యాసాలు పునాదులయి తీరతాయి. ఈ వ్యాసాలు చదవడమంటే దుఃఖదిమ్మరిగా పర్యటించి పకపకా ఏడ్వడం. ఎక్కిళ్లొచ్చేట్టు నవ్వడం. ఈ వ్యాసాలలో గుండెడు కన్నీళ్లున్నాయి. బండెడు గాయాలున్నాయి. ఇదొక అశ్రు సంచారి యాత్రా కథనం.

చలం చెప్పిన ఆమెకు వ్యాయామం, జ్ఞానం అనుభవం కావాలన్న దశ నుంచి ఫణి మాధవి మరింత ముందుకు వెళ్లి ఆమెకు ఆలోచన ఇవ్వాలనే సారాంశాన్ని తన వ్యాసాలలో ప్రతిపాదించారు. అనసూయా సేన్ కవిత్వం సాయంతో మౌనం ఎలా బలమో ఎలా ఆయుధమో ఎలా నిరసనో చెప్పారు. అదే సందర్భంలో కారా డెల్విన్ సాయంతో డిప్రెషన్‌లో కుంగిపోయిన వారు ఎలా, ఎవరికి, ఏం చెప్పుకోవాలో ఆ వేదనను ప్రపంచం ఎలా వినాలో చెప్పారు. నో అని చెప్పడం చాలా సందర్భాలలో ఎంత అత్యవసరమో నయిరా వహీద్ కవిత్వం సాయంతో చెప్పారు. మౌనం, చెప్పడం, వినడం మధ్య ఎప్పుడు ఎటు మొగ్గు చూపాలో అనే సంకేతాన్ని తన ముఖచిత్రంలో పెదాల స్థానంలో బహుశా త్రాసును ఉంచి ఇచ్చారేమో ఫణి మాధవి.

హిందీలో రజనీ తిలక్ దళిత పాదముద్రనూ, బెంగాలీ ఫెమినిస్టు కళ్యాణ్ ఠాకూర్ దళితత్వాన్నీ, తెలుగులో భైరి ఇందిర ధిక్కారాన్నీ, అలీసా కమ్మింగ్స్ కవిత్వం ఎలా ఓ చికిత్స అయిందో, మరాఠీ గీతాంజలి తన కవిత్వంతో మానసిక సాంత్వన ఎలా పొందిందో మన మనసుకు కట్టారు ఫణి మాధవి.

మూత్రశాలల లేమి వెనుక ఉన్న నరకం, ఒలీవియా మెంటల్ హెల్త్ అవగాహన గురించి, మెన్స్ట్రువల్ హైజీన్ ఆవశ్యకత గురించిన సారాన్ని ఎంచుకున్న కవులను తన జాబితాలోకి ఎక్కించుకుని ఫణి మాధవి ఈ సంపుటికి ఒక పరిపూర్ణతనిచ్చారు. హిజాబ్ మాటున కుట్ర చేసే లౌకిక తత్వం గురించి మాట్లాడిన జైనాబ్ రషీద్ ధైర్యం గురించి, కొండ మీది చింత చెట్టు మైదానంలోకి నడిచిరాదన్న వాస్తవాన్ని అర్థం చేసుకోలేని ఆధునిక ఆదానీల అణచివేతకు బలయే గిరిజన జీవన విధానాన్ని వివరించే కళ్యాణి కుంజ, పద్దం అనసూయ మనను ఈ వ్యాసాల్లో పలకరిస్తారు. ఆమెలే కాక ట్రాన్స్ జెండర్ శిలోక్ ముక్కటి జెండర్ కవిత్వ ప్రయాణాన్ని ఇరాన్ మహిళలు ఫరూహ్ ఫారోక్జాద్, తాహెరా, బెహ్మనీ, గ్రానాజ్ మౌసవీల ప్రయాణాలను, పోర్శియా దేవి ఆత్మాభిమానపు మోనోలాగ్‌ను కూడా మనకో ట్రాజిక్ ట్రావెలాగ్‌లా వినిపిస్తారు ఫణి మాధవి.

కవి కంటే విమర్శకుడు ఎక్కువ అధ్యయనశీలి అయి ఉండాలన్నది వాస్తవం. కవి సగం చెపితే మిగతా సగం పాఠకుడే అర్థం చేసుకుంటాడు కదా. ఆ ఖాళీని పూరించే పనిని విమర్శలో ఫణి మాధవి చేసారు. ఆమె విమర్శలో లిబరల్ స్పిరిట్ కీలకం. తన లోపలి కవయిత్రి తనను వెన్నాడుతున్నా కూడా కేవలం విమర్శ మీదనే దృష్టి నిలపడం ఆ లిబరల్ స్పిరిట్ వల్లనే సాధ్యమైంది. ఇక్కడ ఆమె సామభేదం తూకం తప్పకుండా పాటించారు.

మంచి విమర్శ వచ్చినపుడే మంచి సాహిత్యం వస్తుందన్న మాట నిజమే అయితే మంచి స్త్రీ వాద సాహిత్యం రావడానికి ఫణి మాధవి వ్యాసాలు పునాదులయి తీరతాయి.

దు:ఖం ఒక స్వచ్ఛత. దు:ఖం ఒక బలం. దు:ఖం ఒక పొలికేక. దు:ఖం ఒక పశ్చాత్తాపం. దు:ఖం ఒక సంభాషణ. దు:ఖం ఒక ఆనందభాష్పం. దు:ఖం ఒక అవ్యాజ్య ప్రేమ.

ఈ వ్యాసాలు చదవడమంటే దు:ఖదిమ్మరిగా పర్యటించి పకపకా ఏడ్వడం. ఎక్కిళ్లొచ్చేట్టు నవ్వడం. ఈ వ్యాసాలలో గుండెడు కన్నీళ్లున్నాయి. బండెడు గాయాలున్నాయి. ఇదొక అశ్రు సంచారి యాత్రా కథనం. ఆ సంచారి విశ్వ మానవి కావచ్చు. పాఠకుడే కావచ్చు. ఫణిమాధవీ కావచ్చు. రేపటి నవ్వుల కోసం ఇవాళ కన్నీళ్లలో మునగడం కూడా బానే ఉంటుంది. మేఘాల నీలాల్లో తడిసిపొండి.

సాహితీ వార్తలు

జూలై 7న 'సముద్ర నానీలు' ఆవిష్కరణ

'సముద్ర నానీలు' ఆవిష్కరణ జులై 7వ తేదీ ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సుప్రసిద్ధ కవి డా. ఎన్. గోపి ఆవిష్కరిస్తారు. ఆచార్య సూర్యా ధనంజయ, డా. పోరెడ్డి రంగయ్య, కుడికాల వంశీధర్, సుంకరి కృష్ణ ప్రసాద్, చిత్తలూరి సత్యనారాయణ పాల్గొంటారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం | జులై 01, 2024 | www.navatelangana.com

రిజిస్ట్రేషన్ భూమిని ఆక్రమించేందుకు యత్నం

- కోర్టులో వారు ఓడిపోయినా కావాలనే దాడులు
- మాకు ఎవరి సహకారమూ లేదు
- చట్టం ప్రకారం ముందుకెళ్తాం
- బాధితుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ- ఖమ్మం

తమకు చెందిన రిజిస్ట్రేషన్ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, తమపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వాసిరెడ్డి శ్రీనివాసురావు ఒక ప్రకటనలో ఆరోపించారు. 1997లో వెలుగుమట్ల సర్వే నెంబర్ 494లో రెండు ఎకరాల భూమిని "మా నాన్న వాసిరెడ్డి నాగేశ్వరరావు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు' అని తెలిపారు. ఫోర్జరీ పత్రాలు సృష్టించి చేపూరి పద్మా సంధ్యారాణి తమ భూమిపై అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. కోర్టులో వారు ఓడిపోయినా కావాలని దాడులు, దౌర్జన్యాలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తునానరు. గతంలో కూడా తాము పలుమార్లు మీడియాకు తమ డాక్యుమెంట్‌లు చూపించామని తెలిపారు. శనివారం తమ భూమిని చదును చేసుకుంటుండగా వారు అక్రమంగా తమపై దాడి చేయడానికి ప్రయత్నం చేశారని ఆరోపించారు. అక్రమంగా జేసిబిలపై దాడి చేసి వాటి అద్దాలను పగల కొట్టారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేశామన్నారు. తమకు ఏ పార్టీ నాయకులు కానీ, ఏ సంఘం నాయకులు కానీ సహకారం ఇవ్వలేదని తెలిపారు. చట్టం ప్రకారం తాము ముందుకు వెళ్తాం అని స్పష్టం చేశారు.



మానవాళి అభివృద్ధికి సోషలిజమే స్థిరమైన మార్గం

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ- ఖమ్మం

దేశంలో పేదలు, కష్టజీవులు మధ్యతరగతి వర్గాల ప్రజల జీవన ఆర్థిక విధానం చిన్నాభిన్నం అవుతుందని, ప్రజల మానవాళి సమస్యల పరిష్కారం సోషలిస్టు వ్యవస్థలోనే ఉంటుందని, ఆ ప్రభుత్వ సాధన కోసం ప్రతి ఒక్కరు ఈ దోపిడీ పాలకవర్గాలపై పోరాటం నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అన్నారు. రెండో రోజు ఖమ్మం త్రీ టౌన్ సిపిఎం కార్యకర్తల రాజకీయ శిక్షణా తరగతులు పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. పార్టీ ప్రజాసంఘాల నిర్మాణం అనే అంశంపై క్లాస్ యర్రా శ్రీకాంత్ బోధించారు. పెట్టుబడుదారి పాలన విధానాల కారణంగా కార్పొరేట్ శక్తులు, భూస్వామ్యశక్తులు ఆర్థికంగా బలపడుతున్నాయని, దేశంలో ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాలు ఫలితంగా నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఫలితంగా ప్రభుత్వరంగం దెబ్బతిని ప్రజల జీవన విధానంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని, ఈ తప్పుడు విధానాలు కార్పొరేట్ శక్తులకు, మతోన్మాదశక్తులకు ఉపయోగపడే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం వివరిస్తున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశంలో ప్రజలందరినీ ఐక్యం చేసి జనతా ప్రజాస్వామిక విప్లవం ద్వారా దేశంలో అన్ని వర్గ ప్రజల్ని చైతన్యం చేస్తూ ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఈ దోపిడీ రాజ్యాంగ నుండి సోషలిస్టు రాజ్యాంగ కోసం కృషి చేయాలని అన్నారు. సోషలిస్టు వ్యవస్థలో నిరుద్యోగం ఉండదని, దరిద్రం ఉండదని, అందరికీ అన్ని సౌకర్యం కల్పించే సోషలిస్టు వ్యవస్థ కోసం ఉద్యమించాలని అన్నారు. రెండో క్లాసు ఆర్థిక విధానాలు ప్రజలపై ప్రభావం అనే అంశంపై జిల్లా అకాడమిక్ కన్వీనర్ బండారు రమేష్ బోధించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాస్‌రావు, బండారు యాకయ్య, 35వ డివిజన్ కార్పొరేటర్ వెల్లంపల్లి వెంకట్రావు, బండారు వీరబాబు, ఎస్‌కే సైదులు, పత్తిపాక నాగ సులోచన, శీలం వీరబాబు, ఎస్.కె ఇమామ్. త్రీ టౌన్ కమిటీ సభ్యులు శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




పట్టణ ప్రాంతాల్లో మహిళలకు 'ఉపాధి' చూపాలి

- పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలివ్వాలి
- ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి
- మహిళల సమస్యలపై 'ఐద్వా' సర్వే

నవతెలంగాణ-సత్తుపల్లి

పట్టణ ప్రాంతాల్లో ఉపాధి దొరక్క కుటుంబ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహిళా సమస్యలపై భారతి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా సత్తుపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల్లో సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సర్వే కార్యక్రమంలో భాగంగా ఆమె ఐద్వాలో మహిళలను సభ్యులుగా చేర్చుకుంటూ సభ్యత్వాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందించాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు కల్పించడాన్ని ఆమె అభినందిస్తూ బస్సు సర్వీసులను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం వచ్చింది గనక తక్షణమే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు చెరుకు కుమారి, ప్రభావతి, చావ కవిత పాల్గొన్నారు.



దేశాన్ని ఆర్థికంగా దెబ్బ తీసే మోడీ విధానాలు

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్

నవతెలంగాణ- ఖమ్మం

నూతన ఆర్థిక విధానాలు ఫలితంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అన్నారు. ఆదివారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో పార్టీ టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు రోజుల రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా నూతన ఆర్థిక విధానాలు- ప్రజలపై భారాలు అనే అంశంపై క్లాస్ బోధించారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణలను వేగవంతంగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తుందని, ఈ నూతన సంస్కరణలు ఫలితంగా ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతాయన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇతర వస్తువుల ధరలు విపరీతంగా బిజెపి పాలనలో పెరిగాయని, భారతదేశంలో మూడవ సారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇక ప్రజా సమస్యలు పరిష్కారం చెయ్యకుండా నిత్యం మతాల మధ్య చిచ్చు పెట్టే పనిలో ఉండటం వల్ల, మతోన్మాదం పెరిగి దేశం అంతా అల్లకల్లోలం కావడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా జరగబోయే ప్రజా ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్, నాయకులు డి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థికి అధ్యాపకుల సాయం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లికి రామగిరి సంపత్ కారేపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నాలుగు రోజుల క్రితం లారీ ఢీకొని తలకు గాయమై మెదడు దెబ్బతగలటంతో ఆసుపత్రిలో జీవచ్ఛవంగా పడి ఉన్నాడు. వైద్యం చేయించటానికి తండ్రి లేడు, తల్లికి ఆర్థిక స్తోమత లేక తల్లడిల్లుతుందని తెలుసుకున్న కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ విద్యార్థి వైద్యం కోసం సాయం చేయటానికి ముందుకొచ్చారు. ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రూ.62,531లను అధ్యాపకులు బాధిత కుటుంబానికి అందజేశారు. తమ కళాశాల ఆధ్యాపకులతో పాటు విద్యార్థులు కూడా తమ తోటి మిత్రుడిని కాపాడుకోవటానికి ఆర్థిక సాయం చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆర్థికసాయం చేసిన వారిలో కేఎస్.రామారావు, అనిత, నాగేశ్వరరావు, చీన్యా, రాజకుమారి, సాగర్, కలాం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికునికి గాయాలు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని వనంవారి కిష్టాపురం గ్రామానికి చెందిన సోమగాని శంకర్ గౌడ్ అనే కల్లుగీత కార్మికుడు సమీప గ్రామమైన ముత్తారంలో కల్లు కోసం తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడి కిందపడటంతో రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలైనాయి. క్షతగాత్రుడు శంకర్‌గౌడ్‌ను కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలి

- ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు
- నిబద్ధత కలిగిన ఉద్యోగిగా పని చేశారు
- టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల హాజరు శాతం తగ్గుతుందని, భవిష్యత్తులో ఈ పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ పాఠశాలలు ఎక్కువ ప్రాంతాలలో కనుమరుగవుతాయని ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైన ఉందని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన ఉ పాధ్యాయులు టీఎస్ యుటిఎఫ్ సీనియర్ నాయకులు బండారుపల్లి రాజారావు పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని పాఠశాల సహ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన చొప్పకట్లపాలెం గ్రామంలో గల పాఠశాల నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చావ రవి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని అన్నారు. రాజారావు 23 సంవత్సరాలు పైబడి ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత కలిగిన ఉద్యోగిగా పని చేశారని అన్నారు. ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేశారని అన్నారు. యుటిఎఫ్ సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా ఉపాధ్యాయ సమస్యలపై వివిధ సందర్భాలలో జరిగిన పోరాటాలలో చురుకుగా పాల్గొని ఉపాధ్యాయులలో చైతన్యం నింపారని అన్నారు. రాజారావు సేవలు భవిష్యత్తులో ఉపాధ్యాయ సంఘానికి ప్రజలకు ఉపయోగపడాలని పేదల జీవితాలలో వెలుగులు నింపాలని కష్ట జీవులకు అండగా ఉండాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నానాటికి పిల్లల సంఖ్య తగ్గిపోతుంది అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కేజీ తరగతులు ఈ విద్యా సంవత్సరంలోని ప్రారంభించాలని కోరారు. స్కావెంజర్లను ప్రభుత్వం నియమించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు ప్రమోషన్, బదిలీలపై వెళ్లిన ఖాళీలను వెంటనే పూర్తి చేయాలని, ఉపాధ్యాయులను నియమించి ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుని చక్కదిద్దాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నాగూర్ వలి, మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్, మండల అధ్యక్ష కార్యదర్శులు అనుమోలు కోటేశ్వరరావు, బండారు నాగరాజు, మండల ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, కోశాధికారి లంకా నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు రాజేష్, మహేంద్ర కుమార్, సురేష్, నీలం అజయ్ కుమార్, సైదారావు, మధిర మండల అధ్యక్ష కార్యదర్శులు వినోద్‌రావు, వీరయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు ఆంజనేయులు, మీరాఖాన్, సాంబయ్య, హెచ్‌ఎస్ శర్మ, మాజీ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, కస్తూరిబాయి, రాజారావు, కుటుంబ సభ్యులు రామారావు, రమణయ్య, కోటేశ్వరరావు, కృష్ణారావు, మణికుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు... పిల్లల ఆరోగ్యం

వర్షాకాలంలో పిల్లల ఆరోగ్యంపై దృష్టి ఉండాలి

లంకాసాగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్

నవతెలంగాణ-సత్తుపల్లి



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు వారి ఆరోగ్య విషయాలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలని లంకాసాగర్ ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ సిహెచ్.కిరణ్ కుమార్ అన్నారు. డాక్టర్ డే సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ 'నవతెలంగాణ' ప్రతినిధితో పిల్లల ఆరోగ్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాంశాలపై ముచ్చటించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రభావం చిన్నపిల్లలపై ఎక్కువగా ప్రభావం చూపుతాయన్నారు. ఈ సీజన్‌లో పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. తరచుగా తడవడం మూలంగా ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకుతాయన్నారు. వీటితో పాటు సీజనల్‌గా వచ్చే వ్యాధులు జ్వరం, శ్వాసకోశ, స్టమక్ అలర్జీ సమస్యలు వస్తూ ఉంటాయన్నారు. పిల్లలకు పరిశుభ్రత విషయాలపై అవగాహన కలిగించాల్సి ఉంటుందన్నారు. వర్షాకాలంలో పిల్లలకు గోరువెచ్చని శుద్ధజలాన్ని తాగించాలని డాక్టర్ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. డెంగీ, మలేరియా తదితర వ్యాధులు సోకకుండా దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ఎక్కువ శాతం దోమల కారణంగా, ఆహారం కలుషితం ద్వారా సంక్రమిస్తాయన్నారు. నివసిస్తున్న పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం పిల్లలకు ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకకుండా ఉండటానికి తడిబట్టలు వేయరాదన్నారు. తడిలేకుండా పొడిగా ఉండటానికి ఆరుబయట ఆరబెట్టాలన్నారు. కాళ్లూ, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుకున్న తరువాతే భోజనం పెట్టాలన్నారు. ఫాస్ట్, జంక్ ఫుడ్స్ ఇవ్వకూడదన్నారు. పసిపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. వాళ్లకి కడుపునొప్పి వచ్చినా, ఇతరత్రా శరీరంలో ఉన్న ఇబ్బందులను చెప్పుకోలేని పరిస్థితిలో ఉంటారు కాబట్టి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆలస్యం అయినకొద్దీ పిల్లల ఆరోగ్య పరిస్థితి జఠిలమవుతుందని డాక్టర్ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు.

దుకాణ సముదాయం విషయమై వివాదం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో వ్యాపార సముదాయం(దుకాణం గది) విషయమై వివాదంతో మహిళ కిరోసిన్ డబ్బతో వ్యాపార కాంప్లెక్స్ ముందు అందోళనకు దిగిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లోని సాయిలు మాస్టర్ కాంప్లెక్స్ లో ఒక గది అందోళన చేసిన మహిళకు సంబంధించినది. ఆ గదిని దాని పక్కనే ఉన్న వ్యాపారికి కొన్ని సంవత్సరాల క్రితం తాకట్టు పెట్టి పైకం తీసుకున్నారు. అప్పు పైకం చెల్లించక పోవటంతో వ్యాపారి ఆ గదిని పూర్తిగా స్వాదీనం చేసుకోని మార్పులు చేర్పులు చేసుకున్నాడు. గదిని తాకట్టుపెట్టిన వారు తాము అప్పుచెల్లిస్తామని తమ గదిని తమకు అప్పగించాలని చెప్పినా వ్యాపారి గదిని అప్పగించకుండా బెదిరిస్తున్నాడంటూ తాకట్టుపెట్టిన వారు ఆందోళనకు దిగారు. తమకు తాకట్టుపెట్టిన షాపు ను కొనుగోలు చేయటం జరిగిందని, దీనిపై కోర్టులో కూడా కేసు నడుస్తుందని వ్యాపారి సంబంధికులు తెలిపారు. కారేపల్లిలో ప్లాట్ల రేట్లు పెరగటంతో షాపు తాకట్టుపెట్టి తర్వాత అమ్మి ఇప్పుడు దానిపై వివాదం చేస్తున్నారని వ్యాపారి సంబంధికులు ఆరోపించారు. వివాదం నడుస్తుండటంతో పోలీసులు అప్రాంతానికి చేరుకోని ఇరువర్గాలను సముదాయిస్తూ సివిల్ మేటర్ కోర్టు ద్వారా తేల్చుకోవాలని అప్పటి వరకు వివాదం చేయవద్దని సూచించారు.

విస్తృత సేవలందిస్తున్న సత్తుపల్లి 'లయన్స్‌క్లబ్'

- 220 రోజుల పాటు వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం
- నేత్రాలను సేకరించి 200 మందికి కంటిచూపు
- లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శివప్రసాద్

నవతెలంగాణ-సత్తుపల్లి



ప్రపంచ వ్యాప్తంగా విస్తృత సేవలందిస్తున్న లయన్స్‌క్లబ్ సత్తుపల్లిలో కూడా అనేక సేవా కార్యక్రమాలకు సమాజానికి అందిస్తోందని ఆ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సి.హెచ్. శివకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కళాభారతిలో క్లబ్ సత్తుపల్లి బాధ్యుడు దొడ్డా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన 31వ చార్టర్ నైట్ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమాన్ని 220 రోజుల పాటు నిర్వహించి పేద వర్గాలకు ఉచిత అల్పాహారం అందించారన్నారు. పట్టణంలో పలువురి పేదల కోరిక వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా పాల్గొన్న క్లబ్ పీడీజీ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ యేడాది కాల వ్యవధిలో నేత్రదానాల ద్వారా 112మంది మృతుల నుంచి సేకరించిన నేత్రాలను 200మందికి అమర్చి కంటిచూపును లయన్స్‌క్లబ్ ద్వారా ప్రసాదించడం మహాద్భాగ్యమన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయండి
: డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ కోరారు. లయన్స్‌క్లబ్ వేడుకల్లో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్‌కు తాము కూడా అండగా ఉంటామని దయానంద్ విజయకుమార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దయానంద్ లయన్స్‌క్లబ్ సేవలను అభినందించారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

2024-25 యేడాదికి సంబంధించి సత్తుపల్లి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం డిస్ట్రిక్ట్ గవర్నర్ సమక్షంలో ఎన్నుకునానరు. అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులుగా పెనుగొండ రమేశ్, దాసరి ఉమామహేశ్వరరెడ్డి, రవి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ బాధ్యులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు కొత్తూరు ప్రభాకరరావు, దారా కృష్ణారావు, గంధ్ర సోమిరెడ్డి, కొఠారు చలపతిరావు, మందపాటి ప్రభాకరరెడ్డి, కొత్తూరు సత్యనారాయణ, జంగా సత్యనారాయణ, వెల్ది జగన్మోహనరావు, దారా సరస్వతి, దొడ్డా రమ, గంధ్ర జయ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు కృషి

- బిఆర్ఎస్ బలహీనత బిజెపికి బలమైంది
- నిరంతరంగా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ
- బొగ్గు బ్లాకుల వేలం పై ఐదు నుంచి ఆందోళనలు
- విలేకరుల సమావేశంలో కూనంనేని

నవతెలంగాణ-ఖమ్మం




తెలంగాణలో రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు సిపిఐ ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతుందని, అందుకు తగిన కార్యాచరణ రూపొందించనున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని సిపిఐ రాష్ట్ర సమితి సమావేశ నిర్ణయాలను ఆదివారం సప్తపది ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీ అంతర్భాగంగా ఉందని చైతన్యవంతమైన ఈ రాష్ట్రంలో బిజెపికి అవకాశం దక్కదన్నారు. నిర్మాణం లేకుండా సెంటిమెంట్‌పై ఆధారపడిన బిఆర్ఎస్ అధికారంలో లేకుండా బతకడం కష్టమని సాంబశివరావు తెలిపారు. కాంగ్రెస్ లేదా ఇతర రాజకీయ పక్షాలకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు సిపిఐకి అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఉమ్మడి 10 జిల్లాల్లోను కమ్యూనిస్టు పార్టీకి నిర్మాణం ఉందని, దానిని మరింత విస్తృత పరిస్తే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు అవకాశం ఉందన్నారు. పొత్తులు అనివార్యమవుతున్నాయని కాని ఇదే సమయంలో ఇతరులపై ఆధారపడే అవకాశం రాకుండా భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పార్లమెంటు ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కమ్యూనిస్టులు బలంగా ఉన్నచోట కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధించిందని, కమ్యూనిస్టులు బలహీనంగా ఉన్నచోట బిజెపి గెలిచిందన్నారు. కాంగ్రెస్ సైతం ఈ వాస్తవాన్ని గుర్తించాలని, పలుకుబడి కలిగి ప్రజల్లో సానుకూల భావనతో ఉన్న కమ్యూనిస్టులను గుర్తించాలని, డిఎంకె మాదిరి మిత్రపక్షాలకు కూడా సరైన అవకాశాలు కల్పించాలని సూచించారు. కమ్యూనిస్టుల కార్యాచరణ, బిజెపి వ్యతిరేక ప్రచారం నిర్వహించడం వల్లనే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా తగ్గిందని తెలిపారు. బిజెపి మతోన్మాద ప్రచారాన్ని తిప్పికొడుతూ దేశ వ్యాప్తంగా ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అంశాల వారీగా మద్దతునిస్తూనే ప్రజా సమస్యలు ముఖ్యంగా సంఘటిత, అసంఘటిత కార్మిక - వర్గం, రైతులు, కూలీలు, మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడతామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బిజెపియేతర రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు సిపిఐ సిద్ధమవుతుందన్నారు. ఇందుకోసం ఒక పక్క ఆందోళనలు మరో పక్క సైద్ధాంతిక శిక్షణ ప్రచారాలను ముమ్మరం చేస్తామని ఆయన తెలిపారు. బొగ్గు బ్లాకుల విషయంలో బిజెపి, బిఆర్ఎస్‌ది ఒక్కటే వైఖరి అని, బిజెపి ఎంఎండిఆర్ చట్టాన్ని తీసుకువస్తుంటే బిఆర్ఎస్ మద్దతునిచ్చిందని తెలిపారు. బొగ్గు బ్లాకుల వేలం రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మొదలైందని, కోయగూడెం అరవిందో కంపెనీకి మరో చోట అవంతి కంపెనీకి కట్టబెట్టి ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఆయన తెలిపారు. బొగ్గు బావుల విషయంలో బిజెపికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అబద్దాలు చెప్పడంలో మోడీనే మించి పోయారన్నారు. ఇతర రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలకు బొగ్గు ఉత్పత్తిని అప్పగించినప్పుడు తెలంగాణలో ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు. చట్ట విరుద్ధమైన బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకుంటామన్నారు. వేలాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల ఐదు నుంచి ఆందోళనలు చేస్తామని తెలిపారు. జూలై ఐదున కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని, సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో ఆందోళనలు చేస్తామని, బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకునేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు ఒకటిన కలెక్టరేట్లను ముట్టడించాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. సమావేశంలో తీసుకున్న కార్యాచరణను అమలు చేస్తూ హన్మకొండలో పార్టీ నిర్మాణ కౌన్సిల్లు నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు, పర్స పద్మ తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, బాల మల్లేష్, బాల నర్సింహా, కె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెదడుకు రక్తప్రసరణ ఆగితే స్ట్రోక్

- స్పర్శ న్యూరో, ఎమర్జెన్సీ హాస్పిటల్ వైద్యులు
- డా. అప్పారావు అనుమోలు, న్యూరో ఫిజిషియన్

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



బ్రెయిన్ అటాక్ అందరూ అనుకొన్నట్లు గుండె పోటు కాదని.. బ్రెయిన్ అటాక్ అనేది మెదడుకు రక్తప్రసరణ తగ్గడం లేదా రక్తనాళం చిట్లిపోవడం ద్వారా సంభవిస్తుందని ఖమ్మంలోని స్పర్శ న్యూరో, ఎమర్జెన్సీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అప్పారావు అనుమోలు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'నవతెలంగాణ'తో మాట్లాడారు. తలనొప్పి, ఫిట్స్, పక్షవాతం, మెదడు, వెన్నెముక, నరాల సమస్యలకు తమ ఆస్పత్రిలో వైద్యం లభిస్తుందన్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే.. మెదడుకు రక్త ప్రసరణ ఆగిపోవడం వలన కణాలు, ఆక్సిజన్ (ప్రాణ వాయువు) అందక చని పోతుంటాయి. ఈ కణా లు పనిచే యకపోవటం వలన రోగికి ఇబ్బందులు వస్తాయి. 8 శాతం మందిలో రక్తనాళాలు మూ సుకుపోయి, రక్తప్రసరణ ఆగిపోవటం వలన మెదడు పోటు వస్తుంది. 20 శాతం మందిలో మాత్రం రక్తనాళాలు చిట్లిపోయి వస్తుంది. ఇలా రక్తనాళాలు చిట్లిపోయిన వారికి ప్రాణానికి ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

ఏ రకంగా అవయవాలకు ముప్పు..

మెదడు పోటు వలన కాలు, చేయి పడిపోవడం, శరీరంలో ఒకపక్క స్పర్శ పోవటం, మాట్లాడలేకపోవటం, గుర్తులేక పోవటం, మరపురావటం, తూలిపడిపోతుండటం, కళ్ళు తిరగడం. ఆహారం మింగలేకపోవటం, చూపుపోవటం లాంటి అనర్థాలు జరగవచ్చు.

ఎవరిలో వచ్చే అవకాశాలున్నాయి...?

అధిక రక్తపోటు (హై బ్లడ్ ప్లజర్) మధుమేహం, (షుగర్ వ్యాధి) అధిక కొవ్వు శాతం, గుండె జబ్బు ఉన్నవారితో పాటు ధూమపానం (స్మోకింగ్), మద్యపానం (ఆల్కహాల్) అలవాటు ఉన్నవారిలో బ్రెయిన్ అటాక్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన 4 గం౦ఎల లోపు హాస్పిటల్ కు వస్తే ఈ మధ్యకాలంలో బ్రెయిన్ అటాక్ కు కొత్తమందులు వచ్చాయి. కొన్ని మందులు మొదటి నాలుగు గంటలలోపు ఇవ్వవలసి వుంటుంది. దీని వలన నష్టాన్ని చాలా వరకు నివారించవచ్చును. ప్రపంచవ్యాప్తంగా జరిపిన పరీక్షల్లో, మొదటి గంటలో వైద్యం మొదలు పెడితే 30-40 శాతం మందిలో పూర్తిగా ఙజబ్బు తగ్గినట్లు నిర్ధారించారు. ఫిజియో థెరఫీ చాలా అవసరం. ఒకసారి బ్రెయిన్ అటాక్ వస్తే, అటువంటి రోగికి మరలా వచ్చే అవకాశం ఉంది. తిరిగి రా కుండా ఉండాలంటే, మందులు తప్పనిసరిగా ప్రతిరోజు వాడాలి. మొదటిసారి స్ట్రోక్ వస్తే కోలుకొన్నంతగా రెండోసారి కోలుకోకపోవచ్చు. కాబట్టి వైద్యుని సలహా పాటించండి.

లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి చేర్చాలి..

శరీరంలో ఒక పక్క తిమ్మిరిగా వుండటం, ఏదైనా వస్తువును సరిగ్గా పట్టుకోలేకపోవటం, నడకలో ఇబ్బందిగా వుండటం, మాట తడబడటం లాంటివి వస్తే వెంటనే వైద్యుని సంప్రదించాలి. ఒక్కోసారి రోగికి తెలియకపోవచ్చు. ప్రక్కన ఉన్నవారు ఎవరైనా గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

ఇతర లక్షణాలు..

ఎదుటి వారు చెప్పేది అర్థం చేసుకోలేకపోవటం. రెండు కళ్ళలో చూపు తగ్గిపోవటం, తూలిపోవడం, పడిపోతుం డటం అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి రావటం, ఆహారం మింగలేకపోవడం తదితర లక్షణాలు కూడా బ్రెయిన్ అటాక్ అవ్వచ్చును. వెంటనే వైద్యుని సంప్రదించవలెను.

వెంటనే సంప్రదించాలి..

బ్రెయిన్ అటాక్ వైద్యపరంగా అత్యవసర స్థితి (ఎమర్జెన్సీ), ప్రతి క్షణం చాలా విలువైనది. ఎక్కువసేపు రక్తప్రసరణ జరగకపోతే ఎక్కువ శాతం మెదడు దెబ్బతింటుంది. వైద్యం వెంటనే ప్రారంభిస్తే ప్రాణాల్ని రక్షించటమే కాకుండా, అనేక నష్టాల్ని/అవాంతరాల్ని నివారించవచ్చును. అందువలన వెంటనే సంప్రదించాలి.



ఘనంగా జాతీయ సంఖ్యాకశాస్త్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని కోదాడ క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల నందు జాతీయ సంఖ్యాకశాస్త్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రిబ్యూషన్ ఆఫ్ ది ఇండియన్ స్టాటిస్టిక్స్ అనే అంశాన్ని ఆన్లైన్ ద్వారా నిర్వహించారు. ఈ వెబ్‌నార్‌కు ముఖ్యఅతిథిగా సతీష్ కుమార్ స్టాటిస్టిక్స్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ వారు పాల్గొని విద్యార్థులకు అనేక అంశాలు వివరించారు. ఈ వేబినార్‌లో పాల్గొన్న విద్యార్థులు అనేక రంగాల్లో అనేక అవకాశాలను అందుకొని ముందంజలో ఉంటారని తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి సెమినార్లను మిగతా డిపార్ట్మెంట్ వారు కూడా నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.చంద్రబాబు, కె.రాజు, ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి, ఐ.గీత, జి.స్వప్న, కే.సులోచన రాణి పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

నవతెలంగాణ-కల్లూరు

పట్టణంలో మహేష్, వంశీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నక్షత్ర డిలైట్ ఫుడ్ ఫ్యామిలీ ఫన్ నూతన రెస్టారెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయ దయానంద్ ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల నాయకులు పసుమర్తి చందర్రావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, భాగం ప్రభాకర్‌చౌదరి, ఆలకుంట నరసింహారావు, పట్టణం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికై ఆహ్వానం

- రెండో తేదీన జిల్లా స్థాయి సెలక్షన్స్

నవతెలంగాణ-కల్లూరు

జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4 వ తరగతి చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులకు రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశం పొందటానికి జిల్లాస్థాయి సెలక్షన్స్ ఈనెల 2 న ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్టు పసుపులేటి వీరరాఘవయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి 20 మంది బాలురు, 20 మంది బాలికలు రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌కు ఎంపిక చేయబడతారని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ సమాచారాన్ని తమ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే ఆసక్తి గల విద్యార్థులు తమ ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేదా బోనఫైడ్ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, మూడవ తరగతి ప్రోగ్రెస్ కార్డ్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్ట్ ఫోటో తీసుకొని రావాలని పేర్కొన్నారు. జూన్ 28, 29 న జరిగిన సెలెక్షన్స్‌లో పాల్గొని ఎంపిక కాలేకపోయిన వారు కూడా ఈ సెలెక్షన్స్‌కు హాజరుకావచ్చు. పేర్కొన్నారు.

బిల్డింగ్ తాపీ మేస్త్రి యూనియన్ సమావేశం

నవతెలంగాణ-మధిర



పట్టణంలో బిల్డింగ్ తాపీ మేస్త్రి యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ తాపీ మేస్త్రీలను యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు కాలేశ్వరరావు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ వంటి పథకాలు ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణ

నవతెలంగాణ-కల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని రైతు భరోసా పై మండలంలోని కల్లూరు, చిన్న కోరుకొండి, సహకార సంఘాలలో ఆదివారం రైతుల అభిప్రాయాలు సేకరించారు. కల్లూరు సొసైటీ ప్రత్యేక మహాజనభ సొసైటీ అధ్యక్షులు బోబోలు లక్ష్మణరావు, అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రిజిస్టర్ నీరజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీదేవి, కళ్యాణి, శంకర్, పాల్గొని రైతుల నుండి అభిప్రాయం సేకరించారు. తొలత ఈ కార్యక్రమం గురించి వ్యవసాయ అధికారి ఎం.రూప, రైతులకు వివరించారు. రైతు నుండి అభిప్రాయం సేకరించి తీర్మానం చేశారు. తీర్మానం ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కొండలరావు, సీఈవో బీ. శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

చిన్న కోరుకొండలో...

చిన్నకోరుకండి సొసైటీ ప్రత్యేక మహాజనసభ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వరంగల్ డిప్యూటీ రిజిస్టర్ వాచానాయక్, ఖమ్మం అసిస్టెంట్ రిజిస్టర్ సందీప్, సీనియర్ ఇన్స్‌పెక్టర్ మౌలానా, పాల్గొన్ని రైతు భరోసా పథకంపై రైతు నుండి అభిప్రాయాలు సేకరించి సొసైటీ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ యాలాద్రి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చెన్నూరులో వరల్డ్ కప్ విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-కల్లూరు

భారత జట్టు టీ20 వరల్డ్ కప్ విజేతలుగా నిలిచిన సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలోని క్రికెట్ అభిమానులు ఆనందోత్సాహాలతో ర్యాలీ నిర్వహించి, సంబరాలు నిర్వహించారు. స్థానిక ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ రూపొందించిన టీ20 వరల్డ్ కప్ నమూనాతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టి క్రికెట్ పట్ల తమ అభిమానాన్ని ప్రదర్శించి భారత జట్టుకు శుభాకాంక్షలు తెలియజేశారు. చెన్నూరు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు కొడవటి నాగేశ్వరావు మాట్లాడుతూ ఇండియా వరల్డ్ కప్ గెలవడం చాలా ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్రికెట్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ ముత్తారం గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని ముత్తారం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు నూకల నాగేశ్వరావు మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో జిల్లా, మండల, గ్రామ కమిటీలు పునర్నిర్మాణం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపకాధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతన కమిటీలు నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ నెల 7న వరంగల్ కేంద్రంగా జరిగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తల కవాతును జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షులు నారపొంగు నరేందర్, ఉపాధ్యక్షులు అమరగాని రామారావుగౌడ్, ప్రధాన, సహాయ కార్యదర్శులుగా కే. నాగరాజుమాదిగ, ఎల్.గోపి మాదిగ, ప్రచార కార్యదర్శి పీ.సుధాకర్ మాదిగ, గౌరవ అధ్యక్షులుగా నారపొంగు శ్రీను, నారపొంగు జాని, గౌరవ సలహాదారులుగా ఎల్.వెంకటేశ్వర్లు, నారపొంగు కిరణ్, అడపా నాగేంద్రబాబు మాదిగ, ఎల్.ప్రసాద్, తోపాటు మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల నాయకులు పడిశాల నాగేశ్వరరావు, ఎల్.వీరభద్రం, బొడ్డు అనిల్ మాదిగ, నవీన్, ఉపేందర్, నాగరాజు, శివ, ప్రకాష్, విజయ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ప్రాణం పోసిన వర్షం

- ఆనందంలో అన్నదాతలు

నవతెలంగాణ-ముదిగొండ



మండలంలోని గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వానాకాలం పంటల సీజన్లో అన్నదాతలు సాగు చేసిన పత్తి, పెసర పంటలకు వాన ప్రాణం పోసింది. దీంతో అన్నదాతలు సంతోషంతో హర్షం వెల్లబుచ్చారు. ఈఏడాది వానాకాలం పంటల సీజన్లో అడపాదడపా పడిన తొలకరి జల్లులకు రైతులు పత్తి, పెసర పంటలు సాగు చేసారు. పత్తి విత్తు విత్తిన నాటినుండి వానలు వెనక పట్టు పట్టడంతో విత్తన పత్తి, విత్తు కొంత మొలకెత్తి, మరి కొంత మొలకెత్తపోవడంతో రైతులు కొంత నిరాశ చెంది దిగులుపడ్డారు. మొలకెత్తి ఎత్తని పత్తి మొక్కకు పదును లేక, పత్తి సాగు సాగదేమో,అని రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో గత రెండు రోజుల నుంచి మండలంలో పడుతున్న వర్షాలకు పత్తి సాగుకు అన్నదాతల్లో ఆశ మొదలైంది.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ-మధిర



రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం మధిర నియోజకవర్గంలోని చింతకాని, మధిర మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సంపద రాష్ట్ర ప్రజలకు చెందాలని తమ ప్రభుత్వం ఈ గ్యారెంటీలను తీసుకువచ్చిందన్నారు. గత దశాబ్ద పాలనలో అప్పుల పాలైన తెలంగాణను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నామని చెప్పారు. సంపదను సృష్టించి, సృష్టించిన సంపదను ప్రజలకు పంచుతామన్నారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు పోతుందని చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. ఆర్థికంగా ఎదగడానికి క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను అప్పగించామన్నారు. తెలంగాణలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయబోతున్న మీ సేవ సెంటర్ల నిర్వహణ కూడా మహిళలకు అప్ప చెప్తామని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వావలంబన కొర్కై తమ ప్రభుత్వం మహిళ స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తుందని వివరించారు. ఆసుపత్రి ప్రారంభం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన హైద్రాబాద్ ప్రజాభవన్ నుంచి ఉదయం 7గంటలకు రోడ్డు మార్గాన ఖమ్మంకు చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు జిల్లా అధికార యంత్రాగం, పార్టీ జిల్లా నాయకులు, శ్రేణులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి చింతకాని మండలం గాంధీనగర్ కు చేరుకొని రూ.175లక్షలతో గాంధినగర్ నుంచి బొప్పారం వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత మధిర మండలం వంగవీడు గ్రామానికి చేరుకొని రూ. 30 కోట్లతో బోనకల్లు- అల్లపాడు- వంగవీడు గ్రామాల వరకు బిటి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. చిలుకూరు గ్రామంలోని శివాలయం వద్ద రూ.70 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ.285 లక్షలతో చిలుకూరు నుంచి దొడ్డదేవరపాడు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మధిర మండలం మర్లపాడు గ్రామానికి చేరుకొని. రూ.275 లక్షలతో మర్లపాడు నుంచి పెనుగొలను-సిద్దినేని గూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్తాపన చేశారు. ఆ తరువాత మాటూరు గ్రామానికి చేరుకొని రూ.500 లక్షలతో మాటూరు నుంచి ముస్లిం కాలనీ బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారి పొడవున ఆయా గ్రామాల ప్రజలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘనంగా స్వాగతం పలికారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- అల్లుడే హత్య చేశాడంటూ బంధువుల ఫిర్యాదు
- స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన
- న్యాయం చేయాలంటూ డిమాండ్

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలోని సదాశివపురం గ్రామంలో వివాహిత మహిళ అనుమానాస్పదంగా మృతి చెందడంతో మహిళ తల్లిదండ్రులు, బంధువుల స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన ఘటన ఆదివారం జరిగింది. తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జిల్లపల్లి అవినాష్‌కు సూర్యాపేట జిల్లా మునగాల మండలం తాడ్వాయి గ్రామానికి చెందిన విజయ(25)తో గత పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ గొడవలు జరిగేవన్నారు. కుల పెద్దల సమక్షంలో కూడా సమస్య పరిష్కారం కోసం మాట్లాడి విజయను భర్త వద్దకు కాపురానికి పంపినట్లు మృతురాలి తల్లిదండ్రులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం తమ కుమార్తె విజయ గుండెపోటుతో చనిపోయిందని చెప్పి తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి విజయ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్భాటంగా తీసుకొచ్చారని తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కుమార్తె విజయను తమ అల్లుడే హత్య చేసి ఏమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు తెలిపారు. తమ కుమార్తె విజయను హత్య చేసిన అల్లుడు అవినాష్‌ను వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని వారు పోలీసులను కోరారు. ఈ మేరకు మృతురాలు విజయ తల్లిదండ్రులు నేలకొండపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్‌ఎంపీలకు అండగా సీఐటీయూ

- జిల్లా నాయకులు విఠల్
- దాడులు ఆపకపోతే ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తాం
- ఆర్‌ఎంపీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-పెనుబల్లి



జిల్లాలో ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలకు అండగా జాతీయ కార్మిక సంఘం సీఐటీయూ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా నాయకులు చలమాల విఠల్ తెలిపారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యలయంలో ఆదివారం కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల ముఖ్య నాయకులతో పెనుబల్లి, వేంసూరు మండలాధ్యక్షుడు ఎం.రమేష్, క్రిష్ణమోహన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరం కోసం సీఐటీయూ పోరాడుతుందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఏమాత్రం బాగోలేదని, ప్రజలకు ప్రత్యామ్నాయం మార్గాలు చూపకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే గ్రామీణ వైద్యులను నిర్మూలించాలి అనుకోవడం సరియైందకాదన్నారు. ఆశాలు, అంగన్వాడీలు, పంచాయతీ కార్మికుల, ఇతరత అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు యూనియన్‌లు ఉన్నప్పుడు గ్రామీణ వైద్యులకు కూడా యూనియన్ ఉండాలన్నారు. ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ప్రభుత్వ వైద్య రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యా సంఘాలన్నీ ఏకతాటిపైకి వస్తే ధైర్యంగా ఎటువంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవచ్చునని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎంసి టిఎస్ఎంఎసిలు సంయుక్తంగా గ్రామీణ వైద్యులపై చేస్తున్న దాడులను ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ వైద్యులంతా కలిసి ఐక్య ఉద్యమాలు చేపడతామని ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొమ్మినేని కొండలరావు, బోయినపల్లి శ్రీనివాస్‌రావులు అన్నారు. భ్రూణహత్యలు, అబార్షన్‌లు లాంటి తప్పుడు వ్యవహారాలకు మనమంతా దూరంగా ఉండాలని సూచించారు. ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, ఎమర్జెన్సీ కేసులు ఉంటే ఖమ్మం హైయ్యర్ సెంటర్‌లకు రిఫర్ చేయాలన్నారు. ఎన్ఎంసీ, టిఎస్ఎంఎసిలు క్లినిక్ లపై దాడులు చేయడం దురదృష్టకరమని, తమకు ప్రజల మద్దతు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా కమిటీ సభ్యులు షేక్ నాగుల్ మీరా, మల్లు మురహరి, కాంతారావు, కనకరావు, లక్ష్మయ్య, సురేష్, రమేష్, రాములు, వెంకటేశ్వర్లు, వ్యకాస జిల్లా నాయకులు తిరపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదం ప్రమాదకరం





- సీపీఐ(ఎం) విద్యా విభాగం సబ్ కమిటీ సభ్యులు బోడపట్ల రవీందర్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మతోన్మాదం చాలా ప్రమాదకరమని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా విద్యా విభాగం సబ్ కమిటీ సభ్యులు బోడపట్ల రవీందర్ అన్నారు. ఖమ్మం నగరంలోని మంచికంటి హాల్లో జరుగుతున్న సీపీఐ(ఎం) మండల శిక్షణ తరగతులు రెండవ రోజు మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మతోన్మాదం అనే అంశంపై మొదటి క్లాస్‌ను బోడపట్ల రవీందర్ బోధించారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోయిందని ఇది చాలా ప్రమాదమన్నారు. ప్రజల మధ్యన విభేదాలు సృష్టించి, అమాయక ప్రజలను రెచ్చగొడుతూ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. మతం అనే విషం తలకెక్కితే ప్రజల్లో సోదరభావం దెబ్బతిని వాళ్ళ మెదడులలో విష పూరితమైన ఆలోచనలు వస్తాయన్నారు. కులం, మతం, ప్రాంతీయత చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. మతం వలన అనేక ప్రాంతాల్లో, దేశాల్లో జరిగిన నష్టాలను వివరించారు.

పార్టీ నిర్మాణం-పద్ధతులు

అనే అంశంపై ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ క్లాస్ బోధించారు. కమ్యూనిస్టు కార్యకర్తలు నిత్య విద్యార్థుల్లా ఉండాలని, నిరంతరం అధ్యయనం చేయాలని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు అనేక రూపాల్లో ఎండగట్టాలని సూచించారు. కమ్యూనిస్టులంతా సోదరభావంతో మెలగాలని, ఐక్యంగా ఉండాలని, దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని తెలిపారు. పార్టీ నిర్మాణ పద్ధతుల్లోనే ప్రతి కార్యకర్త పనిచేయాలని తెలిపారు. నిరంతర పని, అధ్యయనమే కమ్యూనిస్టులను ప్రజలకు దగ్గర చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వరరావు, సిద్దినేని కోటయ్య, నాయకులు ఉరడీ సుదర్శన్ రెడ్డి, పి.మోహన్‌రావు, పి.సంగయ్య, పెండ్యాల సుమతీ, నందిగామ కృష్ణ, పొన్నం వెంకటరమణ, ఏటుకూరి ప్రసాదరావు, పల్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు ప్రమాదకరం

- లౌకిక వాదానికి మోడీ తూట్లు
- కాంగ్రెస్ సంక్షేమ కార్యక్రమాల వేగం పెంచాలి
- సీపీఐ కౌన్సిల్ సమావేశంలో జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

నవతెలంగాణ-ఖమ్మం



బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా ఆరోపించారు. అతి కొద్ది కార్పొరేట్ల కోసమే బీజేపీ తన విధానాలను అమలు చేస్తుందని, దేశ సంపదను దోచిపెట్టడమేగాక ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించే పనిలో దుస్సహాసానికి పాల్పడుతుందని తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నిర్వహించిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీకి వ్యతిరేకత మొదలైందని, కాని ఓడించే స్థితికి చేరుకో లేదని బలమైన ప్రతిపక్షంతో బీజేపీ తన విధానాలను మార్చుకోక తప్పని స్థితి అని తెలిపారు. మతోన్మాద చర్యల నుంచి తిరోగమన బాట పట్టక తప్పదని ఇప్పటికైనా రాజ్యాంగాన్ని గౌరవిస్తూ లౌకిక వాదాన్ని కాపాడాలన్నారు. బీజేపీ వ్యతిరేక ప్రచారంలో కమ్యూనిస్టులు ముందు వరుసలో నిలిచారని దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు బలమైన కేంద్రాల్లో మోడీ, ఎన్డీఏకు గట్టి ఎదురు దెబ్బ తగిలిందన్నారు. కాంగ్రెస్ మరింత విశాల ధృకృథంతో మిత్ర పక్షాలను కలుపుకునిపోయి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎన్నో ఆశలు ఉన్నాయని ఆ ఆశలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం అమలులో వేగాన్ని పెంచాలని అజీజ్ పాషా సూచించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను ప్రజలు విశ్వసించారని, ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా హామీల అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీని విస్తరించేందుకు సమిష్టి కృషి జరగాలన్నారు. ప్రజా - సమస్యలను గుర్తించి ఆందోళనలకు కార్యకర్తలను సమాయత్తం చేయాలని అజీజ్ పాషా పిలుపునిచ్చారు. పాలకులు ఎవరైనా ప్రజలే ముఖ్యమని, ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ఎజెండా కావాలని ఆయన సూచించారు. పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె. సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరిలేరు మీకెవ్వరూ...!





- కార్పొరేట్ వైద్యంకు ధీటుగా ప్రభుత్వ వైద్యం
- వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు నెల్లూరి చందన, శిరీష
- ప్రసూతి సేవలందించడంలో భేష్

నవతెలంగాణ-కామేపల్లి



డ్యూటీ అయిపోయిన సమయంతో పనిలేదు రాత్రి పగలు అని చూడరు.. వైద్యం కోసం, ప్రసూతి కోసం ఒక్కఫోన్ చేస్తే వెంటనే స్పందించి ప్రభుత్వ ఆస్పత్రికి రాండీ మేముఉన్నాము అధైర్యపడవలసిన అవసరంలేదు ఏమి కాదు అని భరోసా ఇచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. కామేపల్లి మండలంలో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం, వైద్యసేవలు ఉపయేగించుకునేందుకు గ్రామాల్లో అవగాహనలు కల్పిస్తున్నారు. దీంతో ఓపీ పెరిగింది. వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటుంన్నారు. జిల్లాలో వైద్యసేవలందించడంలో భేస్ కావడంతో జిల్లా కలెక్టర్లు ఆర్‌వీ.కర్ణన్, వీపీ.గౌతమ్ ఇరువురు కలెక్టర్‌ల చేతుల మీద రెండు సార్లు అవార్డులు ప్రసంస పత్రాలు అందుకున్నారు. చందనాను ఆదర్శంగా తీసుకోని ప్రతిఒక్కరు పనిచేయాలని కలెక్టర్‌లు అన్నారు. వైద్యసేవలు అందించడంలో అలసట ఉండదు...కోపం ఉండదు.. చిరాకు ఉండదు. కష్టంగా ఉన్నా ఇష్టంతో చిరునవ్వుతో వైద్యం అందిస్తారు. సమయపాలన ఖచ్చితంగా పాటించి ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని, వైద్యసేవలు అందించడం అదృష్టంగా భావించాలని సూచించుచున్నారు. ఒక్క రాత్రిలోనే ముగ్గురుకి ప్రసవాలు చేసిన రోజులు ఉన్నాయి. డాక్టర్ చందన, డాక్టర్ శిరీషాను నమ్ముకోని ప్రభుత్వ వైద్యశాల వైపు ప్రజలు బాట పట్టి వైద్యం పొందుతున్నారు. సొంతపనిని సైతం వదులుకోని ప్రజలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేయరు. దీంతో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు చందన, శిరీష సేవలను గుర్తిస్తు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చందన, డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రభత్వ వైద్యశాఖలో ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు చేసే అవకాశం మాకు వచ్చినందుకు అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం అన్నారు. తమ కృషికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.



సీతారామ ప్రాజెక్టు కాలువ వద్ద రైతులు జలదీక్ష

నవతెలంగాణ-జూలూరుపాడు

సీతారామ ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువ నుండి గుండెపుడి పంచాయతీ రైతులకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ప్రాజెక్ట్ వద్ద రైతులు ఆదివారం జలదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. ఈ ప్రాంత రైతులు ఎంతో విలువైన పంట భూములను ప్రభుత్వం అడిగిన వెంటనే సీతారామ ప్రాజెక్టుకు ఇవ్వగా గుండెపుడి పంచాయతీ రైతులకు చుక్కనీరు ఇవ్వకుండా వేరే జిల్లాలకు నీళ్లను పంపించాలని ప్రభుత్వ అధికారులు ప్రతిపాదనలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. మా రైతు బాధలను మన ముఖ్యమంత్రి దయవుంచి గుండెపుడి పంచాయతీ రైతులకు లిఫ్ట్ ఏర్పాటు చేసి, పంట భూములకు నీళ్ళు ఇచ్చి రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కొమ్మినేని కృష్ణమూర్తి, తూముకోటయ్య, గాదె నాగేశ్వరరావు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, గాదె సత్యనారాయణ, వేల్పుల గోపాలకృష్ణ, కంచర్ల శేఖర్, దుద్దుకూరి నరేష్, గాదె కృష్ణయ్య, వలమల సామేలు, దుద్దుకూరు శ్రీను, సత్యనారాయణ, మద్దెబోయిన నరసింహారావు, బాదావత్ రమేష్, నల్లమోతు కృష్ణయ్య, గాదె సురేష్, కళ్యాణపు నరేష్, గోగుల సత్యనారాయణ కోరారు.



ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఆదర్శవంతమైనది

నవతెలంగాణ-మణుగూరు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఆదర్శవంతమైనదని టీఎస్ యూటీఎఫ్ మణుగూరు మండల ప్రధాన కార్యదర్శి షేక్ వీరా హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలో యూటీఎఫ్ నాయకులు కట్టా రాజ్ కుమార్ పదవి విరమణ అనంతరం జరిగిన సన్మాన సభలో పాల్గొని మాట్లాడారు. అన్ని వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది అన్నారు. మణుగూరులో కట్టా రాజకుమార్, జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సోషల్ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కట్టా రాజ్ కుమార్ 26 ఏండ్లుగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా ఎన్నో విశిష్ట సేవలు అందించారన్నారు. ఇటీవల పదోన్నతిపై స్కూల్ అసిస్టెంట్ సోషల్‌గా జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేరెడ్డి ఇంద్రసేనారెడ్డి, తోట విజయలక్ష్మి, కే.వరలక్ష్మి, రమా శ్రీదేవి, వరలక్ష్మి, కోటేశ్వరరావు, రామ్ రెడ్డి, హేమాద్రి, శ్రీనివాస్, బంధుమిత్రులు పాల్గొన్నారు.

కేసీఆర్ వల్లనే సీతారామ ప్రాజెక్టు కల సాకారం

- సీతారామ సక్సెస్ పట్ల జడ్పీటీసీ హర్షం

నవతెలంగాణ-ములకలపల్లి



మాజీ సీఎం కేసీఆర్ వల్లనే సీతారామ ప్రాజెక్టు కల సాకారం అయిందని జడ్పీటీసీ సున్నం నాగమణి అన్నారు. ఆదివారం మాదారం గ్రామం తన నివాసంలో సున్నం నాగమణి మాట్లాడారు. కేసీఆర్ అహర్నిశలు కృషి, భగీరథ అద్భుత ప్రయత్నంతో సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతమై, ఉమ్మడి ఖమ్మం జిల్ల ప్రజల చిరకాల జల సంకల్పం నెరవేరిందని అన్నారు. ఈ ప్రాజెక్టు నీటితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలు సస్యశ్యామలమై, అన్నదాతల కలలు సకారం అవుతుందని ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ మొదటి దశ పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాలు ఊరూరా పరుగులిడి లక్షలాది ఎకరాలకు చేరుతాయని తెలిపారు. ఇంతటి ఘన విజయంలో మండలం ఎంతో ప్రత్యేకతతో కూడుకున్నదని రెండు పంప్ హౌస్‌లు ములకలపల్లి మండలంలో ఉన్నాయని భవిష్యత్తులో సీతారాం ప్రాజెక్టు ద్వారా ములకలపల్లి మండలం అన్ని చెరువులకు ప్రాజెక్టులకు మీరు ఇచ్చి సస్యశ్యామలం చేయాలని ఆమె అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ సక్సెస్ విజయంలో భాగస్వాములైన నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బందిని కూడా అభినందిస్తున్నట్టు సున్నం నాగమణి తెలియజేశారు.

ఐఎన్‌టీయూసీని బదనం చేస్తే సహించేది లేదు

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి కాలరీస్ కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టీయూసీని బదనం చేస్తే సహించేది లేదని మణుగూరు ఏరియా ప్రాతినిధ్య సంఘ నాయకులు బ్రాంచ్ ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్, ఓబి వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా అధ్యక్షులు సిల్వేరు గట్టయ్య యాదవ్‌లు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. అధికారిక కమిటీ ఐఎన్‌టీయూసీతో సంబంధం లేని వ్యక్తులు రిటైర్మెంట్ అయినా పదవులపై మోజు తగ్గక దుష్ప్రచారం చేస్తున్న వారికి ఐఎన్‌టీయూసీకి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఓబి వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కేంద్ర అధికారిక సెంట్రల్ కమిటీతో, కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేకుండా మణుగూరు ఏరియాలో కొంతమంది నాయకులు తాము ఐఎన్‌టీయూసీ నాయకులమని, కాంగ్రెస్ నాయకులమని యూనియన్‌లో కాంగ్రెస్ పార్టీలో ఏ పదవులు లేకపోయినా తమ మాటే ఎమ్మెల్యే వద్ద సింగరేణి అధికారుల వద్ద చెల్లుబాటు అవుతుందని సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల వద్ద ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. తమ సంఘ కార్యకలాపాలోనే కాకుండా ఇతర సంఘాల కార్యకలాపాలలో కూడా జోక్యం చేసుకుంటూ కాలు, వేలు పెడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే పేరు చెబుతూ పైరవీలే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరపాక రాములు, బండారి జయరాజు, మిద్దెపాక శ్రీనివాస్, పిట్ సెక్రటరీలు తాళ్లూరి రాము, రామకృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

టీ-20 వరల్డ్ కప్ గెలిచిన భారత్

- సంబురాలు జరుపుకున్న యూత్

నవతెలంగాణ-కొత్తగూడెం



టీ-20 వరల్డ్ కప్ భారత్ గెలిచిన సందర్భంగా పట్టణంలో సంబురాలు జరుపుకున్నారు. గాంధీ పదం ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో భారత్ వరల్డ్ కప్ గెలిచిన సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. 17 సంవత్సరముల తర్వాత టీ-20 కప్‌ను భారత సాధించింది. ఈ సందర్భంగా స్థానిక క్రికెట్ అభిమానులు, యువకులు, క్రికెట్ వీరులకు అభినందనలు తెలిపారు. ప్రతి క్రికెట్ వీరుడు మన భారత ప్రాతిష్టను ప్రపంచ దేశాలకు తెలియజేసిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, భరత్ క్రికెట్ జట్టు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ పదం గాంధీ జిల్లా కన్వీనర్ చింతల చెరువు గెర్షోము, జ్ఞాన వినోధిని, జిల్లా కన్వనర్ కృపాకర్, ఆనీత, బుజ్జి, ఎలిజబెత్, లీనా, సభ్యులు ఉన్నారు.

భద్రాచలం ఏజెన్సీకి 'గోదావరి వరదల భయం'

- సహాయక చర్యలపై ముందస్తుగానే సమీక్షలు, సమావేశాలు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న ఏజెన్సీ వాసులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ఫైల్

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఏజెన్సీ ప్రాంత ప్రజలు పొంగిపొర్లుతున్న వాగులు, వంకలతో పాటు గ్రామాలను ముంచెత్తుతున్న గోదావరి వరదలతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. గోదావరి నది పరివాహక ప్రాంతాల ప్రజలు అనుక్షణం భయం భయంగా జీవనం సాగిస్తుంటారు. జూన్ నెల ముగిసి జూలై నెల ప్రారంభంతో లోతట్టు ప్రాంతం ప్రజల్లో ఆందోళన మొదలైంది.

ఈ ఏడాది ముందుగానే వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రాచలం ఏజెన్సీలోని గోదావరి నది పరివాహక వాసులకు గత చేదు అనుభవాలు మళ్లీ చవి చూడాల్సి వస్తుందేమో అనే భయం ప్రజలను వెంటాడుతోంది. గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలకు ప్రతి ఏటా వరదల భయం ఉంటూనే ఉంటుంది. జులై, ఆగస్టు, సెప్టెంబర్ ఈ మూడు నెలలు ఈ ప్రాంత వాసులు పడే కష్టాలు వర్ణనాతీతం. కనీసం తినడానికి తిండి కూడా దొరకని పరిస్థితుల్లో గడపాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. ఈ మూడు నెలల వరదల సమయం ఎంతో కీలకమని చెప్పక తప్పదు. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా భారీ విపత్తు జరిగే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అధికార యంత్రాంగం రాబోయే మూడు నెలలు వరదలకు ఎంతో కీలకం కావడంతో పూర్తిస్థాయి అప్రమత్తత ఎంతో అవసరం. దీనిపై అధికార యంత్రాంగం సైతం ఇప్పటికే బఫర్ స్టాక్, వరద సహాయక లాంచీలను సిద్ధం చేయాల్సి ఉండగా ఇప్పటివరకు వరద సహాయక లాంచీలు భద్రాచలం వద్ద కాన రావడం లేదు. గత నాలుగు రోజుల క్రితం గోదావరి వరదలపై రాష్ట్ర మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాజాగా భద్రాచలంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. అయినా ఈ ప్రాంత వాసులకు ఏదో జరగబోతుందేమో అనే భయం మాత్రం వీడట్లేదు.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కొత్తగా రూ.38 కోట్లతో భద్రాచలం వద్ద కరకట్ట పొడిగించే పనిని గత నెల రోజుల క్రితం ప్రారంభించారు. కానీ ఇప్పటికే కొద్దిపాటి వర్షాలు ప్రారంభం కావడంతో కొత్త కరకట్ట నిర్మాణ పనులు కూడా అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా వరదలు అత్యధికంగా ఆగస్టు నెలలోనే రావడం ఉండేది. కానీ ఇటీవల కాలంలో వరదలు జులై నెలలోనే వస్తుండడంతో నది పరివాహక ప్రాంతావాసుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. 1953, 1986లో అత్యధికంగా గోదావరి వరదలు రాగా అదే తరహాలో 1990లో 70.8 అడుగులు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం నమోదు అయింది. తిరిగి 32 ఏళ్ళకు 2022 జులై 16న 71.3 అడుగులకు చేరుకొని భద్రాద్రి ఏజెన్సీ జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఆ సమయంలో డివిజన్ వ్యాప్తంగా 79 గ్రామాలు వరద ముంపుకు గురికాగా 15,465 కుటుంబాలకు చెందిన 21 వేల మంది నిర్వాసితులు 77 పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. వరద ప్రభావిత గ్రామాలు వ్యవసాయపరంగా 99 గుర్తించగా 10,831 ఎకరాల్లో పంటనష్టం చోటుచేసుకుంది. 5,047 మంది రైతులు వరద కారణంగా నష్టపోయారని అధికారులే గుర్తించారు.

2023 జులై 30న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 56.1 అడుగులు నమోదైంది. ఈ సమయంలో భద్రాచలం వద్ద 15,96,899 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైంది. దీంతో 82 గ్రామాలపై ఈ ప్రభావం పడగా 3,056 మంది సురక్షిత ప్రాంతాలకు ముందస్తుగా తరలించారు. రాబోయే మూడు నెలలు గోదావరి నది పరివాహ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎంతో కీలకమైన సమయం. ప్రస్తుతం ఎడారిగా దర్శనమిస్తున్న గోదావరి జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఉగ్రరూపంతో ప్రవహించే అవకాశాలు ఉంటాయి. కావునా ఈ సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులు మధ్య సమన్వయం అత్యంత కీలకం ఇందుకోసం జూన్ ఆరంభంలోనే జిల్లా యంత్రాంగం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, కసరత్తు చేపట్టాల్సి ఉండగా కొత్తగా వచ్చిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బాధ్యతలు తీసుకున్న రెండవ రోజే వరదలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే మూడు నెలలు వరదలు, వ్యాధులపరగా ఎంతో కీలకం అని అధికార యంత్రాంగం ఆ దిశగా ముందు నుంచి కసరత్తు చేపట్టాల్సి ఉంది. అలాగే ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో సురక్షిత ప్రాంతాలను గుర్తించి అక్కడ బియ్యం పప్పులు నూనె తదితర నిత్యావసర సరుకులు బఫర్ స్టాక్‌గా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

గోదావరి వరద వచ్చిందంటే చాలు విస్తా కాంప్లెక్స్ వద్ద స్లూయిజ్ మూసివేస్తారు. దీంతో దుకాణాల్లోకి ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు అప్పటికి అప్పుడే తట్ట బుట్ట చదువుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ప్రతి ఏటా విస్తా కాంప్లెక్స్‌కు స్లూయిజ్ సమీపంలో ఉన్న రామాలయ పరిసరాలు దేవస్థానంకు చెందిన ఉచిత నిత్యాన్నదాన సత్రం, చప్టాకు దిగువన ఉండే అశోక్ నగర్, కొత్తకాలనీలలో స్లూయిజ్‌లకు సమీపంలో నివాసం ఉంటున్న కాలనీవాసులు ముంపుకు గురవుతున్నారు. దశాబ్దాకాలంగా అప్పటి ప్రభుత్వం సరైన రీతిలో వ్యవహరించకపోవడంతో ముంపు సమస్య వెంటాడిందినే విమర్శలు పట్టణ వాసుల నుండి వినిపిస్తున్నాయి. ఈసారి ఏ సమస్య రాకుండా ముందస్తుగానే చర్యలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్లూయిజ్ గేట్లకు ఆయిలింగ్ గ్రీజింగ్ పనులు చేపడుతున్నట్టు నీటిపారుదులశాఖ అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధిక సామర్థ్యం ఉన్న మోటార్లను కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భద్రాచలం శివారు ప్రాంతంలో 700 మీటర్ల కరకట్ట మిగులు నిర్మాణ పనులు సాగుతున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తం రూ.38,045 కోట్ల అంచనా విలువతో చేపట్టిన పనులు నూతన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం చేపడుతున్నారు. మొత్తం 11 మీటర్ల ఎత్తుతో ఈ కర కట్ట నిర్మిస్తుండగా ప్రస్తుతం 6 మీటర్ల ఎత్తు నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలుపుతున్నప్పటికీ వరదల సమయం నాటికి మిగిలిన పనులు పూర్తి కానిపక్షంలో పాత జ్ఞాపకాలు పునరావృతం అవుతాయా అనే సందేహాలు భద్రాచలం పట్టణ వాసుల్లో వ్యక్తం అవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తున్న గోదారి వరదల ముంపు ప్రాంత ప్రజల కోసం పాలక ప్రభుత్వాలు శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలని ఈ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.



ఎమ్మెల్యే సారూ... మా పాఠశాలకు రండి

- రావికంపాడు పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-చంద్రుగొండ

మండలంలోని రావికంపాడు గ్రామంలో జూన్ 12వ తారీకు నుంచి ప్రభుత్వ స్కూల్లు మొదలైనా మధ్యాహ్న భోజన పథకం మాత్రం మా రావికంపాడు పాఠశాలలో మొదలు కాలేదని విద్యార్థులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. మేము అందరం ఇంటి దగ్గర నుంచే భోజనం తీసుకొని వస్తున్నామని, మా అమ్మానాన్న ఉదయాన్నే కూలి పనులకు వెళ్లడంతో భోజనం రెడీ కాలేదని చెప్పడంతో కొంత మంది పాఠశాలకు కూడా రాకుండా ఇంటి దగ్గరే ఉంటున్నామని విద్యార్థులు తెలుపుతున్నారు. 20 రోజులు కావస్తున్నా మాకు భోజనం పెట్టేవారే లేరా మీరు ఒక్కసారి మా గ్రామానికి వచ్చి మా పాఠశాలని సందర్శిస్తే మాకు ఒక్క పూటైనా భోజనం పెడతారని పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే సార్‌ని వేడుకుంటున్నారు.

మొక్కజొన్న సాగులో మొలకెత్తని విత్తనాలు

- ఆదుకోవాలని రైతులు ఆవేదన

నవతెలంగాణ-అశ్వపల్లి



మండలంలోని కొందరు రైతులు ఇల్లందు పట్టణంలోని ఓ విత్తనాల వ్యాపారి షాపులో మొక్కజొన్న విత్తనాల సంచులు కొని, నష్టపోయినట్టు రైతులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగులో భాగంగా చేనులో యంత్ర పరికరంతో విత్తనాలు వేసి పది రోజులు అవుతున్నా ఎకరాకు 40 శాతం విత్తనాలు వేసి నేటికీ మొలకలు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అశ్వపల్లి మండల కేంద్రానికి చెందిన కుంట వెంకట్రాములు, కొమ్మ శ్రీను, కండే రాంబాబు అనే ముగ్గురు రైతులు ఇటీవల కాలంలో ఇల్లందులోని ఓ ప్రయివేట్ విత్తన దుకాణంలో జీన్సెక్స్ సీడ్స్ వారి టాపర్, సీపీ333 పేరుతో గల మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశారు. కొన్న ముగ్గురు రైతులు కలిపి మొక్కజొన్న సాగుకై సుమారు 12 ఎకరాల్లో మక్క సాగుకై వాడే యంత్ర పరికరంతో చేనుల్లో అడుగు దూరం చొప్పున విత్తనాలు వేశారు. పది రోజులు కావస్తున్నా గాని, 40 శాతం విత్తనాలు మొలకలు పైకి రాకపోవడంతో విషయాన్ని రెండు రోజుల క్రితం సంబంధిత ఇల్లందు వ్యాపారికి తెలియపరిచారు. వ్యాపారి మరో రెండు రోజులు చూడండి అంటూ రైతులకు ఉచిత సలహా ఇచ్చారు. రెండు రోజులు గడిచినా గాని, మొలకలు రాకపోవడంతో రైతులు విత్తనాలు మొలవని చోట తీసి చూశారు. అందులో గింజలు మెత్తబడి, నల్లగా పిండిలా మారాయని, ఇక అవి మొలకెత్తే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. సంబంధిత స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు మా చేన్లను పరిశీలించి, సంబంధిత షాపు యజమాని దగ్గర నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

సీఎండీ బలరామ్‌కు 'ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు'

- ప్రదానం చేసిన ప్రముఖ గ్రీన్ మ్యాపు సంస్థ

నవతెలంగాణ-కొత్తగూడెం



అందరిలోనూ పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్ తానే స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటి, తెలంగాణలోని 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను (మినీ ఫారెస్ట్) సృష్టించినందుకు గుర్తింపుగా సింగరేణి సంస్థ చైర్మెన్, ఎండీ ఎన్.బలరామ్‌కు గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ వారు "ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ' అనే ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ -2024 అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు ఈ అవార్డును అందజేశారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రభుత్వ రంగ, ప్రయివేట్ రంగ దిగ్గజ కంపెనీలు, అందులోని ప్రభావశీల వ్యక్తులకు గ్రీన్ మ్యాపుల్ వారు ప్రతి ఏడాది ఇటువంటి ప్రోత్సాహక అవార్డులు అందజేస్తున్నారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్.బలరామ్ ఇప్పటికే స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటారని, సింగరేణి సంస్థ కూడా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేస్తున్న సంస్థల్లో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నత స్థాయిలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం మినీ ఫారెస్ట్ సృష్టించడం దేశంలోనే అత్యంత అరుదని కొనియాడారు.

ఈ సందర్భంగా చైర్మెన్ ఎన్.బలరామ్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న తమ సంస్థ నిబంధనల ప్రకారం పచ్చదనాన్ని కాపాడడంతో పాటు స్వచ్ఛందంగా కూడా పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, సింగరేణి వ్యాప్తంగా 6 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు చెప్పారు. సింగరేణి సంస్థ చేస్తున్న పర్యావరణ హిత చర్యలకు గుర్తింపుగా 2021-22వ సంవత్సరంలో కార్బన్ న్యూట్రాలిటీ కంపెనీగా సీఎం పీడీఐ గుర్తించిందని పేర్కొన్నారు. ప్రతీ అడుగు పచ్చదనం అన్న నినాదంతో సింగరేణిలో మొక్కలు నాటే యజ్ఞాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వన మహోత్సవంలో మరో 2 వేల మొక్కలు నాటాలని వ్యక్తిగత లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు. దీంతో 20 వేల మొక్కలు నాటినట్లు అవుతుందన్నారు. కంపెనీలో ఈ ఏడాది 40 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. సింగరేణి పాఠశాలల్లో పర్యావరణ సిలబస్‌ను బోధిస్తున్నామని, ప్రతీ క్లాస్‌లోనూ గ్రీన్ కెప్టెన్లను నియమించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్టు చెప్పారు. తనకు అవార్డును ప్రకటించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపిన ఆయన ఈ అవార్డు సింగరేణిలోని పర్యావరణ హితులందరికీ చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ, ఆయిల్ ఇండియా తదితర కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మండలవాసికి గుండె శస్త్ర చికిత్స

నవతెలంగాణ-దమ్మపేట

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహకారంతో మండలానికి చెందిన ఓ వ్యక్తికి ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేశారు. మండలంలోని రంగువారిగూడెం గ్రామానికి చెందిన చెప్పుల వెంకటేశ్వర్లు హార్ట్‌కు సంబంధించిన మూడు వాల్స్ పాడవ్వడంతో ఎమ్మెల్యే జారె ద్వారా ఖమ్మం ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు పంపించగా అక్కడ కార్డియాలజిస్ట్ డాక్టర్ సీతారామ్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం అందించి మూడు స్టంట్‌లు వేసి ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జారెకు, హాస్పిటల్ డాక్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మారప్పగూడెం గ్రామానికి చెందిన కోర్స బొజ్జి స్పైనల్ కార్డ్ టిబితో బాధపడుతూ ఎమ్మెల్యే అనుచరుడు వంకా జానకీరామ్ ద్వారా ఎమ్మెల్యే సహకారంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఖమ్మం మమత హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం పొందుతున్నారు.

ప్రశ్నించు, పోరాడు, సాధించు నినాదంతో కదలిన యువత

నవతెలంగాణ-దమ్మపేట



ప్రశ్నించి పోరాటటమే ధ్యేయంగా పెట్టుకుని దమ్మపేట పట్టణాన్ని సర్వతో ముఖాభివృద్ధిగా తీర్చిదిద్దడానికి దమ్మపేట యువత నడుంబిగించింది. ఆదివారం మండల కేంద్రం దమ్మపేటలో నిర్వహించిన మేము సైతం దమ్మపేట అభివృద్ధి కోసం అనే కార్యక్రమాన్ని దమ్మపేటకు చెందిన అడ్వకేట్ గోళ్ళ భవాని, కృష్ణ యాదవ్, పిట్టల నవీన్ ముదిరాజ్‌లు చేపట్టారు. ఈ కార్యక్రమం దమ్మపేట రైతు వేదిక వద్ద నిర్వహించగా పెద్ద సంఖ్యలో యువకులు పట్టణ ప్రముఖులు పలువురు పాత్రికేయులు పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వాడకం నియంత్రణ, దమ్మపేటలో గ్రంథాలయం ఏర్పాటు, పట్టణంలో ఉన్న బెల్టు షాపులను తొలగించే విధంగా కృషి చేయడంతో పాటు పారిశుద్ధ్యంలో అస్తవ్యస్తంగా ఉన్న దమ్మపేట పట్టణాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి, పంచాయతీ అధికారుల నిర్లక్ష్య వైఖరి పై యువకులు గ్రామ ప్రముఖులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ఉన్న సమస్యల్ని దశలవారీగా పటిష్టమైన ప్రణాళిక రూపొందించి ప్రాధాన్య క్రమంలో పరిష్కరించడానికి యువకులందరూ ఆమోదం తెలిపారు. దమ్మపేట పట్టణంలో చిరకాల స్వప్నమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరుకు కలుగుతున్న ఆటంకాలు తొలగించడానికి, రాత్రి సమయాలలో దమ్మపేట బస్టాండ్‌కు రావలసిన బస్సులు రాకపోవడం తదితర అంశాలపై పెద్ద ఎత్తున చర్చలు జరిపి పరిష్కారం జరిగేంతవరకు వివిధ రూపాల్లో నిరంతరం తమ పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా దమ్మపేట పట్టణ అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ. సహకారంతోపాటు తోడ్పాటు అందించాలని యువకులు కోరారు. దమ్మపేట పట్టణ అభివృద్ధి కోసం యువకులు చేసిన కృషికి విశేష స్పందన లభించింది. దమ్మపేట వార్తలు అనే గ్రూపులో పట్టణ అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా సమావేశం నిర్వహించాలని యువకులందరూ నిర్ణయించారు. ఒక సాధారణ వాట్సప్ సందేశం ద్వారా సమావేశానికి పిలవగానే పెద్ద సంఖ్యలో యువకులు, పట్టణ ప్రముఖులు పాల్గొని తమ తమ అభిప్రాయాలు వెల్లడించడంతో దమ్మపేట మండల వ్యాప్తంగా ఈ విషయం పెద్ద చర్చగా మారింది. ఏదిఏమైనా యువకులు ఒకతాటిపై నిలబడి దమ్మపేట అభివృద్ధికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమని పలువురు ప్రముఖులు అభిప్రాయ పడ్డారు.

వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ నాయకత్వం పీకే ఓసీ-2 సందర్శించి కార్మికులను కలుసుకొని వాస్తవ పరిస్థితులను పరిశీలించినట్టు బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రామనసయ్య ఆదివారం తెలిపారు. ముఖ్యంగా రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర పరిస్థితిని పరిశీలించగా వర్షాకాలంలో కార్మికులు ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వరదను దృష్టిలో పెట్టుకొని తగిన రక్షణచర్యలు తీసుకోవాలని, లేదా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆలోచించాలని కోరారు. పీకే ఓసీ 2లో అన్ని సెక్షన్లను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా రోడ్లు మొత్తం బురదమయం అయిపోయి కార్మికులు నడవలేని పరిస్థితి ఉందని అన్నారు. సరిగా ఫిల్ పీకే ఓసీ టు వెళ్లే రహదారిలో స్ట్రీట్ లైటింగ్ సరిగాలేని కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. పై సమస్యలన్నింటినీ కార్మికులను అడిగి తెలుసుకున్న బ్రాంచ్ నాయకత్వం కంపెనీ కోసం అనుక్షణం కష్టించి పనిచేస్తున్న కార్మికుల కోసం మేనేజ్మెంట్ వెంటనే యుద్ధ ప్రాతిపదికన సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ యూనియన్ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో మేకల ఈశ్వర ఆవుల నాగరాజు, ఆధార్ల సురేందర్, శనిగరపు కుమారస్వామి, కోడి రెక్కల శ్రీనివాసరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అవుట్ ఫుట్ ట్రాన్స్‌ఫార్మర్లపై పిడుగు

- దగ్ధమైన భారీ యంత్రాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- బీటీపీఎస్‌కి రూ.30 కోట్ల ఆస్తి నష్టం
- జెన్కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య

నవతెలంగాణ-మణుగూరు



విద్యుత్ అవుట్ ఫుట్ ట్రాన్స్‌ఫార్మర్లపై పిడుగు పాటు కారణంగానే భారీ నష్టం వాటిల్లినట్టు జెన్కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య తెలిపారు. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్)లో విద్యుత్ అవుట్ ఫుట్ ట్రాన్స్‌ఫార్మర్లు శనివారం రాత్రి పిడుగుపాటుకు గురైనయని అన్నారు. ఆదివారం సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం విలేకలతో మాట్లాడారు. సుమారు రూ.30 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. బీటీపీఎస్ విద్యుత్ కేంద్రంలో శనివారం సాయంత్రం మేఘావృతమై వర్షం కురిసిందన్నారు. ఈ క్రమంలోనే ట్రాన్స్‌ఫార్మపై పిడుగు పడటంతో భారీగా మంటలు ఎగిసి పడ్డాయి అని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లలోఉండే కరెంట్ ఆయిల్ కారణంగా మంటలు ఉధృతమైనట్టు అధికారులు గుర్తించారన్నారు. ఎలాంటి ప్రాణా నష్టం సంభవించలేదని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారుల సూచనల మేరకు యూనిట్ 1ను షట్ డౌన్ చేసినట్టు తెలిపారు. ఘటనపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించటంతో, విచారణలో భాగంగా జెన్కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, సీఈ జనరల్ రత్నాకర్ పవర్ ప్లాంట్‌ను సందర్శించి వివరాలు సేకరిస్తున్నారని అన్నారు. పిడుగు పడ్డట్టు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్టు ధృవీకరించారు. పూర్తీ పరిశీలన అనంతరం ఎంత నష్టం వటిల్లిందో తెలుస్తుందని తెలిపారు. ఈ ప్రమాదం వాళ్ళ మొదటి యూనిట్లో 270 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని మొదటి యూనిట్ ఉత్పత్తి పునరుద్ధరణకు పూర్తీ చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఈ బిచ్చన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జులై 3న చలో కలెక్టరేట్

నవతెలంగాణ-టేకులపల్లి



జులై 3న కస్తూర్బా గాంధీ పాఠశాలలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్స్ సమస్యల కోసం చేపట్టిన కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన టేకులపల్లి కేజీబీవీ హాస్టల్లో జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 470 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో, సుమారుగా 5000 మంది నాన్ టీచింగ్ వర్కర్స్ విద్యార్థినుల నాణ్యమైన విద్య కోసం 12 గంటలు శ్రమదోపిడి గురవుతూ అహర్నిశలు కష్టం చేస్తున్నారని, వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదన్నారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు ఇచ్చి, అధికారం చేపట్టిన తరువాత హామీలను అమలు చేయకుండా బుట్ట దాఖలు చేశారన్నారు. ఎన్నో ఏళ్ళుగా పోరాడి సాధించుకున్న చట్టాలను, కార్మికుల హక్కులకు రక్షణగా నిలిచినటువంటి 44 చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి ఆదాని, అంబాని లాంటి బడా కార్పొరేట్ కంపెనీలకు కార్మికుల శ్రమను దోచిపెట్టడానికి ఈ ప్రభుత్వాలు చట్ట సవరణలు తీసుకొచ్చారన్నారు. కేజీబీవీలలో రిటైర్మెంట్ అవుతున్న మహిళా కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు అందించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి వారిని ఆదుకోవాలన్నారు. మన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలని ఇచ్చిన తీర్పును అమలు చేయాలన్నారు. కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి నెలకు రూ.26,000 జీతం వేతనం ఇవ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలలో ఖాళీగా ఉన్న కింది స్థాయి పోస్టులను నింపి, వర్కర్లపై పనీభారాన్ని తగ్గించాలన్నారు. ఏఎన్ఎంలకు నైట్ డ్యూటీలు తగ్గించి, సెకండ్ ఏఎన్ఎం పోస్టులను ఇవ్వాలన్నారు. ఈ ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ టేకులపల్లి ఏరియా కమిటీ అధ్యక్షుడు మదార్, నాన్ టీచింగ్ వర్కర్స్ సునీత, విజయ, సాలమ్మ, బి.సునీత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్

నవతెలంగాణ-ములకలపల్లి



మండలంలో ములకలపల్లి నుండి తాళ్లపాయ పంచాయతీ, రింగురెడ్డిపల్లి మీదుగా భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి వద్ద నూతన బ్రిడ్జ్ ఏర్పాటు చేయడం కోసం గత ప్రభుత్వం నిధులు ఇచ్చింది. సదరు కాంట్రాక్టర్ ఆరు నెలల క్రితం ప్రస్తుతం వున్న బ్రిడ్జిను తొలగించి అప్రోచ్ రహదారిని నిర్మించారు. అది రాత్రి కురిసిన చిన్న పాటి వర్షానికి పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ ఆరు నెలల కాలంలో బ్రిడ్జి పనులు ఏమాత్రం మొదలు కాలేదు. పాత బ్రిడ్జిని తొలగించడం వల్ల రింగిరెడ్డిపల్లి, తాళ్లపాయ, సుందర్ నగర్, మంగళ గుట్ట వెళ్లాలంటే రహదారి లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ ప్రవీణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి బ్రిడ్జిను పరిశీలించారు. ఈ సందర్భంగా తాటికొండ ప్రవీణ్ మాట్లాడారు. ఈ అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడం వలన మండల కేంద్రానికి రావడానికి ఇది ప్రధాన రహదారి కావడంతో ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ 6 గ్రామాలలో నివసించే ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రావడానికి, మరీ ముఖ్యంగా గర్భిణీలు హాస్పిటల్‌కు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కాబట్టి అధికారులు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన శాశ్వత బ్రిడ్జిని త్వరగా నిర్మించాలని స్థానిక ఎంఎల్ఏ, రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటికొండ ప్రవీణ్, జిల్లా నాయకులు గరికే రాంబాబు, మండల ఉపాధ్యక్షులు పొడిచేటి చెన్నారావు, ప్రధాన కార్యదర్శి గొల్ల వీరభద్రం, మండల కార్యదర్శి బొక్క వెంకటేశ్వర్లు, మండల మైనార్టీ అధ్యక్షులు ఎస్.కె.పాషా, జనసైనికులు అరవింద్, సున్నం నాగబాబు, చెన్నారావు, చింతకాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి హక్కులు సాధించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాస్

నవతెలంగాణ-అశ్వాపురం



కార్మికులు కలిసికట్టుగా ఉన్నప్పుడే తమకు రావలసిన హక్కులను సాధించవచ్చని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో హమాలి వర్కర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా ఉంటేనే వారికి రావాల్సిన ఎగుమతి, దిగుమతి రేట్లు పెంచుకోవచ్చు అన్నారు. సమిష్టి నిర్ణయాలతో ఎలాంటి హక్కుల నైనా సాధించుకోవచ్చు అన్నారు. మండల నాయకులు సాంబశివరావు మాట్లాడుతూ వివాదాలకు చోటు లేకుండా ఉండాలన్నారు. క్రమశిక్షణతో పని చేస్తూ జీవనోపాధి పొందాలి అన్నారు. ఈ సమావేశానికి గడల కరుణాకర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో శేషు, ఉపేంద్ర, కృష్ణ ఉప్పలయ్య, శీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

మెగా డీఎస్సీ వెయ్యాలి

- గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్

నవతెలంగాణ-పాల్వంచ



తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ప్రభుత్వా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాల్వంచలోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో డీవైఎఫ్ఐ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ నియామాకాలపై జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని అన్నారు. ప్రభుత్వం ఇస్తానన్న రెండు లక్షల ఉద్యోగాలకు సంబంధించిన విధివిధానాలు ప్రకటించాలని కోరారు. మెగా డీఎస్సీ ప్రకటించడంతోపాటు 25 వేల డీఎస్సీ పోస్టులు పెంచాలని అన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ కనుగుణంగా గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1లో 1:100 పోస్టులు పెంచి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం చెల్లిస్తానన్న రూ.4 వేల నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలని కోరారు. ఉద్యోగ నియామాకుల విషయంలో గత ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోయిన నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపెట్టాలని కోరారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల ఉద్యోగ నియామకాల వాగ్దానాల అమలు కోసం చొరవ చూపాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది యువతీ, యువకులు ఉన్నత విద్యావంతులు సరైన విద్యా ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారందరికీ ఉపాధి అవకాశాలు చూపెట్టాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాలంగి హరికృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు చంద్రావు వెంకన్న, జగన్, నాగకృష్ణ కుమార్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా హాస్పిటల్‌ను సందర్శించిన ప్రాతినిధ్య సంఘ నాయకులు

నవతెలంగాణ-మణుగూరు



రోగులకు సదుపాయాలతో పాటు వైద్య సేవలు మెరుగు పరచాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి సిల్వేరు గట్టయ్య యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం మణుగూరు ఏరియా హాస్పిటల్‌ను సందర్శించి మాట్లాడారు. హాస్పిటల్‌లో దీర్ఘకాలికంగా కొన్ని సమస్యలు నెలకొని ఉన్నాయనీ, వీటి పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరారు. ఏరియా హాస్పిటల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని, ఎలక్ట్రీషియన్ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఏసీలు, ఫ్యాన్లు, లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ఈ అండ్ ఎం డిపార్ట్మెంట్ వారు హాస్పటల్ సందర్శించి వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

వైద్య పరీక్షల సాంకేతిక పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. ఏరియా హాస్పిటల్ ఉప ముఖ్య వైద్యాధికారిణి మేరీ కుమారిని కూడా ఆమె చాంబర్లో కలిసి సమస్యలు వివరించామని ఏరియా జీఎంని కూడా కలిసి వినతి పత్రం అందజేయనున్నట్టు నాయకులు విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ షాభూద్దీన్, సంతోష్ చరణ్, రాము, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

2న సీతారాం ప్రాజెక్ట్ కాలువల సందర్శన

- భూములు కోల్పోతున్నారే కానీ సాగునీరు అందకుండా చేశారు
- అఖిలపక్ష రైతు సంఘాలు

నవతెలంగాణ-ఇల్లందు




నాడు మాజీ సీఎం కేసీఆర్ టేకులపల్లి మండలంలో రోళ్లపాడు రిజర్వాయర్ శంకుస్థాపన చేశారు. దానికి సంబంధించినటువంటి పనులు కూడా ప్రారంభం చేశారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డిజైన్‌ని పూర్తిగా మార్చి ఇల్లందు ప్రాంతానికి సాగునీరు అందకుండా కాలువల ద్వారా నీరు మొత్తం ఇతర జిల్లాలకు మళ్లించే ప్రయత్నం ముమ్మరం చేసి బిజీ కొత్తూరు దగ్గర మొన్న ట్రైల్ రన్ వేశారు. దీన్ని నిరసిస్తూ జూలై 2న అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సీతారాం ప్రాజెక్ట్ కాలువల సందర్శన చేయాలని అఖిలపక్ష బృందం నిర్ణయించింది. నియోజకవర్గ స్థాయిలో రైతు సంఘాల సంయుక్త సమావేశం స్థానిక విశ్రాంవు భవన్లో ఏపూరి బ్రహ్మం అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య, బీఆర్ఎస్ జిల్లా నాయకులు దిండిగల్ల రాజేందర్, లక్కినేని సురేందర్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు నబి, న్యూ డెమోక్రసీ ఎన్డి జిల్లా నాయకులు యాదలపల్లి సత్యం, తుపాకులు నాగేశ్వరావు, సీపీఐ నాయకులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, సీపీఐ(ఎం) నాయకులు ఆలేటి కిరణ్, టీడీపీ రైతు సంఘం నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు, సేవాలాల్ సమితి జిల్లా నాయకులు శివ నాయక్, రైతు సంఘం నాయకులు బుర్ర వెంకన్న, సీపీఐ రైతు సంఘం నాయకులు బొల్లికొమరయ్య, బజార్ ఆంజనేయులు గౌడ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో దుమ్ముగూడెం ప్రాజెక్టుగా ఉన్నటువంటి దాన్ని గత ప్రభుత్వం సీతారాం ప్రాజెక్టుగా పేరు మార్చారు. ఈప్రాజెక్టువల్ల మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అత్యధిక మండలాలకు గ్రామాలకు సాగు నీరు అందించి జిల్లాని సస్యశ్యామలం చేయా లని నిర్ణయించారు. ఈ ప్రాంతం నుంచి తీసుకెళ్తున్నటువంటి ఈ కాలువల వల్ల ఈ ప్రాంత రైతులు భూములను కోల్పోతున్నారు. తప్ప ఈ ప్రాంత భూములకి నీరు అందే పరిస్థితి లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లం దు అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి జులై రెండో తారీకున సీతా రాం ప్రాజెక్ట్ కాలువలు అన్నిటిని కూడా విజిట్ చేయాలని తర్వాత దీనిపై ఉద్యమ కార్యచరణ రూపొందించాలని రైతు సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి.

వైద్యో నారాయణో హరి

- నేడు అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

వైద్యో నారాయణ హరి.. వైద్యులు దేవుళ్లతో సమానమని అన్నారు పెద్దలు. తల్లిదండ్రులు జన్మనిస్తే వారు పునర్జన్మనిస్తారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ నుండి వైద్యులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాటం చేశారు. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో అయినా ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా సేవలందిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడడంలో ముందుంటున్నారు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం....



జూలై 1న అంతర్జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటారు. డాక్టర్స్ డే మొదట 1991లో నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రసిద్ధ వైద్యుడు డాక్టర్ బిధన్ చంద్రరాయ్‌కు గౌరవం ఇచ్చేందుకు ఈ ప్రత్యేక దినోత్సవాన్ని జూలై 1న జరుపుకుంటారు. ఆయన 1 జూలై, 1882న జన్మించి, 1 జూలై 1962న మరణించారు. బీసీ రాయ్ వైద్య రంగంలో అనేక సంస్కరణలు చేపట్టి 1943లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా వ్యవహరించారు. వైద్యుల లక్షణం, నిబద్ధత, త్యాగనిరతి అనే పదాలకు ఆయన నిలువెత్తు నిదర్శనం. ప్రభుత్వం ఆయన అందించిన సేవలకు గుర్తుగా భారతరత్న ఇచ్చింది. వైద్యుల దినోత్సవాన్ని దేశంలోనే కాకుండా వివిధ దేశాల్లో వేర్వేరు తేదీల్లో జరుపుకుంటారు. వైద్యులకు గ్రీటింగ్ కార్డులు పంపడం, చనిపోయిన వైద్యుల సమాధులపై పూలు ఉంచుతారు. కొవిడ్ మహమ్మారి సమయమంలో వైద్యులు, నర్సులు ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పోరాటం చేశారు. లక్షలాది మందిని తమ వైద్యంతో కాపాడారు. ఇక కొందరు వైద్యులు తమ ప్రాణాలను సైతం పోగొట్టుకున్నారు.

డాక్టర్స్ డే చరిత్ర..

మొదట వైద్యుల దినోత్సవం మార్చి 28, 1933లో జార్జియాలోని విండర్లో నిర్వహించారు. ఈ మొదటి ఆచారంలో వైద్యులు, వారి భార్యలకు కార్డులు పంపడం, డాక్టర్లాంగ్తో సహా మరణించిన వైద్యుల సమాధులపై పుష్పాలు ఉంచడం, డాక్టర్ అండ్ శ్రీమతి విలియం టీ రాండోల్స్ ఇంట్లో అధికారిక విందు వంటివి ఉన్నాయి. బారో కౌంటి అలయన్స్ వైద్యులకు నివాళి అర్పించేందుకు శ్రీమతి ఆల్మండ్ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత, ఈ 9 ప్రణాళికను 1933లో బారో కౌంటీ అలయన్స్ అధ్యక్షురాలు విండర్కు చెందిన శ్రీమతి ఈఆర్ హారిస్ జార్జియా స్టేట్ మెడికల్ అలయన్స్‌కు సమర్పించారు. మే 10, 1934న జార్జియాలోని అగస్టాలో జరిగిన వార్షిక రాష్ట్ర సమావేశంలో తీర్మానం ఆమోదించారు. సెయింట్ లూయిస్, మిస్సోరి, నవంబర్ 19–22, 1935లో జరిగిన 29వ వార్షిక సమావేశంలో సదరన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్స్ ఈ తీర్మానాన్ని అలయన్స్ ప్రెసిడెంట్ శ్రీమతి జే.బోనార్ వైట్ ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి, వైద్యుల దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

తెలంగాణ తొలి దశ ఉద్యమకారులకు సన్మానం

నవతెలంగాణ -కొత్తగూడెం



ఉర్దూ ఘర్ ఆధ్వర్యంలో తొలి దశ ఉద్యమకారులను రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ నాయకులు ఉర్దూఘర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి ఘనంగా సన్మానించారు. 1969 తెలంగాణ తొలి ఉద్యమానికి బీజం వేసి ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నడిపిన ఆనాటి ఉద్యమకారుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా నయీమ్ ఖురేషి మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం 15 ఆగష్టు 1947కు వచ్చినప్పటికీ మన తెలంగాణకు నిజాం సర్కార్ నుంచి విముక్తి 17 సెప్టెంబర్ 1948లో రావడం జరిగిందని అనంతరం 1950 నవంబర్ ఒకటోనా ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడిన తర్వాత తెలంగాణ చాలా నష్టపోవటం జరిగిందని అన్నారు. తొలి తెలంగాణ ఉద్యమం కేటీపీస్ పాల్వంచలో 1968 జులై ఒకటిన టీఆర్సీ ద్వారా 1400 ఉద్యోగాలున్న కేవలం తెలంగాణ వాళ్లకు 200 ఉద్యోగాలు కేటాయించినప్పుడు కృష్ణ అనే కేటీపీస్‌లో సాధారణ కార్మికుడు నిరాహార దీక్ష ద్వారా ఉద్యమం నిర్వహించడని తొలత ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, రాజకీయ నాయకులు ఉద్యమం కొనసాగించినప్పటికీ 2012 సకల జనుల సమ్మె ద్వారా మన తెలంగాణ పోరాడి సాధించుకున్నామన్నారు. ఉద్యమకారుల కోసం గత ప్రభుత్వం ఏదీ చేయలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు పింఛన్ రూ.5 వేలు, ఇల్లు లేని వారికి ఇంటి స్థలము, ఆరోగ్యశ్రీ కార్డు, ఫ్రీ బస్సు పాస్, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూఘర్ కార్యదర్శి మహమ్మద్ షరీఫ్, కోశాధికారి జావీద్, సీనియర్ కాంగ్రెస్ మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ మొహమ్మద్ జానీ పాషా, ఏస్‌జె మాజీ అధ్యక్షులు అమీర్ ఖాద్రి, బాబు జానీ, దుమ్ముడి నాగేశ్వర్ రావు, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శకుంతల సేవలు అభినందనీయం

నవతెలంగాణ-టేకులపల్లి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్‌లో హెల్త్ సూపర్వైజర్‌గా పని చేస్తున్న వీసం శకుంతల సేవలు అభినందనీయం అని వైద్యాధికారి దినేష్ అన్నారు. శకుంతల ఉద్యోగ విరమణ సందర్భంగా ఉద్యోగ విరమణ వేడుక సమావేశం వైద్యశాలలో ఆదివారం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగం చేయాలంటే మహిళలు భయపడే రోజుల్లో గిరిజన కుటుంబం నుంచి వచ్చి 34 సంవత్సరాలకు పైగా వైద్య ఆరోగ్య శాఖలో కమ్యూనికేషన్స్ రహదారులు సరిగ్గా లేని సమయంలో మారుమూల ప్రాంతాలలో గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చేవైద్య సేవలు అంకితభావంతో ప్రజలకు అందించడంలో వీసం శకుంతల కృషి మరిచి పోలేనివి అని దీనికి నిదర్శనం ఇప్పటికీ ప్రజలు ఆమెకి ఇస్తున్న గౌరవమే అన్నారు. ఆమెకు ఉన్న ఓర్పు సహనం ఇతరులకు ఎంతో ఆదర్శమని వైద్యాధికారి ఆమె సేవలను కొనియాడారు. 1990 మే లో వేలేరుపాడు కోయిదాలో ఏఎన్ఎంగా ఉద్యోగం పొంది సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గంగారం సబ్ సెంటర్‌లో, రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా పనిచేసి హెల్త్ సూపర్వైజర్‌గా పదోన్నతిపై సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తిరిగి వచ్చి ఇక్కడ సేవలందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వక్తలు ఆమెతో కలిసి పని చేసిన తమ అనుభవాలను ఆమె అందించి విశేషమైన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు వజ్జా పార్వతి, సీతమ్మ భద్రమ్మ, సత్యవతి, ఆరోగ్య విస్తరణాధికారి దేవా,ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, పబ్లిక్ హెల్త్ నర్సులు చంద్రకళ, దయామణి, తెరోజా, సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, గుజ్జా విజయ, కృష్ణ కుమార్, వైద్య సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో జర భద్రం...

- డాక్టర్ విజయ్ కుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట



వర్షాకాలం వేసవి తర్వాత వచ్చి వేడి గాలులు, ఉక్కపోత నుండి అందరికీ ఊరటనిస్తుందని, అయినప్పటికీ ఇది మలేరియా, డెంగ్యూ, చికన్‌గున్యా ఇతర ప్రాణాంతక వ్యాధుల కలిగి ఉందని మనం మర్చిపోకూడదని సీహెచ్‌సీ అశ్వారావుపేట ప్రధాన వైద్యులు డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. ఆయన ఆదివారం నవతెలంగాణతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం వివిధ రకాల దోమలు పుట్టి రోగాల ప్రబలుతున్నాయి. వర్షాకాలంలో దోమల వల్ల కలిగే వ్యాధులు, వాటి లక్షణాలు తెలుసుకుందాం. వర్షాలు ఎక్కువగా పడటం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. భూమి మీద నీరు నిల్వగా ఉండటం, పాడైపోయిన టైర్లలో నీళ్ళు చేరడం మొదలగు వాటివల్ల దోమలు ఎక్కువగా పుట్టుకొస్తాయి. అందుకే దోమల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.



ప్రస్తుతం ఆయా వ్యాధుల లక్షణాలను తెలుసుకుందాం

చికన్ గున్యా: దోమ కుట్టిన తర్వాత 4 నుండి 8 రోజుల్లో ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయంటే, తలనొప్పి, హఠాత్తుగా అధిక జ్వరం, వాంతులు, వికారం, కండ్ల కలక, దద్దుర్లు, కీళ్ళ నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మలేరియా : ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు కారణంగా మలేరియాకు కారణమయ్యే పరాన్నజీవులు మనుషుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. మలేరియా సోకిన వారిలో తీవ్రమైన చలి, జ్వరం, వికారం, తలనొప్పి, వాంతులు, డయేరియా, కడుపు నొప్పి, కీళ్ళ నొపులు, అలసట, శ్వాస వేగం పెరగడం, గుండె కొట్టుకునే వేగం పెరగడం, దగ్గు ఉంటాయి.

డెంగ్యూ : దోమకాటు తర్వాత 4 నుండి 10 రోజులకు డెంగ్యూ లక్షణాలు కనిపిస్తాయి. 104 ఫారెన్ హీట్ ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం, తలనొప్పి, ఎముకలు, కండరాలు, కీళ్ళ నొప్పులు, కళ్ళ వెనక నొప్పి, చర్మం మీద దద్దుర్లు, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని ఆయన తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | జులై 01, 2024 | www.navatelangana.com



యువకులకు జెర్సీ టీషర్ట్స్ వితరణ

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్ పార్టీ కారేపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాప్(టోనీ) యువకులకు న్యూ జెర్సీ టీషర్ట్స్‌ను వితరణ చేశారు. కారేపల్లికి చెందిన యువకులు క్రికెట్‌లో మంచి ప్రతిభ చూపుతుండటంతో వారిని ప్రోత్సహించటానికి క్రికెట్ టీమ్ సభ్యులైన యువకులకు టీషర్ట్స్ అందజేశారు. ఈసందర్భంగా మేదరి టోనీ మాట్లాడుతూ యువకులను ప్రోత్సహించటం ద్వారా వారిలో ఉన్న ప్రతిభ వెలికి వస్తుందన్నారు. టీషర్ట్స్ అందించిన టోనీని యువకులు అభినందించారు. ఈకార్యక్రమంలో యువకులు ఆదెర్ల హరి, నాగి, జాన్వెస్లీ, అమీర్, కాకాటి సాయి, పెద్దమ్మ వెంకటేశ్, తురక అనిల్, సాంబ, సాయి, సికింధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడుగా తోటపల్లి చిన్న సైదులు

నవతెలంగాణ - బోనకల్

ఎమ్మార్పీఎస్ మండల నూతన అధ్యక్షుడిగా రాయన్నపేట గ్రామానికి చెందిన తోటపల్లి చిన్న సైదులు ఎన్నికయ్యాడు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నూతన మండల కమిటీల సమావేశాలు కంచర్ల ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం జరిగాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మండల ఇంచార్జ్ చిలక నాగరాజు హాజరయ్యారు. సమావేశంలో ఎంఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట హనుమంతరావు, మాదిగ జిల్లా సీనియర్ నాయకులు తాటికొండ వెంకటరత్నం, ఎమ్మార్పీఎస్ మండల గౌరవ అధ్యక్షులు తోటపల్లి సాల్మన్ రాజు, కోట చిన్న గురవయ్య, ఎంఎస్ఎఫ్ నాయకులు గద్దల ఉపేందర్, కోట గోపి, కర్లకుంట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛలో రాజ్ భవన్

నవతెలంగాణ-ఖమ్మం

25 రోజులు గడుస్తున్నా నీట్ విద్యార్థుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా, మొండిగా వ్యవహరిస్తోందని, అనేక సార్లు విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, దేశ వ్యాప్తంగా నిరసనలు తెలుతున్నా చీమకుట్టినట్టు కూడా లేదని, అందుకే సోమవారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రాజ్ భవన్ ముట్టడి జయప్రదం చేయాలని పిడిఎస్యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. వెంకటేష్ , పివైఎల్ రాష్ట్ర నాయకులు సురేష్ పిలుపునిచ్చారు . ఆదివారం ఖమ్మంలోని పిడిఎస్యూ పివైఎల్ ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పిడిఎస్యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, పివైఎల్ ఖమ్మం నగర ప్రధాన కార్యదర్శి రవీందర్, గుండేటి అశోక్, పిడిఎస్యూ నాయకులు పృథ్వి ప్రసాద్, వెంకటేష్, మాల్సర్ తదితరులు పాల్గొన్నారు.



'వానరాల' మూకలతో ప్రజలు బెంబేలు

- సత్తుపల్లి పట్టణంలో కోతుల బెడద

నవతెలంగాణ-సత్తుపల్లి


సత్తుపల్లి పట్టణంలో ప్రజలకు వానరాల బెడద రోజురోజుకు అధికమవుతోంది. ఏ వీధిలో చూసిన వానర సమూహాలు దర్శనమిస్తున్నాయి. వాటి సంఖ్య వేలలో ఉంటుందని అంచన. కోతులన్నీ ఒకేసారి గుంపులు గుంపులుగా రోడ్డు మీదకు రావడం, తినుబండారాల కోసం ఇండ్లలోకి చొరపడటం లాంటి చేష్టలతో భయాందోళనలకు గురవుతున్నారు. మహిళలు డాబాపైకి బట్టలు ఆరవేసేందుకు వెళ్లడానికి కూడా జంకుతున్నారు. పండ్ల కొట్లు, తోపుడు బండ్ల వ్యాపారులు, రహదారి వెంబడి ఇడ్లీ బండ్లవారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. కర్రలు దగ్గర పెట్టుకొని అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. అత్యవసరమొచ్చి ఏదైనా కొందామని మార్కెట్‌కు మహిళలు ఒంటరిగా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వానర మూకను తరిమే ప్రయత్నం చేసినా అవి ఎదురు దాడికి దిగుతుండటంతో జాగ్రత్త పడటం తప్ప చేసేదేమీ లేకుండాపోయింది. కోతుల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో బడికి వెళ్లిన పిల్లలు ఇంటికొచ్చే వరకు తల్లిదండ్రులకూ ఆందోళనకరమే. మున్సిపాలిటీ వారు తక్షణమే స్పందించి కోతులను పట్టేవారిని పిలిపించి వాటిని దరిదాపుల్లో కాకుండా సుదూరంగా ఉన్న అటవీ ప్రాంతానికి తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో వదిలేసి వస్తే అవి తెల్లారక ముందే పట్టణానికి చేరుకుంటాయని ప్రజలు అంటున్నారు.

నీలమ్మ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

గిరిజన విద్యార్థులను కన్నబిడ్డల్లాగా చూసుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటూ కామాటిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి తప్పదని ఉద్యోగం చేసినన్ని రోజులు అధికారుల చేత ప్రశంసలు పొందినప్పుడే చేసిన ఉద్యోగానికి సార్థకత లభిస్తుందని భద్రాచలం ఏటిడిఓ నరసింహారావు అన్నారు.

ఆదివారం దుమ్ముగూడెం మండలంలోని మంగువాయి బడవ బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కామాటిగా విధులు నిర్వహించి ఈరోజు ఉద్యోగ పదవి విరమణ పొందుతున్న కల్లూరి నీలమ్మ సన్మాన ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కామాటీగా ఉద్యోగ పదవీ విరమణ పొందుతున్న నీలమ్మ మాట్లాడుతూ నా శరీరంలో సత్తువ ఉన్నంతవరకు గిరిజన విద్యార్థినీ విద్యార్థుల సంక్షేమం కొరకు నా యొక్క సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న నీలమ్మకు పాఠశాల హెచ్ఎం, డిడి ట్రైబల్ వెల్ఫేర్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఏవో కృష్ణార్జున, హెచ్ఎం వీర కుమారి, సర్వేశ్వర దొర, నారాయణ, రంగయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంపూర్ణమ్మకి మంత్రి తుమ్మల నివాళి

నవతెలంగాణ-సత్తుపల్లిరూరల్

కాకర్లపల్లి గ్రామానికి చెందిన పువ్వాళ వసంతం భార్య, మాజీ ఉప సర్పంచ్ పువాళ్ళ మమత ప్రసాద్ అత్తయ్య పువ్వాళ సంపూర్ణమ్మ ఇటీవల మరణించారు. ఆదివారం ఆమె దశదిన కర్మకు వ్యవసహాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హజరై చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయుకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, జిల్లా అధ్యక్షులు పువాళ్ల దుర్గాప్రసాద్, పువ్వాళ ఉమా కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకంపై అవగాహన సదస్సు

- **కుంట నుండి పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి**

నవతెలంగాణ-తల్లాడ

రైతు భరోసా పథకంపై ఆదివారం గంగాదేవిపాడు సొసైటీలో అవగాహన సదస్సు సొసైటీ అధ్యక్షుడు తూము వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు మాట్లాడుతూ ఒక కుంట వ్యవసాయ భూమి నుండి పది ఎకరాల రైతు వరకు రైతు భరోసా అందించాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు అనుములు బుద్ధిసాగర్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సదానందం

- **ఘనంగా సన్మానించిన ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం**
- **అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సంస్థకు పేరు తెచ్చారు**

నవతెలంగాణ-ఇల్లందు


జెకె5 ఉపరితల గని నందు విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన యం.సదానందం, ఇపి ఎలక్ట్రీషియన్‌ను ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం రావాల్సినటువంటి బెనిఫిట్స్ గ్రాట్యూవిటి, సీఎంపిఎఫ్, పెన్షన్ ఆర్డర్, ఎఫ్‌బిఐఎస్ మొత్తం వారికీ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సదానందం అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సంస్థకు పేరు తెచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ పూర్ణచందర్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఇంజనీర్ చిన్నయ్య, ఏరియా పిట్ కార్యదర్శి సంజీవ చారి, నవీన్ కుమార్ ఇతర అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

- **ప్రజాపాలన దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు**
- **మండల వ్యాప్తంగా సుమారు 500 మంది అర్హులు**

నవతెలంగాణ - బోనకల్

గృహజ్యోతి పథకం అమలు కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయం చుట్టూ పలువురు అర్హులు తిరుగుతున్నారు. సుమారు మండల వ్యాప్తంగా వెయ్యి మంది ఉన్నట్లు ప్రాథమిక అంచనా. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు లోపు ఉన్నవారికి ఉచిత విద్యుత్తు అందించనున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మండల వ్యాప్తంగా విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారుల ఎంపికను నిర్వహించారు. గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారులుగా ఎంపిక కావాలంటే ప్రధానంగా ఆధార్ కార్డు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు ఫారం, ఫోన్ నెంబర్ ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం షరతు విధించింది. మండల వ్యాప్తంగా విద్యుత్ సిబ్బంది సర్వే నిర్వహించి గృహజ్యోతి లబ్ధిదారులను గుర్తించింది. విద్యుత్ సిబ్బంది వచ్చిన సమయంలో సంబంధిత గృహదారులు, ఇతరు కారణాల చేత వారు గృహజ్యోతి లబ్ధిదారులకు అనివార్య కారణాల వలన గుర్తించబడలేదు. అయితే విద్యుత్ సిబ్బంది వచ్చిన సమయంలో అవసరమైన అన్ని ఆధారాలను చూపించినప్పటికీ కొంతమందికి జరిగిన పొరపాట్లు వలన లబ్ధిదారులుగా ఎంపిక కాబడలేదు. వివిధ కారణాలచే అర్హత కలిగిన వారు కూడా లబ్ధిదారులుగా ఎంపిక కాని వారికి స్థానిక మండల



పరిషత్తు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి పొరపాటులను సరిదిద్దారు. అయినా ఏవో కారణాల చేత కొంతమందికి అన్యాయం జరిగింది. ఈ విధంగా మండల పరిధిలోని 22 గ్రామాలకు సంబంధించి సుమారు 1000 మంది వరకు ఉండవచ్చునని ప్రాథమిక అంచనా. పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన పంది రాంబాబు 29 డిసెంబర్ 2023న ఆ గ్రామంలో దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు రసీదు నెంబరు 204. ఆ రోజు నుంచి మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. ఇండ్ల వరలక్ష్మిది కూడా ఇదే పరిస్థితి. బోనకల్‌కు చెందిన యార్లగడ్డ పద్మ, దురిశెట్టి నాగమ్మ చిరునోములకు చెందిన గరపాకుల రామకోటయ్య తదితరులు మండల పరిషత్ కార్యాలయంకు వచ్చి చివరకు తమ సమస్య పరిష్కారం కావడం లేదని విలేకరుల ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరు 100 యూనిట్లు లోపే విద్యుత్ వినియోగించుకున్నారు. తమకు అర్హత ఉన్నప్పటికీ విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా తాము అనర్హులుగా మారిపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఈ విషయంపై ఎంపీఓ వ్యాకరణ వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రిని వివరణ కోరగా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పొరపాట్లను సరి చేస్తున్నామని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి కచ్చితంగా గృహ జ్యోతి పథకం వర్తిస్తుందని తెలిపారు. అటువంటి వారు ఉంటే మండల పరిషత్ కార్యాలయం వద్దకు ప్రజా పాలన దరఖాస్తు రసీదు, ఆధార్ కార్డు తీసుకొని రావాలని కోరారు. అయితే ప్రజా పాలన సమయంలో కొంతమంది గృహజ్యోతి పథకానికి రైట్ గుర్తు పెట్టలేదని, మరికొందరు ఖాళీగా వదిలేశారని, అటువంటి వారే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అటువంటివారు సుమారు మండలంలో 400 మంది ఉండవచ్చునని తెలిపారు. ప్రభుత్వం 'ఎడిట్ ఆప్షన్' ఇచ్చేవరకు తాము ఏమీ చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చేవరకు వారందరూ వేసి ఉండవలసిందేనని స్పష్టం చేశారు.

సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు

- **నాసా ప్రపంచ విజేతలను అభినందించిన యాజమాన్యం**

నవతెలంగాణ-ఖమ్మం



నాసా ఆధ్వర్యంలో నిర్వహించిన నాసా స్పేస్సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో స్థానిక మమత ఆసుపత్రిరోడ్ నందుగల శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ద్వితీయ, తృతీయస్థానంలో నిలిచారు. వారిని అభినందిస్తూ శనివారం ప్రశంసాపత్రాలను మరియు మెమోంటోలు అందించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానుద్దేశించి శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆస్ట్రనోవా ప్రాజెక్టు నుంచి ద్వితీయ స్థాయి బహుమతి పొందిన వారు 7వ తరగతికి చెందిన జి.బెన్య, బి.హెమకేష్, వి.నిశాంత్, బాలుశ్రీశౌరి మరియు కె.ఆఖిల్ 8వ తరగతికి చెందిన యస్.దివ్వచరణ్, ఐ.రేవంత్, శిక్, వై. నాగచైతన్య మరియు యం.గిరిధర్, నికోలస్ ప్రాజెక్టు నుంచి తృతీయ స్థాయి బహుమతి పొందిన వారు 6వ తరగతికి చెందిన సంకీర్త్, సిద్ధువర్షిత్, షన్ముఖఉదయ్ మరియు ఆరుష్, 7వ తరగతికి చెందిన తేజెష్, కొదండరామ్ మరియు హెమంత్ 9వ తరగతికి చెందిన మనిదీపక్, పొన్వాత్సాయి మరియు రోషన్ సిరిల్ విద్యాసంవత్సరంలో కేవలం తరగతి గదిలో విద్యాబోధనకే పరిమితం కాకుండా సాంకేతిక విప్లవానికి నాందిగా ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న విద్యార్థులను, ఇందుకు సహకరించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం ద్వితీయ మరియు తృతీయస్థానం సాధించిన విద్యార్థులకు విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల డిజియం. చేతన్ మాధుర్, కోఆర్డినేటర్ క్రిష్ణారావు, ప్రిన్సిపాల్స్ టిఎల్ఎన్. శర్మ, నాగప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్స్ రామకృష్ణారెడ్డి, సురేష్, డీన్స్, కె.వి.ఆర్, రాజశేఖర్‌రెడ్డి, కె.యల్.నరసింహ, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, జగదీష్, రమేష్, శ్రీనివాస్, శ్రావన్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సంబంధాలను బలోపేతం చేసుకోవాలి

- **సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం**

నవతెలంగాణ-వైరాటౌన్



కమ్యూనిష్టు కార్యకర్తలు, పార్టీ సభ్యులు ప్రజల సమస్యలపై పనిచేస్తే కమ్యూనిస్టు పార్టీ బలోపేతం అవుతుందని, ప్రజా సంఘాల ద్వారా ప్రజా సంబంధాలను బలోపేతం కోరకు కార్యకర్తలు, సభ్యులు కషి చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం అన్నారు. సిపిఎం వైరా మండల పార్టీ సభ్యుల శిక్షణా తరగతులు రెండవ రోజు పార్టీ, ప్రజాసంఘాల-నిర్మాణం అంశంపై భూక్యా వీరభద్రం బోధించారు. కమ్యూనిస్టు పార్టీల నాయకత్వానా అనేక పోరాటాలు చేసిన ఫలితంగా ప్రజల హక్కులు కాపాడబడ్డాయని, సమస్యలు పరిష్కారానికి కృషి జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కొరకు ప్రజలందరినీ సమీకరించి పనిచేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాసంఘాల నిర్మాణం ద్వారా విస్తతంగా ప్రజల్లోకి వెళ్లి పార్టీ బలోపేతానికి సభ్యులందరూ కృషి చేయాలని కోరారు. ఆర్థిక విధానాలు- వాటి ప్రభావం అంశంపై పార్టీ నాయకులు మంద సైదులు బోధించారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోవడానికి పాలకులే కారణమని, ఆర్థిక సంపద ప్రజాపరం అయితేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆర్థిక అసమానతలు పోవాలంటే కమ్యూనిస్టులు బలపడాలని కోరారు. ఈ రాజకీయ తరగతులకు ప్రిన్సిపాల్‌గా పార్టీ మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, మండల నాయకులు తుము సుధాకర్, వనమా చిన్న సత్యనారాయణ, షేక్, మజీద్, వెంకట్ రెడ్డి, షేక్ షైనా బి, జాన్ బి, వెంకట నారాయణ, కిలారు శ్రీనివాసరావు ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పోశారు...సైడ్ మట్టి పోయటం మరిచారు...

- **ప్రమాదాలకు నిలయంగా సిసి రోడ్డు నిర్మాణం....**
- **చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్.**
- **పట్టించుకోని అధికారులు**

నవతెలంగాణ-ముదిగొండ



సిసి రోడ్డు పోశారు. సైడ్ మట్టి పోయటం కాంట్రాక్టర్ మరిచిన దుస్థితి. మండలపరిధిలోని గోకినేపల్లి గ్రామంలో గత నాలుగు నెలల నుండి వాహనదారులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కళ్ళ ముందు కనపడుతుంది. వివరాల్లోకి వెళితే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) నిధులతో గోకినేపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన ఓ కాంట్రాక్టర్ పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో సిసి రోడ్లను నిర్మాణం చేశారు. సుమారు నాలుగు నెలల క్రితం సిసి రోడ్లు నిర్మాణం పూర్తి చేశారు. నిర్మాణం పూర్తి కావడంతో కాంట్రాక్టర్ సైడ్ మట్టి పోయటం మరిచాడు. దీంతో గ్రామంలోని వాహనదారులు ప్రజలు పలు ఇక్కట్ల పాలవుతున్నారు. సిసి రోడ్డుపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైడ్ తొలగాలంటే మట్టి పోయకపోవడంతో ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు వాపోయారు. సిసి రోడ్లు సైడు మట్టి పోయాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణం చేసిన సిసి రోడ్లలో నాణ్యత లోపించిందని ప్రజల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నిర్మాణం చేసిన సిసి రోడ్లు సైడు కాంట్రాక్టర్ మట్టి పోసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్య సేవలతో స్తంభాద్రి హాస్పిటల్

- **నూతన హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రులు భట్టి, తుమ్మల**

నవతెలంగాణ-ఖమ్మం



అత్యాధునిక సాంకేతికత, అత్యుత్తమ నిపుణుల వైద్య బృందంతో ప్రజానీకానికి నాణ్యతతో కూడిన మెరుగైన వైద్యసేవలు అందించేందుకు స్తంభాద్రి హాస్పిటల్‌ను నెలకొల్పడం అభినందనీయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మంలోని నెహ్రూ నగర్‌లో నూతనంగా నిర్మించిన స్తంభాద్రి హాస్పిటల్‌ను మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం నగరం నడిబొడ్డులో ఖమ్మం ఉమ్మడి జిల్లాలతో పాటుగా నల్గొండ, వరంగల్ జిల్లాలోని సామాన్య మధ్యతరగతి ప్రజానీకానికి అత్యాధునిక సౌకర్యాలతో, మెట్రోపాలిటన్ నగరాలకు దీటుగా స్తంభాద్రి యాజమాన్యం అడ్వాన్స్ వైద్యంను అందుబాటులోకి తీసుకు రావడం సంతోషాదయకమని తెలిపారు. హాస్పిటల్‌లో ఒకేచోట దశబ్దకాలం అనుభవం కలిగిన ఐదు రకాల ప్రత్యేక(స్పెషలైజేషన్) వైద్య బృందంచే సేవలు కలిగి ఉండటం హర్షదాయకమని అన్నారు. ప్రజలకు నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందిస్తూ..వారి మన్ననలను పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.స్తంభాద్రి హాస్పిటల్ వైద్య బృందం న్యూరో సర్జన్ డాక్టర్ గట్టినేని సురేష్, ఆర్థో డాక్టర్ మేదరమెట్ల అనిల్ కుమార్, యురాలజిస్టు డాక్టర్ గుమ్మడి రాఘవేంద్ర, కార్డియాలజిస్టు డాక్టర్ పేర్ల హర్షతేజ, ఎండీ జనరల్ మెడిసిన్ డాక్టర్ దొగిపర్తి కృష్ణ సుమంత్ మాట్లాడారు. అరవై వేల చదరపు అడుగుల సువిశాలమైన భవనంలో 130 పడకల సౌకర్యంతో ఐదుగురు స్పెషలిస్టుల డాక్టర్ల వైద్య సేవలతో స్తంభాద్రి హాస్పిటల్‌ను నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. హాస్పిటల్‌లో అత్యాధునిక క్యాథల్యాబ్, సిటీ స్కాన్ సౌకర్యంను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభించిన స్తంభాద్రి హాస్పిట్ నిర్వహణకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజానీకం తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, డీసీసీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీ నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతారావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ.మాలతి, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, సెక్రెటరీ డాక్టర్ జగదీష్, ట్రెజరర్ డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఏబీసీడీల వర్గీకరణను నిలిపివేయాలి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఏబీసీడీల వర్గీకరణ నిలిపివేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టే సుధాకర్, గుమ్మడి కనకరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో త్వరలో ఎస్సీ ఏబీసీడీల వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ప్రాంతీయ పార్టీల ప్రభావం పెరిగి మత, కులాలను విద్వేశాలు రెచ్చగొట్టి మానవతా సంబంధాలను ఐక్యత భావాలను విడదీస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ సమాజ అభివృద్ధి కోసం భారత రాజ్యాంగ భద్రత కోసం నిమ్నజాతుల బహుజనుల ఐక్యత కోసం మాల మహానాడు ప్రముఖ పాత్ర పోషిస్తాదని తెలిపారు. నేడు జరగబోయే మాల మహానాడు జిల్లా స్థాయి విస్తృత సమావేశం విజయవంతం చేయుటకు అనంతరం మధ్యాహ్నం జరగబోయే ప్రముఖ డాక్టర్స్ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు ఖమ్మం జిల్లా మాల మహానాడు గౌరవ సలహాదారులతోపాటు అధ్యక్ష కార్యదర్శులు ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శిలు, వర్కింగ్ ప్రెసిడెంట్స్, ప్రచార కార్యదర్శులు, మహిళా సంఘం నాయకురాలు, నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, ప్రచార కార్యదర్శులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.

రామిశెట్టి వారి ఓణీల అలంకరణ వేడుక

నవతెలంగాణ-జూలూరుపాడు



మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన రామిశెట్టి రామారావు-రాధిక దంపతుల కుమార్తె అవంతిక ఓణీల అలంకరణ వేడుక కార్యక్రమం చంద్రుగొండ రోడ్డు ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయి ఎక్సలెంట్ కరస్పాండెంట్ ఆరబోయిన కృష్ణ ప్రసాద్ హాజరై చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సాయి ఎక్సలెంట్ విద్యార్థినీ, విద్యార్థులు, మండల మీడియా మిత్రులు, చాపల మడుగు నరసింహారావు, చౌడం వెంకటేశ్వర్లు, యూసఫ్, గుమ్మడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిస్టు యోధుడు చౌదరి తేజేశ్వర్‌రావును పరామర్శిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల సీపీఐ(ఎం) నేతలు

అభ్యుదయవాది సావిత్రమ్మ



- తెలుగు రాష్ట్రాల సీపీఐ (ఎం) నాయకులు

శ్రీకాకుళం : సీపీఐ(ఎం) అభిమాని సావిత్రమ్మ గొప్ప అభ్యుదయవాది అని పలువురు నాయకులు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం నవభారత్‌నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన సావిత్రమ్మ సంస్మరణ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి సీపీఐ(ఎం) నాయకులు హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల చిన్నతనంలోనే భర్త చనిపోయినా అధైర్యపడకుండా ముగ్గురు కుమారులను సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల వెనుక మహిళలు విశిష్ట పాత్ర పోషిస్తారనడానికి సావిత్రమ్మ ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ సావిత్రమ్మ తన కుమారులను పార్టీ కోసం పనిచేసేలా ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఆమెతో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున, తన తరుపున సావిత్రమ్మ కుటుంబానికి ఆయన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. జ్యోతి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో పని చేయడం వల్లే ఆ కుటుంబం సమాజం పట్ల ఎంతో బాధ్యతగా పని చేసిందన్నారు.

ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ సావిత్రమ్మ ఆలోచనలు, ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, బి.వెంకట్ తమ సంతాప సందేశాన్ని పంపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి లోకనాథం, శ్రీకాకుళం, విశాఖ జిల్లా కార్యదర్శులు డి గోవిందరావు, జగ్గునాయుడు, సావిత్రమ్మ కుమారులు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బాబూరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి జయరాం, మరో కుమారుడు పోస్టల్ యూనియన్ నాయకులు జ్యోతీశ్వరరావు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గన్నారు.

ఆహారధాన్యాలు

సరఫరా, వినియోగం మధ్య భారీ వ్యత్యాసం

అదృశ్యం!



- స్థిరంగా ఉత్పత్తి... పడిపోతున్న వాడకం
- ఇతరత్రా అవసరాలు కలిపినా భారీగానే అంతరం

న్యూఢిల్లీ : దేశంలో ఆహారధాన్యాల లభ్యత, వినియోగం మధ్య వ్యత్యాసం అంతకంతకూ పెరిగిపోతోంది. 2008 వరకూ ఈ వ్యత్యాసం అంత ఎక్కువగా ఉండేది కాదు. ప్రస్తుతం దేశంలో ఏటా 300 మిలియన్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరుగుతోంది. దాణా, విత్తన వినియోగం, వేస్టేజీని మినహాయిస్తే నికరంగా 250 మిలియన్ టన్నులు అందుబాటులో ఉంటున్నాయి. మరి వినియోగం మాటేమిటి? సగటున ప్రతి వ్యక్తికీ నెలకు 12 కిలోల ఆహారధాన్యాలు అవసరమవుతాయని అంచనా.

నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) నిర్వహించిన తాజా వినియోగ సర్వే ప్రకారం 2022-23లో ఒక్కో వ్యక్తి నెలకు 9 కిలోల ఆహారధాన్యాలను మాత్రమే వినియోగించాడు. తలసరి వినియోగం గ్రామీణ ప్రాంతాలలో 9.61 కిలోలుగా, పట్టణ ప్రాంతాలలో 8.05 కిలోలుగా ఉంది. జాతీయ జనాభా కమిషన్ అంచనా ప్రకారం ఆ సమయంలో భారత జనాభా 138 కోట్లు ఉన్నదని అనుకుంటే దేశంలో ఆహారధాన్యాల వినియోగం 150 మిలియన్ టన్నులు ఉండాలి.

పడిపోతున్న వినియోగం

2004-05, 2011-12 మధ్యకాలంలో ఆహారధాన్యాల తలసరి నెలవారీ వినియోగం 11.6 కిలోల నుండి 10.7 కిలోలకు పడిపోయింది. 2008 నుండి ఆహారధాన్యాల సరఫరా, వినియోగం మధ్య అంతరం పెరుగుతూనే ఉంది. 2022-23లో ఈ వ్యత్యాసం 100 మిలియన్ టన్నులకు చేరింది. 2023-24లో కూడా అంతే ఉంటుందని అంచనా. అనేక సంవత్సరాలుగా దేశంలో ఆహారధాన్యాల వినియోగం ఏటా 150 మిలియన్ టన్నులుగానే ఉంటోంది. జనాభా పెరుగుతుంటే తలసరి వినియోగం తగ్గుతోంది. ఇదిలావుంటే గత పది సంవత్సరాలుగా ఆహారధాన్యాల ఉత్పత్తి సంవత్సరానికి రెండున్నర శాతం చొప్పున నిలకడగా పెరుగుతోంది.

ఇతర వినియోగాలు ఉన్నా...

ఆహారధాన్యాలను కుటుంబ అవసరాల కోసమే కాకుండా ఇతరత్రా కూడా వినియోగిస్తారు. వినియోగానికి పనికిరాని ఆహారధాన్యాలు పశు దాణాగా ఉపయోగపడతాయి. దేశంలో దాణా వినియోగం ఐదు నుండి పది శాతానికి పెరిగింది. దీనినిబట్టి పదిహేను మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు దాణాగా ఉపయోగపడుతున్నాయి. దాణాకే కాకుండా ఇథనాల్ ఉత్పత్తికి కూడా ఆహారధాన్యాలను వినియోగిస్తారు. 2022-23లో ఎనిమిది మిలియన్ టన్నుల ఆహారధాన్యాలను ఇథనాల్ ఉత్పత్తికి వాడారని అంచనా. బీరు ఉత్పత్తికి ఒక మిలియన్ టన్ను ఆహార ధాన్యాలు, బిస్కట్లు, రొట్టె, బన్ను, కుకీల ఉత్పత్తి కోసం మరో మిలియన్ టన్ను ఆహారధాన్యాలను వాడుతున్నారు. ప్రభుత్వ నిల్వల్లో అధిక భాగం ఇథనాల్ ఉత్పత్తికే వినియోగపడుతోంది. ఇవన్నీ మినహాయించినప్పటికీ సరఫరా, వినియోగం మధ్య ఇంకా 75 మిలియన్ టన్నుల అంతరం ఉంది. ఈ అంతరం విస్మరించదగినదేమీ కాదు. ఓ సంవత్సరం పాటు యాభై కోట్ల మంది ప్రజల ఆకలి తీరుస్తుంది. 250 సంవత్సరాల పాటు గాజా ప్రజల కడుపు నింపుతుంది.

విశ్వసనీయ సమాచారం అవసరం

దేశంలో ఆహారధాన్యాల ధరలు వేగంగా పెరిగిపోతున్నాయి. హోల్‌సేల్ ధరల సూచికలో ఆహారధాన్యాలకు సంబంధించిన ద్రవ్యోల్బణ రేటు 2022 అక్టోబరులో 12.1% ఉంటే 2023 అక్టోబరులో 7.5% ఉంది. సరఫరా, వినియోగం మధ్య వ్యత్యాసం కేవలం గణాంకాలకు మాత్రమే పరిమితమైన పజిల్ కాదు. ప్రణాళిక, ధరల విధానాన్ని ముందుకు తీసికెళ్లాలంటే ఆహారధాన్యాల ఉత్పత్తి, వినియోగంపై విశ్వసనీయమైన సమాచారం కావాల్సి ఉంటుంది. వినియోగం కంటే ఉత్పత్తి వేగంగా పెరుగుతుంటే కనీస మద్దతు ధర ఎలా లభిస్తుంది? ఆహారధాన్యాల ఎగుమతులను దీర్ఘకాలం కొనసాగించడం సాధ్యమేనా? అది వాంఛనీయమా? బియ్యం, గోధుమల నుండి భారతీయ వ్యవసాయాన్ని ఇతర ఆహారధాన్యాల వైపు మళ్లించడానికి సమయం ఆసన్నమైందా? విశ్వసనీయమైన గణాంకాలు అందుబాటులో ఉంటేనే ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు లభిస్తాయి.

లెక్క తేలడం లేదు

అసమానతల కారణంగా ఆహారధాన్యాల ఎగుమతులు పెద్ద ఎత్తున పెరిగాయి. 2021-22, 2022-23లో సంవత్సరానికి 30 మిలియన్ టన్నుల మేర ఎగుమతులు జరిగాయి. ప్రభుత్వం వద్ద నిల్వలు పేరుకుపోవడం కూడా సరఫరా, వినియోగం మధ్య వ్యత్యాసానికి కారణమవుతోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే ఏటా 100 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు లెక్కకు రావడం లేదు.

పట్టణ భూమి, ఆస్తి రికార్డుల క్రమబద్ధీకరణకు

ప్రణాళికలు సిద్ధం చేస్తున్న మోడీ ప్రభుత్వం

- దాదాపు తొమ్మిది రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ : గ్రామీణ ప్రాంతాల్లో భూమి, ఆస్తి రికార్డు వ్యవస్థలను ఆధునీకరించిన తర్వాత.. మోడీ ప్రభుత్వం ఇప్పుడు భూ లావాదేవీలలో పారదర్శకతను తీసుకురావటానికి పట్టణ ప్రాంతాల్లో భూమి, ఆస్తి యాజమాన్య రికార్డులను క్రమబద్ధీకరించటానికి సిద్ధమవుతున్నది. గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన భూ వనరుల శాఖ(డీఓఎల్ఆర్).. ఈ పథకాన్ని ఖరారు చేసే ముందు సవాళ్లను అర్థం చేసుకోవడానికి దాదాపు తొమ్మిది రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేస్తున్నదని మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రెండు కీలకమైన కేంద్ర ప్రభుత్వ పథకాలు డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రామ్ (డీఐఎల్ఆర్ఎంపీ), గ్రామాల సర్వే, గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన సాంకేతికతతో మ్యాపింగ్ (ఎస్‌వీఏఎంఐటీవీఏ) పథకం విజయవంతంగా అమలు జరిగిన తర్వాత కేంద్రం ఈ విషయంలో ముందుకెళ్తుండటం గమనార్హం. ఈ నెల ప్రారంభంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శివరాజ్ సింగ్ చౌహాన్.. బీజేపీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు సంబంధించిన పనిని ప్రారంభించాలని అధికారులను కోరారు. పట్టణ భూ రికార్డుల సంక్లిష్ట సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం గతేడాది నుంచి మార్గాలను అన్వేషిస్తున్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం గతేడాది జూన్‌లో నిటి ఆయోగ్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ), డీఐఎల్ఆర్ఎంపీని అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కలిసి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యూటీ)తో సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించింది.

గతేడాది డిసెంబర్‌లో ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన ప్రధాన కార్యదర్శుల సమావేశంలో కూడా ఈ విషయంపై చర్చ జరిగిందని ప్రభుత్వ వర్గాల సమాచారం. పట్టణ ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్ కోసం.. కర్నాటక, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు అనుసరించిన వివిధ నమూనాలను డీఓఎల్ఆర్ పరిశీలిస్తున్నదనీ, వాటిలో మంచి పట్టణ భూ రికార్డు వ్యవస్థలు ఉన్నాయని మరో సీనియర్ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారి తెలిపారు.

విద్యార్థుల సంఖ్యకనుగుణంగా టీచర్ల బదిలీలు

- గత తప్పిదాలకు తావులేకుండా చర్యలు
- బదిలీల్లో వెబ్‌ఆప్షన్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తికనుగుణంగా టీచర్లు లేరు. దాంతో తక్కువ మంది విదార్థులున్న చోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు, ఎక్కువ మంది విద్యార్థులున్న చోట తక్కువ మంది టీచర్లు ఉన్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా విద్యార్థులసంఖ్యకనుగునంగా ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. పాఠశాల విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచేలా విధివిధానాలు ఖరారు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి టీచర్ల బదిలీల్లో వెబ్ ఆప్షన్లను కేటాయించినట్టు సమాచారం.అదొక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. అక్కడ ఐదవ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుంది. విద్యా శాఖ లెక్క ప్రకారం అక్కడ ఐదుగురు ఉపాధ్యాయులుండాలి.

కాని క్లాసుల్లో విద్యార్థుల సంఖ్య సింగిల్ డిజిట్ మాత్రమే. అయినా విద్యా శాఖ ఇష్టా రీతిన ఉపాధ్యాయులను కేటాయించింది. దాంతో విద్యార్థులకు, టీచర్లకు మధ్య సమతూకం కొరవడింది. గత సర్కార్ హయాంలో రాష్ట్రంలోని అనేక స్కూళ్ల పరిస్థితి ఇది. రాష్ట్రంలో కొత్తగా రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఈ తప్పులకు తావు లేకుండా చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ తగు చర్యలు చేపట్టింది. సున్నా నుంచి 19 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒకరు, 20 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఇద్దరు, 61 నుంచి 90 మంది విద్యార్థులున్న పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా గత ప్రభుత్వం 2015, జూన్, 27న జీవో నెం: 17, 2021, ఆగస్టు 21న జీవో 25 జారీ చేసింది.

విద్యార్థుల సంఖ్య, వారికి మెరుగైన విద్యా బోధనను దష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కొన్ని మార్పులతో వెబ్ ఆప్షన్లను కేటాయించింది.1నుంచి10 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒకటి, 11 నుంచి 40 వరకు విద్యార్థులున్న పాఠశాలకు రెండు, 41 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు మూడు, 61పైన విద్యార్థులున్న పాఠశాలకు ఆ పాఠశాలకు మంజూరైన అన్ని పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతమున్న విద్యార్థులకన్నా ఎక్కువ మంది పాఠశాలలో చేరితే పెరిగిన సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయించనున్నారు. ఈ విధానం వల్ల విద్యార్థుల చదువు సాఫీగా సాగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

అసోంలో మార్క్‌షీట్ స్కామ్

- గౌహతి వర్శిటీలో కొందరు విద్యార్థుల మార్కుల పెంపు
- ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు సహా 10 మంది అరెస్టు

న్యూఢిల్లీ : నీట్ స్కామ్ మరువక ముందే అసోంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో మరో స్కాం వెలుగుచూసింది. గౌహతి యూనివర్శిటీలో విద్యార్థుల పరీక్ష పేపర్లలో మార్కులను మార్పు చేసి, ఎక్కువ మార్కులు నమోదు చేస్తూ.. పెద్దమొత్తంలో నగదు గుంజుతున్నారని వెల్లడైంది. ఒక పేపరులో మార్కులు పెంచడానికి రూ.16 వేలు, ఒక సెమిస్టర్‌లోని అన్ని పేపర్లలో మార్కులు మార్పు చేసేందుకు లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ స్కామ్‌లో ఇప్పటివరకూ ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు సహా 10 మందిని అరెస్టు చేసినట్టు సీఐడీ, అసోం పోలీసులు ఆదివారం తెలిపారు.

పోలీసులు, విద్యార్థుల కథనం ప్రకారం... గౌహతి యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న గణేష్ లాల్ చౌదరి కాలేజీకి చెందిన విద్యార్థి మార్క్‌షీట్‌లో తేడాపై విచారణతో ఈ స్కామ్ బయటపడింది. విద్యార్థి అజీజుల్ హక్ మార్క్‌షీటుపై కాలేజీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యార్థి వాస్తవంగా పొందిన మార్కుల కన్నా మార్క్‌షీట్‌లో ఎక్కువ మార్కులు ఉన్నట్టు నిర్ధారణ అయినట్టు పేర్కొంది. విచారణలో .. విద్యార్థి మొదటి, మూడు, నాలుగు, ఐదవ సెమిస్టర్‌లలో మార్కుల మార్పునకు రూ.10,000 చెల్లించినట్లు అంగీకరించాడు. డిజిటల్ ట్యాంపరింగ్‌తో కొంతమంది ఈ స్కామ్‌కి పాల్పడుతున్నారని తేలింది. ఈ విషయం వెలుగుచూడటంతో సీఐడీకి దర్యాప్తును అప్పగించారు. యూనివర్సిటీలోని వివిధ విభాగాలకు చెందిన కొందరు ఉద్యోగులు ఈ మోసాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు తెలిపారు. యూనివర్సిటీలో ఏజెంట్లను పెట్టారని, వారు విద్యార్థులతో మాట్లాడతారని, ఎక్కువ మార్కులకు ఎక్కువ ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారని చెప్పారు. బార్‌పేటలో ఆరు కేసులు వెలుగు చూశాయని, అదే ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి ప్రధాన నిందితుడిని, అతనిని అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. గౌహతి విశ్వవిద్యాలయం ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐయుఎంఎస్)ని థర్డ్‌పార్టీకి ఆపరేటర్‌కి అవుట్ సోర్స్ కింద ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐటీఐ లిమిటెడ్ అనేది డేటా ఎంట్రీ బాధ్యత వహించే కేంద్ర ప్రభుత్వ సంస్థ అని, ట్యాంపరింగ్ జరిగినట్టు ఆ వర్గాలు తెలిపాయి. తాజాగా అరెస్టు చేసిన పదో నిందితుడు అడ్వకేట్ అని, అతనిని ఇంటరాగేట్ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. బార్‌పేట, ధుబ్రి, కమ్‌రూప్ (మెట్రో), నాగావ్ జిల్లాల నుంచి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ స్కామ్‌లో మార్కులను కంప్యూటరైజ్ చేసే సెక్షన్‌కు చెందిన క్రిషన్ కృష్ణమూర్తి ప్రధాన నిందితుడని, అతనిని ఇప్పటికే అరెస్టు చేశామని చెప్పారు. అతనితోపాటు అజీజుల్ హక్, ఇస్మాయిల్ హుస్సేన్, అలంగీర్ ఖాన్, మొయినుల్ హక్, హమీజుద్దీన్, అబుల్ బాసర్, అమీనుల్ ఇస్లాం, శివతోష్ మహతోను అరెస్ట్ చేశామని చెప్పారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, అరెస్టుల సంఖ్య పెరిగే అవకాశముందని సీఐడీ అధికారులు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐయుఎంఎస్)కు చెందిన ఓ ఉద్యోగి ఈ స్కామ్‌కు సూత్రధారి అని గౌహతి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రతాప్ జ్యోతి హందిక్ తెలిపారు.

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌కు కన్నీటి వీడ్కోలు



నవతెలంగాణ-ఉట్నూర్

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు. భౌతికంగా తమతో లేకపోయినా గొప్ప నాయకుడిగా తమ హృదయాల్లో ఎల్లప్పుడూ ఉంటారని ఈ సందర్భంగా పలువురు తెలిపారు. జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ గోడం నగేష్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఇతర రాజకీయ ప్రముఖులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్ నివాసం నుంచి ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని తమ వ్యవసాయ క్షేత్రం వరకు అంతిమయాత్రను నిర్వహించి, అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడారు. రాథోడ్ రమేష్ లేరన్న వార్త జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఒక గొప్ప నాయకుణ్ని కోల్పోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు పదవుల్లో జిల్లాకు చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని నలుములల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీగా అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాయల శంకర్, జోగు రామన్న, మాజీ ఎంపీ సోయం బాపురావు, రాథోడ్ బాపు రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ నరేష్, ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్, శ్రీరామ్ జాదవ్, జాదవ్ గోపాల్‌రావు, నారాయణ్, ఈశ్వరి బాయి, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టూరిజం కార్పొరేషన్ ఉద్యోగుల మెడపై కత్తి

- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేధింపులు
- చీటికిమాటికీ సస్పెన్షన్లు, మెమోలు
- రోడ్డున పడ్డ 30 మంది ఉద్యోగులు
- కోర్టు ఉత్తర్వులు సైతం బేఖాతరు
- ఏండ్ల తరబడి కుర్చీ వదలని హెచ్ఓడీలు
- పీకల్లోతు అవినీతిలో కార్పొరేషన్
- కొత్త సర్కార్‌పై ఉద్యోగుల ఆశలు

TELANGANA STATE TOURISM DEVELOPMENT CORPORATION LTD. TSTDC

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌టీడీసీ)లో పని చేస్తున్న ఉద్యోగుల మెడపై కత్తి పెట్టి ఉంటారా? పోతారా? అంటూ యాజమాన్యం నిత్యం వేధింపులకు గురి చేస్తున్నది. గత సర్కార్ హయాంలో పని చేసిన ఎండీ అవినీతి, అక్రమాలకు వత్తాసు పలకలేదని 30 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వారందరినీ తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు ఏండ్లు గడిచినా అమలుకు నోచుకోవడం లేదు. ఇరవై ఏండ్లుగా ఒకే చోట తిష్ట వేసిన హెచ్‌వోడీలు, ఉన్నతాధికారులు చేస్తున్న అవినీతి అక్రమాలకు కింది స్థాయి ఉద్యోగులు బలౌతున్నారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

టీఎస్‌టీడీసీలో మొత్తం 800 మందికిపైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. అందులో 80 మంది రెగ్యులర్, 170 మంది కాంట్రాక్ట్, 300 మంది ఔట్ సోర్సింగ్, 100 మంది డైలీ వేజ్, 100 మంది కన్సల్టెంట్ , 70 మంది ట్రైనీ సిబ్బంది తమ విధులను నిర్వహిస్తున్నారు. టూరిజం హోటళ్ల లీజు, పర్యాటక ప్రాంతాల్లో చేపట్టిన పనుల కాంట్రాక్టులు, ఇష్టారాజ్యంగా నిధుల ఖర్చు తదితర ఆరోపణలు గత సర్కార్ హయాంలో పని చేసిన ఎమ్‌డీ మనోహర్‌పై వెల్లువెత్తాయి. ఇందుకు సంబంధించి హైకోర్టు పలుమార్లు మొట్టికాయలు వేసిన సందర్భాలు న్నాయి. సంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు వత్తాసు పలకడం లేదనే నెపంతో దాదాపు 30 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆయన సస్పెండ్ చేశారు. అదే క్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా అధికార పార్టీకి మేలు చేస్తున్నారనే కారణంతో 2023 డిసెంబర్‌లో మనోహర్‌ను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. పాత ఎమ్‌డీ అసాధారణ నిర్ణయం వల్ల ఉద్యోగాలు కోల్పోయిన 30 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వీరిని తిరిగి ఉద్యోగంలోకి వెంటనే తీసుకోవాలని తెలంగాణ హైకోర్ట్ ఉత్తర్వులు ఇచ్చినా వాటిని అమలు చేయకుండా యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. వీరిని ఉద్యోగంలోకి తీసుకుంటే తమ తప్పులు ఎక్కడ బయట పడుతాయేమోననే భయంతో కొంతమంది ఉద్యోగులు అడ్డుపడుతున్నారని ఆరోపణలున్నాయి.

పాత ఎమ్‌డీపై అటకెక్కిన విచారణ

పాత ఎమ్‌డీ మనోహర్ అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వ అధికారం చేపట్టిన తర్వాత అంతర్గత విచారణ చేపట్టింది. టూరిజం హోటళ్ల లీజు, పర్యాటక ప్రాంతాల్లో చేపట్టిన పనుల కాంట్రాక్టులు, ఇష్టారాజ్యంగా నిధుల ఖర్చు తదితర ఆరోపణలు అతనిపై వెల్లువెత్తాయి. ఇందుకు సంబంధించి కోట్లాది రూపాయల చేతులు మారాయనే ఆరోపణలున్నాయి. కొంతమంది అగ్రనేతల జోక్యంతో అతనిపై చేపట్టిన విచారణ మధ్యలోనే ఆగిపోయిందనే విమర్శలున్నాయి.

24 ఏండ్లుగా రెగ్యులర్‌కు నోచుకోని ఉద్యోగులు

మార్చి 2000 సంవత్సరంలో సంస్థలో పనిచేసిన డైలీవేజ్ ఉద్యోగులను రెగ్యులర్ చేశారు. ఆ తర్వాత 24 ఏండ్లుగా ఎవరినీ పర్మినెంట్ చేయలేదు. ఏండ్లు గడుస్తున్నా తమను క్రమబద్ధీకరించకపోవడం కార్మిక చట్టాలకు వ్యతిరేకమంటూ ఉద్యోగులు పలుమార్లు నిరసనలు, ఆందోళనలు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదు. దాంతో ఉద్యోగులు కోర్టు తలుపు తట్టారు. 2010లో అప్పటి ఉమ్మడి హైకోర్టు (కేసు నెంబర్ 24/98) కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. 2014లో తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సంస్థ కూడా రెండుగా విడిపోయింది. ఇక్కడ పని చేసిన ఉద్యోగులందరినీ ఇక్కడ ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు కేటాయించారు. స్వరాష్ట్రంలోనైనా కోర్టు ఉత్తర్వులను అమలు చేసి తమకు న్యాయం చేస్తారని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఎనిమిదేండ్లు గడిచినా సర్కార్‌లో చలనం లేకపోవడంతో తిరిగి 2019లో (కేసు నెంబర్ 19927 /19)) కోర్టును ఆశ్రయించారు. సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని మరోసారి కోర్టు తీర్పు చెప్పింది. నాలుగేండ్లు గడిచిన తర్వాత సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ 2023లో యాజమాన్యం కోర్టుకెళ్లింది. (కేసు నెంబర్ 488 /23) లో కార్పొరేషన్ అప్పీల్‌ను విచారించిన ద్విసభ్య ధర్మాసం వీరికి అవసరమైన పోస్టులు లేకుంటే వెంటనే ఏర్పాటు చేసి వారిని పర్మినెంట్ చేయాలని కార్పొరేషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తీర్పు వెలువడి ఏడాది గడుస్తున్నా యాజమాన్యం గాని, సర్కార్‌గాని ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొత్తగా రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు న్యాయం చేస్తారని సిబ్బంది గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

'తిరుపతమ్మ'ను దర్శించుకున్న డిప్యూటీ సీఎం



నవతెలంగాణ-మధిర

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. జనసేన నాయకులు లగడపాటి శంకర్ డిప్యూటీ సీఎంను అమ్మ వారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం పెనుగంచిప్రోలులో ఎస్.నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మధిర ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ చక్కని పరిష్కారం



మారుతున్న జీవనశైలి మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా మానసికంగా మనల్ని కుంగదీస్తుంది. పరిస్థితులకు అనుగుణంగా మనం సరైన వైద్యం చేయించుకుంటే, డాక్టర్లు సరైన వైద్యం అందిస్తే నిండు నూరేళ్లు అరోగ్యంగా ఉండొచ్చంటున్నారు ప్రముఖ హోలిస్టిక్ హెల్త్ ఫిజీషియన్ డా.ప్రత్యుష నేరెళ్ల తన తల్లి ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యలే ఆమెను ఇలా ఆలోచింపజేశాయి. ఈ రోజు డాక్టర్స్ డే సందర్భంగా ఆమె ఇస్తున్న సలహాలు, సూచనలు మానవి పాఠకులకు ప్రత్యేకం...






మా సొంతూరు నెల్లూరు. స్కూలింగ్, ఇంటర్ అక్కడే చదివాను. చిన్నప్పటి నుండి డాక్టర్ కావాలని కలలు కన్నాను. కర్నూల్ గవర్నమెంట్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. నారాయణ మెడికల్ కాలేజీలో ఎం.డి చేశాను. సాధారణంగా ఎం.డి తర్వాత అందరూ సూపర్ స్పెషలిటీ వైపు వెళతారు. కాని నేను మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించాను. ఎందుకంటే మా అమ్మకు మానసిక సమస్య ఉండేది. వాటి కోసం వాడిన మందుల వల్ల షుగర్ కూడా వచ్చింది. షుగర్ కోసం డైట్ కంట్రోల్ చేయాలన్నప్పుడు అదంతా భరించలేక అమ్మలో ఇంకాస్త చిరాకు, కోపం, ఆందోళన పెరిగేది. దాంతో సైకాలజీకి సంబంధించిన మందుల డోస్ పెంచాల్సి వచ్చేది. దీని వల్ల సమస్య మరింత పెరిగిపోయింది. సమస్యకు అసలు కారణం తెలుసుకోకుంటే పరిష్కారం దొరకు. అందుకు నేను ఎం.డి తర్వాత న్యూట్రీషియన్, లైఫ్‌స్టైల్, డయాబెటిస్, సైకాలజీ, ప్రానిక్ హీలింగ్ ఇలా వీటన్నింటిపై అవగాహన పెంచుకోవాలని నిర్ణయించుకున్నాను. అప్పుడు అన్ని రకాల సమస్యలకు చక్కని మార్గాన్ని చూపింగలనని అనిపించింది.



మల్టిబుల్ సమస్యలైతే...

వాస్తవానికి గతంలో మన దగ్గర వైద్యం చేయించుకునే పద్ధతి ఒకటుండేది. ఏదైనా సమస్య వస్తే ముందు జనరల్ ఫిజీషియన్ దగ్గరకు వెళ్లేవాళ్లు. తర్వాత అవసరాన్ని బట్టి వాళ్లే స్పెషలిస్ట్ దగ్గరకు ట్రీట్‌మెంట్ కోసం పంపేవారు. కానీ ఇప్పుడు ఈ పద్ధతిలో మార్పు వచ్చింది. శరీంలో ఏ భాగానికి సమస్య వస్తే ఆ స్పెషలిస్ట్ దగ్గరకు పరిగెడుతున్నాం. ఒకే సమస్య వస్తే అలా వెళ్ళినా ఇబ్బంది ఏమీ ఉండదు. కానీ మనలో మల్టిబుల్ సమస్యలు వచ్చినప్పుడు మాత్రం కచ్చితంగా ముందు జనరల్ ఫిజీషియన్ దగ్గరకు వెళ్ళడమే మంచిది. వాళ్లు అన్ని విధాలుగా ఆలోచించి చక్కని సూచనలిస్తారు. దీనివల్ల సమస్యకు సరైన పరిష్కారం దొరుకుతుంది.

మెదడు కూడా ఉంటుంది

శరీరంలో చాలా సమస్యలకు ముఖ్య కారణం మానసిక ఆందోళన. దీన్ని ముందు కంట్రోల్ చేయగలిగే శరీరంలోని సమస్యను కచ్చితంగా పరిష్కరించుకోవచ్చు. ఎందుకంటే మానవ శరీరంలో కేవలం శరీర భాగాలు మాత్రమే ఉండవు. అన్నింటికీ స్పందించే మెదడు కూడా ఉంటుంది. దీన్ని చాలా మంది మర్చిపోతున్నారు. మా అమ్మ విషయంలో నేను ఈ సమస్యను చూశాను. వాస్తవానికి ఓ జనరల్ ఫిజీషియన్, ఓ సైకాలజిస్ట్, ఓ న్యూట్రీషియన్ కలిసి వర్క్ చేసినప్పుడు పేషంట్ సమస్యను త్వరగా పరిష్కరించవచ్చు. ఇందంతా దృష్టిలో పెట్టుకొనే నేను మల్టిబుల్ ఇంటిగ్రేటెడ్ ప్రాక్టీస్ చేస్తున్నాను.

సమస్య మూలల్లోకి వెళ్లి

మల్టిబుల్ ఇంటిగ్రేటెడ్ పద్ధతిలో మేము పేషంట్ వచ్చినప్పుడు సమస్య మూలాల్లోకి వెళతాం. ముందుగా క్లీనికల్ ఎగ్జామినేషన్, హిస్టరీ, బ్లడ్ వర్క్ అప్ చేయడం, సస్యలను గుర్తించడం, డైట్ చెప్పడం, సైకాలజిస్ట్ సమస్య ఏదైనా ఉంది అనిపిస్తే కౌన్సెలింగ్ చేస్తాము. మా దగ్గరకు వచ్చే వారిలో ఎక్కువగా చాలా రోజుల నుండి మందులు వాడుతున్నా సమస్య పరిష్కారం కాని వారు, రిపోర్ట్స్ అన్నీ నార్మల్‌గా ఉన్నా శరీరంలో ఏదో ఒక బాధ ఉన్న వారు ఉంటారు. అలాంటి వారికి అవసరమైన ట్రీట్‌మెంట్ చేస్తాం. ఇంటిగ్రేటెడ్ అప్రోచ్‌లో అన్ని రకాల సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తుంటాం. తర్వాత కాలంలో వాళ్ల మందులు ఆపేసి ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారు. మెడిసన్ వాడినా పరిష్కారం రాని వారికి అదే మెడిసెన్‌తో పరిష్కారం వచ్చేలా చేస్తాం. అంటే ఈ అప్రోచ్‌లో మేము వాళ్లలో పాజిటివ్ ధోరణిని అభివృద్ధి చేస్తాం. అందుకే మంచి ఫలితాలు వస్తున్నాయి.

ప్రభుత్వం బాధ్యత తీసుకుంటే...

ఇంటి గ్రేటెడ్ అప్రోచ్ మన దేశంలో ఇప్పుడిప్పుడే మొదలయ్యింది. భవిష్యత్‌లో ఇది మరింత విస్తృతం కావాలి. ఈ పద్ధతి విదేశాల్లో ఎప్పటి నుండో కొనసాగుతుంది. అక్కడ ఏదైనా సమస్య వస్తే ముందు కచ్చితంగా జనరల్ ఫిజీషియన్‌ను కలవాలి. లేదంటే స్పెషలిస్ట్ ట్రీట్‌మెంట్ చేయరు. మన దగ్గరకు కూడా ఇలా చేస్తే ప్రజలకు చాలా ఉపయోగం. ఇది ప్రభుత్వం మాత్రమే చేయగలుగుతుంది. ఎంబీబీఎస్ చదివేటప్పుడే స్టూడెంట్‌కి ఇవన్నీ నేర్పించాలి. వైద్యం అంటే కేవలం శరీరభాగాలకు మాత్రమే కాదు రోగి మానసిక పరిస్థితిని కూడా అర్థం చేసుకొని చికిత్స చేయాలి. అవసరమైన కౌన్సెలింగ్ ఇవ్వాలి. దీని గురించి ప్రభుత్వం మరింత బాధ్యత తీసుకుంటే ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఇవన్నీ స్కూల్ పిల్లల పాఠ్యాంశాల్లో కూడా భాగమైతే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది.

కమ్యూనికేషన్ చాలా ముఖ్యం

ఒక పేషంట్ మా దగ్గరకు వచ్చినప్పుడు వాళ్ళకు ఏం అవసరమో అది చెప్పడం మా ముఖ్య ఉద్దేశం. మారుతున్న జీవనశైలి వల్ల ప్రతి ఒక్కరికీ ఆందోళన, నిద్రలేమి ఉంటుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వీటికి ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ వల్ల సరైన పరిష్కారం దొరుకుతుంది. లైఫ్‌స్టైల్ డిసీసెస్‌కి డైట్ ఫాలో అవ్వాలి అని అందరికీ తెలుసు. ఎందుకు కచ్చితంగా ఫాలో అవ్వాలి అనేది ఈ కౌన్సెలింగ్‌లో ఇస్తాం. అప్పుడే వాళ్ల పాటిస్తారు. సమస్య పరిష్కారమవుతుంది.

కారణం మానసిక సమస్యలే

చిన్నప్పటి నుండి అందరూ నాలో సైకాలజిస్ట్ అయ్యే లక్షణాలు బాగా ఉన్నాయి అనేవారు. ఆ మాటలు కూడా నాలో ఆసక్తిని పెంచాయి. నా అధ్యయనంలో తేలిన విషయం ఏమిటంటే నేటి బిజీ జీవితంలో మనకు వచ్చే ఎన్నో జబ్బులకు ముఖ్య కారణం మానసిక సమస్యలే. ఏదైనా ఒక దానిపైనే స్పెషలైజేషన్ చేస్తే శరీరంలో ఒక్క భాగం గురించి మాత్రమే అవగాహన ఉంటుంది. అదే జనరల్ ఫిజీషియన్ అయితే శరీరం మొత్తంపై పూర్తి స్థాయి అవగాహన ఉంటుంది. దాని వల్ల సమస్యకు కారణం ఏంటీ అనేది రకరకాల యాంగిల్స్‌లో ఆలోచించవచ్చు. ఇలా కేవలం జనరల్ ఫిజీషియన్ మాత్రమే ఆలోచించగలరు. అసలు కారణం తెలుసుకొని సంబంధింత స్పెషలిస్ట్ వద్దకు రిఫర్ చేస్తారు.

మహిళలకు సూచన...

మహిళల ఆరోగ్యానియకి ముఖ్యమైన సూచన ఏమిటంటే సాధారణంగా మహిళలకు బాధ, జాలి, దయ, సంతోషంగా ఇలా అన్నీ ఎక్కువే. ఇలా ఉంటేనే పిల్లల్ని ఆరోగ్యంగా పెంచగలుగుతారు. ఈ లక్షణాలే ఆమెలోని బలాలు. అయితే ఈ ఫీలింగ్స్ వల్ల మహిళలు ప్రతి విషయంలో చాలా త్వరగా స్పందిస్తుంటారు. దీని వల్ల చాలా మంది ఆమె ఊరికే ఏడుస్తుంది, చిరాకు పడుతుంది, బాధపడుతుంది అంటుంటారు. ఆమెకు ఆ ఫీలింగ్స్ ఉన్నాయి కాబట్టే కుటుంబాన్ని చక్కగా చూసుకోగలుగుతుంది అనేది అందరూ అర్థం చేసుకోవాలి. ఆమెను ఆమెగా స్వీకరించాలి. అప్పుడు మహిళలు ఆరోగ్యంగా, ధైర్యంగా ఉండగలుగుతారు. ఆమె ఏదైనా విషయం చెప్తుంటే ప్రశాంతంగా కూర్చొని వినాలి. అప్పుడు సగం సమస్య పరిష్కారమవుతుంది. మహిళలు కూడా వారి భావోద్వేగాలను అర్థం చేసుకొని, నియంత్రించుకునే ప్రయత్నం చేయాలి. అవసరమైనప్పుడు ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకోవాలి. ఎమోషనల్‌గా, ఎకనామికల్‌గా ఇండిపెండెంట్ అయినపుడు మహిళలు పూర్తిగా వారి కాళ్ళపై వాళ్ల నిలబడగలుగుతారు.

\- సలీమ

డీఎస్‌కు అశ్రు నివాళి

(మొదటిపేజీ తరువాయి)

నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, రాకేష్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, నగర మేయర్ నీతూ కిరణ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్ బిన్ హమ్దాన్, అధికారులు, అనధికార ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు డీఎస్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీఐజీ సుధీర్ బాబు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఇతర ఉన్నతాధికారులు అంత్యక్రియల్లో పాల్గొని డీఎస్ భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. డీఎస్ కుమారులైన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, మాజీ మేయర్ డి.సంజయ్ తదితరులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పరామర్శించి సంతాపం తెలియజేశారు.

డీఎస్ మరణం తీరని లోటు :సీఎం రేవంత్ రెడ్డి

మాజీ మంత్రి డీఎస్ మరణం తీరని లోటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీఎస్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన అనంతరం సీఎం మాట్లాడారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన డీఎస్.. ఉమ్మడి రాష్ట్రంలో కీలక నేతగా కొనసాగారని గుర్తు చేశారు. విద్యార్థి నాయకుని స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి డీఎస్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటులోనూ ఆయన కీలకపాత్ర పోషించారని, ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన అందించిన సేవలను గుర్తించి ప్రభుత్వపరంగా అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు. డీఎస్ గౌరవం ఇనుమడించేలా, ఆయనను ప్రజలు, అభిమానులు ఎల్లవేళలా గుర్తుంచుకునేలా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డీఎస్ కుటుంబ సభ్యులను సచివాలయానికి పిలిపించుకుని, వారితో చర్చించిన మీదట డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. డీఎస్ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని అన్నారు.

నైజీరియాలో ఆత్మాహుతి దాడులు..

అబూజ : ఈశాన్య నైజీరియాలో బోర్నో రాష్ట్రంలో ఆత్మాహుతి దాడులు చోటు చేసుకున్నాయి. మూడు చోట్ల జరిగిన ఈ దాడుల్లో 18 మంది మృతి చెందారు. మరో 48 మంది గాయపడ్డారు. ఈ ఘటనలు శనివారం మధ్యాహ్నం జరిగినట్టు అక్కడి మీడియా వెల్లడించింది. అయితే ఈ దాడులు వివాహ వేడుకల్లో, గ్వోజా పట్టణంలోని ఓ ఆస్పత్రిలో , పెండ్లిలో మరణించిన వారి అంత్యక్రియల్లో జరిగినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో మహిళలు, గర్భిణులు, చిన్నారులు ఉన్నారు. ఈ ఆత్మాహుతి దాడుల నేపథ్యంలో బోర్నో స్టేట్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ బార్కిండో ముహమ్మద్ సైదు గ్వోజా టౌన్‌లోని ఘటనా స్థలాన్ని సందర్శించారు. అయితే ఈ దాడులకు వెనుక ఎవరు ఉన్నారు. ఉగ్రవాదులే ఈ చర్యలకు పాల్పడ్డారా లేదా ఎవరైనా స్థానికులే ఈ పనిచేశారా అనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనల నేపథ్యంలో అప్రమత్తమైన అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దశాబ్దకాలంగా..

బోర్నో రాష్ట్రం దశాబ్ద కాలంగా ఇస్లామిస్ట్ తిరుగుబాటుకు కేంద్రంగా ఉంది. కొన్నేళ్లుగా జరుగుతున్న హింసాకాండలో దాదాపు 40 వేల మందికి పైగా మరణించారు. 20 లక్షల మంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. ఇక్కడ తరచూ బోకో హరామ్, దాని అనుబంధ ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రియా ప్రావిన్స్ అనే ఉగ్రసంస్థలు దాడులకు పాల్పడుతూనే ఉంటాయి. తాజా ఘటనలకు బాధ్యత వహిస్తూ మాత్రం ఇప్పటి వరకు అవి ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. 2014లో గ్వోజాను బోకో హరామ్ తమ ఆధీనంలోకి తీసుకుంది. కానీ, ఛాద్ సైన్యం మద్దతుతో నైజీరియా తిరిగి దాన్ని స్వాధీనం చేసుకుంది.

అమ్మ పేరుతో ఓ మొక్క

(మొదటిపేజీ తరువాయి)

చూసిన నేను గర్వపడుతున్నాను అంటూ చెప్పుకొచ్చారు. అలాగే టోక్యో ఒలింపిక్స్ గురించి ప్రధాని ప్రస్థావిస్తూ టోక్యో ఒలింపిక్స్‌లో మన ఆటగాళ్ల ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుందన్నారు. ఈ ఒలింపిక్స్ నుంచి మన ఆటగాళ్లు పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్నారన్నారు. ఆటగాళ్లందరినీ కలుపుకుంటే, దాదాపు 900 మంది అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటున్నారన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రత్యేక రకమైన గొడుగుల గురించి ప్రస్తావించారు. కేరళ సంస్కృతిలో గొడుగులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అక్కడ అనేక సంప్రదాయాలు, ఆచారాలలో గొడుగులు ఒక ముఖ్య భాగమని తెలిపారు. కేరళలోని అట్టప్పాడిలో తయారయ్యే 'కర్తుంబి గొడుగులు' గురించి, ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతా రామరాజు జిల్లాలో అరకు కాఫీ రుచి, సువాసనకు ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. స్థానిక ఉత్పత్తులు ప్రజాదరణ పొందాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు చెందిన ఎన్నో ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. జూన్ 30 చాలా ముఖ్యమైన రోజని మోడీ అన్నారు. మన గిరిజన సోదరులు, సోదరీమణులు ఈ రోజును 'హల్ డే'గా జరుపుకుంటారు. ఈ రోజు విదేశీ పాలకుల దురాగతాలను తీవ్రంగా వ్యతిరేకించిన వీరుడు సిద్ధో-కన్హు అద్భుతమైన ధైర్యానికి ముడిపడి ఉందన్నారు. వేలాది మంది సంతాలీ సహచరులను ఏకం చేశారని, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. 1857లో భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి రెండేండ్ల ముందు అంటే 1855లో జరిగింది. జార్ఖండ్‌లోని సంతాల్ పరగణాలో మన గిరిజనులు విదేశీ పాలకులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టినట్లు మోడీ గుర్తు చేశారు.'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో పర్యావరణం, మొక్కలు నాటడంపై ప్రధాని నరేంద్ర మోడీ చర్చించారు. ప్రపంచంలో అత్యంత విలువైన సంబంధం ఏదంటే పర్యావరణమేనని అన్నారు . పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ తల్లి కోసం మొక్కలు నాటుతున్నారని తెలిపారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రచారం జరిగిందన్న మోడీ, ఈ ప్రచారం పేరు 'ఏక్ పేడ్ మా కే నామ్' అని అన్నారు. నా తల్లి పేరుతో నేను మొక్క నాటాను అంటూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఏడాది మే నెలలో తుర్క్‌మెనిస్థాన్‌లో జాతీయ కవి 300వ జయంతి వేడుకలు నిర్వహించామని మోడీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచంలోని 24 మంది ప్రముఖ కవుల విగ్రహాలను తుర్క్ మెనిస్థాన్ అధ్యక్షుడు ఆవిష్కరించారు. ఈ విగ్రహాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం ఉందని గుర్తు చేశారు. ఇది ఠాగూర్ పట్ల , భారతదేశం పట్ల మనకు ఉన్న గౌరవం అని తెలిపారు. 10వ యోగా దినోత్సవాన్ని ప్రపంచమంతా ఎంతో ఉత్సాహంగా, జరుపుకున్నామని అన్నారు.

గృహజ్యోతి కోసం..

లక్షలాది మంది ఎదురుచూపు

రాష్ట్రవ్యాప్తంగా 1.05కోట్ల మందికి
అర్హత ఉన్నా.. 34.59 లక్షల
మందికి మాత్రమే లబ్ది
రేషన్‌కార్డు లేదని అర్హత పొందని వైనం
కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అమల్లో అర్హులు సైతం లబ్దిపొందలేకపోతున్నారు. గృహజ్యోతి పథకానికి విధిగా రేషన్‌కార్డు ఉండాలనే నిబంధన పేదలకు పెద్ద ఆటంకంగా మారింది. ఎన్నో ఏండ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయలేదు. దాంతో చాలా మంది ఆరు గ్యారంటీ పథకాల్లో లబ్దిదారులు కాలేకపోతున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తున్నప్పటికీ ప్రజా పాలన దరఖాస్తుల్లో రేషన్‌కార్డు నెంబర్ ఎంటర్ చేయలేదన్న నెపంతో వాళ్లందర్నీ అనర్హులుగా పక్కన పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు జారీ చేసి అర్హులందరికీ ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ నిత్యం ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు.

గృహజ్యోతి పథకం కింద.. 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తూ రేషన్‌కార్డు కలిగిన వాళ్లందరికీ జీరో బిల్లు ఇస్తూ ఉచిత విద్యుత్‌ను రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేస్తున్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తుల్ని స్వీకరించిన ప్రభుత్వం వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. దరఖాస్తుదారులు విద్యుత్ సర్వీస్ నెంబర్, తెల్లరేషన్‌కార్డు నెంబర్ నమోదు చేయాల్సి ఉంది. అలా నమోదు చేయని దరఖాస్తుల్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో రేషన్‌కార్డు నెంబర్‌లేకపోవడంతో అర్హులుగా గుర్తించలేదు. విద్యుత్ అధికారుల లెక్కల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారుల సంఖ్య 1.05 కోట్లు. వీరిలో ఎంతమందికి రేషన్‌కార్డులు ఉన్నాయో తెలియని పరిస్థితి. దాంతో ఇందులో సగం మందికి కూడా జీరో బిల్లు వస్తుందా.. లేదా అనే అనుమానాలు మొదలయ్యాయి.

34.59 లక్షల మందికి మాత్రమే లబ్ది

గృహజ్యోతి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 34,59,585 మంది వినియోగదారులు లబ్ది పొందుతున్నారు. వారి బిల్లుల కోసం రాష్ట్రప్రభుత్వం సుమారు రూ.125 కోట్లు డిస్కంలకు విడుదల చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ఉచిత గృహలక్ష్మి పథకం కింద లబ్దిపొందేందుకు ప్రజాపాలన కార్యక్రమంలో 1,09,01,255 దరఖాస్తులు వచ్చాయి. వాటిల్లో 64,57,891 దరఖాస్తులు ఆధార్‌తో అనుసంధానమై తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉన్నట్టు నిర్ధారించారు. అందులో 34,59,585 మంది దరఖాస్తుదారులకు గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టు గుర్తించారు. వీరికి మాత్రమే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు జీరో బిల్లు ఇస్తున్నారు. జీరో బిల్లు వస్తున్న వాళ్లందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,71,456 మంది వినియోగదారులు లబ్దిపొందుతున్నారు. జూన్ నెలలో జీరో బిల్లు వచ్చిన లబ్దిదారుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి

విస్తారంగా వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

నమోదైంది. ప్రస్తుత వర్షాకాలంలో ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 38,606 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. జొన్నలు 19,870 ఎకరాలు, సజ్జలు 124 ఎకరాలు, మొక్కజొన్న 35,808 ఎకరాల్లో వేశారు. ఈ వారంలో కురిసే వర్షాలపైనే ఆయా పంటల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని వ్యవసాయరంగ నిపుణులు చెప్తున్నారు. వర్షాలు సాధారణంగా కురిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది.

అంగన్‌వాడీలను ఇంటికి పంపొద్దు

సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి జులైలో ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ లేఖ రాశారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు చెల్లించి వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ ఉద్యోగుల స్థితిగతులు, 24 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు, ఉద్యోగ విమరణ ప్రయోజనాల విషయాలపై మంత్రి, ఐసీడీఎస్ అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లామని తెలిపారు. వాటిని పట్టించుకోకపోగా అంగన్‌వాడీలు వ్యతిరేకించిన జీవో నెంబర్ 10ని అమలు చేయాలని చూడటం దారుణమని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా జూన్ 7 న ఐసీడీఎస్ డైరెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించామని గుర్తుచేశారు. మంత్రి సీతక్క, ఐసీడీఎస్ డైరెక్టర్ న్యాయం చేస్తామని హామీనిచ్చారని తెలిపారు. ఇప్పుడు అతి తక్కువ డబ్బులు చెల్లించి ఇంటికి పంపించాలని నిర్ణయించడం మోసం చేయటమేనని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు న్యాయం చేకూరేలా కొత్త జీవోలను విడుదల చేయాలని కోరారు.

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణకు ...

(మొదటిపేజీ తరువాయి)

విధానాలను రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ సంస్థ ప్రజల ఆస్తి. దీన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్తున్నారు. హైదరాబాద్ పాతబస్తీలో 45 శాతమే కరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయనీ, అందుకే ప్రయివేటు వ్యక్తులకు ఇస్తున్నామని సీఎం చెప్తున్నారనీ, రాష్ట్రం మొత్తంలో 95 నుంచి 97 శాతంకరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం పాతబస్తీ ప్రజల్ని అవమానించడమేనని అన్నారు. సింగరేణి బొగ్గు గనులను వేలం వేస్తుంటే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ కార్యక్రమంలో పాల్గొన్నారనీ, శ్రావణపల్లి బొగ్గు గనిని వేలం నుంచి ఎందుకు తీసివేయించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదని గుర్తు చేశారు. విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలన్నారు. తెలిపాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో నిరుద్యోగుల తరుపున ప్రభుత్వాన్ని నిలదీస్తాం

రాహుల్ గాంధీ హామీ ఏమైంది..?

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవతెలంగాణ-బేగంపేట్

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అసెంబ్లీని స్తంభింపచేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులతో చర్చలు జరపాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో నిరుద్యోగ సమస్యలపై దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌ను ఆయన పరామర్శించారు. దీక్ష విరమించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి మోతీలాల్ నాయక్‌తో మాట్లాడాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే దాకా నిరుద్యోగులు తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. మోతీలాల్‌ను దీక్ష విరమించాలని కోరగా.. ఇది తన ఒక్కడి పోరాటం కాదని, రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్నానని, ప్రభుత్వం దిగివచ్చేదాకా దీక్ష విరమించబోనని చెప్పారని తెలిపారు. మోతీలాల్‌కు ఏం జరగకముందే ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. పిల్లల హక్కుల పట్ల ప్రొ॥కోదండరాం పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. మోతీలాల్ నాయక్ ఏడు రోజుల నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ చూపెట్టి నిరుద్యోగులను వాడుకొని వదిలిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ది ఓడదాటే దాకా ఓడ మల్లన్న ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్నలా వ్యవహారం ఉందన్నారు. ఆనాడు నిరుద్యోగుల కోసం ప్రొఫెసర్ కోదండరాం, రియాజ్, బాల్మూరి వెంకట్, మురళి, రేవంత్ రెడ్డి అశోక్ నగర్‌లో కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగారని, రాహుల్ గాంధీని అశోక్ నగర్‌కు తీసుకువచ్చి ప్రమాణాలు చేయించారన్నారు. అయితే మీకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయి కానీ నిరుద్యోగులకు రాలేదన్నారు. ఇప్పుడు ఎందుకు మీ గొంతులు మూగబోయాయని ప్రశ్నించారు.

రాహుల్ గాంధీ రెండు లక్షల ఉద్యోగాలు ఏడాదిలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని.. ఏడు నెలలైనా ఎందుకు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వలేదని నిలదీశారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు ఆంధ్రప్రదేశ్‌లో 1:100 పిలుస్తున్నప్పుడు ఇక్కడ ఎందుకు సాధ్యంకాదని ప్రశ్నించారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే పోరాటాలు చేస్తుంటే ఎందుకు రాహుల్ గాంధీ పట్టించుకోరో చెప్పాలన్నారు. గ్రూప్-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. జీవో 46 రద్దు చేస్తామని ఎందుకు చేయడం లేదని, మెగా డీఎస్సీ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. ప్రొఫెసర్ కోదండరాం ఇదే నిరుద్యోగులను రెచ్చగొట్టారని.. ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. నిరుద్యోగులు యువకులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఇదేనా ప్రజాపాలన అని నిలదీశారు. నిరుద్యోగుల డిమాండ్‌లను పరిష్కరించకుంటే నిరుద్యోగుల తరపున మరో పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు.



అయోధ్యలో నీట మునిగిన రోడ్డు

- వీధులు జలమయం
- ఆరుగురు అధికారులపై వేటు
- ఉన్నతస్థాయి విచారణకు ఫైజాబాద్ ఎంపీ డిమాండ్

లక్నో : వర్షాలకు యూపీలోని అయోధ్య అతలాకుతలమవుతున్నది. అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామపథ్‌లో నీళ్లు నిలిచాయి. అయోధ్యలో కొత్తగా 14 కిలోమీటర్ల పొడవైన రోడ్డుని నిర్మించారు. కాగా.. గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రామ్ పథ్ లోని 15 బైలేన్‌లు, వీధులు జలమయమయ్యాయి. రోడ్డు పక్కనున్న ఇండ్లు నీటిలో మునిగిపోయాయి. పలు ప్రాంతాల్లో రోడ్డు ధ్వంసమైంది. దీంతో, ఆరుగురు ప్రభుత్వ అధికారులను యూపీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారిపై వేటు వేసింది. ఈ వ్యహరంలో అహ్మదాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ భువన్ ఇన్‌ఫ్రాకామ్ ప్రయివేట్ లిమిటెడ్‌కు యూపీ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. రామ్‌పథ్ నిర్మించిన కొద్దిసేపటికే దెబ్బతిందని పీడబ్ల్యూడీ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. పనిలో అలసత్వం ప్రదర్శించి సామాన్య ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీశారని ఆరోపించింది. దీనిపై తదుపరి విచారణ జరుగుతున్నదని పీడబ్ల్యూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్ చౌహాన్ తెలిపారు.

ఉన్నతస్థాయి కమిటీ వేయాలి : ఫైజాబాద్ ఎంపీ

ఈ విషయంపై ఫైజాబాద్ ఎంపీ అవధేష్ ప్రసాద్ స్పందించారు. సమాజ్ వాదీ పార్టీ(ఎస్పీ) నాయకులతో కలిసి రామ్ పథ్, ప్రభుత్వాస్పత్రి సహా అయోధ్యలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రామ్ పథ్ నిర్మాణంలో అక్రమాలకు పాల్పడిన వారందరిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇది పెద్ద సమస్య అని.. రాముడి పేరుతో దోపిడీ జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో దీనిపై విచారణ జరపాలన్నారు. ఇటు సోషల్ మీడియాలోనూ ఈ అంశం వైరల్‌గా మారుతున్నది. నిర్మించిన కొన్ని నెలలకే రోడ్డు జరలమయం కావటం పట్ల ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


గుజరాత్‌లో పేపర్ లీకేజీల బాగోతం!

బీజేపీ మోడల్ రాష్ట్రంలో పలు ప్రశ్నాపత్రాలు లీక్

- లక్షలాది ఉద్యోగార్థుల ఆశలు ఆవిరి
- నిందితులకు బీజేపీతో సంబంధాలు

న్యూఢిల్లీ : పేపర్ లీకేజీల కారణంగా పరీక్షలు రద్దు కావడమే కాదు. లక్షలాది మంది అభ్యర్థుల ఆశలు కూడా ఆవిరవుతున్నాయి. గత ఐదు సంవత్సరాల కాలంలో పేపర్ లీకేజీలతో పదిహేను రాష్ట్రాలలో 41 నియామక పరీక్షలు రద్దయ్యాయి. ఫలితంగా సుమారు 1.4 కోట్ల మంది ఉద్యోగార్థులు తీవ్రమైన నిరాశానిస్పృహలకు గురయ్యారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ప్రధాని నరేంద్ర మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో, బీజేపీ ప్రభుత్వ ఏలుబడిలో అనేక ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి. పేపర్ లీకేజీ కుంభకోణం కారణంగా మోడీ సన్నిహితుడు, గుజరాత్ సెకండరీ సర్వీస్ సెలక్షన్ బోర్డు ఛైర్మన్ అశిత్ ఓరా తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ లీకేజీ బాగోతంలో ఓ ప్రింటింగ్ ప్రెస్ ప్రమేయం ఉన్నదని వార్తలు వచ్చాయి. ఈ ప్రెస్‌లోనే గతంలో మోడీ రాసిన ఓ పుస్తకాన్ని అచ్చు వేశారు.

ఉత్తరప్రదేశ్, బీహార్‌లోనే కాదు...బీజేపీ మోడల్ రాష్ట్రమైన గుజరాత్‌లోనూ పరిస్థితి దారుణంగా ఉంది. ఆ రాష్ట్రంలో జరిగిన ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో భారీ కుంభకోణాలే వెలుగు చూశాయి. నియామక పరీక్షల్లో పేపర్ లీకేజీలను అరికట్టేందుకు గత సంవత్సరం ఫిబ్రవరిలో గుజరాత్ ప్రభుత్వం శాసనసభలో ఓ బిల్లును ఆమోదించింది. రాష్ట్రంలో గడిచిన 11 సంవత్సరాల్లో 11 పేపర్ లీకేజీ కేసులు నమోదయ్యాయని, 201 మంది నిందితులపై కేసులు నమోదు చేశామని, 10 కేసుల్లో చార్జిషీట్లు కూడా దాఖలయ్యాయని బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా హోం మంత్రి చెప్పుకొచ్చారు. అయితే రాష్ట్రంలో పేపర్ లీకేజీ మూలాలు బాగా వేళ్లూనుకుపోయాయని, వాటికి బీజేపీ పాలనతో సంబంధం ఉన్నదని మాత్రం ఆయన చెప్పలేదు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన పరీక్షలన్నింటినీ గుజరాత్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (జీఎస్ఎస్ఎస్‌బీ) నిర్వహిస్తుంది. అనేక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను అహ్మదాబాద్‌లోని సూర్యా ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌లోనే ముద్రించారు. అక్కడి నుండే ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి.





ప్రశ్నాపత్రాన్ని అమ్ముకున్నారు

2021లో హెడ్ క్లర్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షకు సంబంధించిన పేపర్ లీక్ అయింది. ఈ ఉదంతం ప్రభుత్వాన్ని కుదిపేయడంతో ఓరా తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరీక్షకు 88 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు ముందే ప్రశ్నాపత్రాన్ని లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపణలు రావడంతో చివరికి పరీక్షను రద్దు చేశారు. ఈ కేసులో గుజరాత్ పోలీసులు 14 వేల పేజీల చార్జిషీటును దాఖలు చేశారు. ఈ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తూనే ఉంది. సూర్య ప్రెస్‌లోనే పేపర్ లీక్ అయిందని పోలీసులు గుర్తించారు.

అవినీతిపరుడికి అందలం

2004-05లోనే సూర్య ప్రింటింగ్ ప్రెస్‌ను గుజరాత్ యూనివర్సిటీ బ్లాక్‌లిస్టులో పెట్టింది. ఈ ప్రెస్ రాష్ట్రంలోని ఐదు యూనివర్సిటీలకు పరీక్షా పత్రాలు ముద్రించి ఇస్తుంది. ప్రెస్ యజమాని ముద్రేష్ పురోహిత్‌కు ఆర్ఎస్ఎస్, బీజేపీతో సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణను ఆయన తోసిపుచ్చారు. కాగా అరెస్టు నుండి తప్పించుకునేందుకు ముద్రేష్ కోర్టు నుండి ముందస్తు బెయిల్ పొందారు.

ఇక జీఎస్ఎస్ఎస్‌బీ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఓరా పదవీకాలంలో రెండు ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. ఆయన హయాంలో పరీక్షా ఫలితాల తారుమారు సహా 61 ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ ఆయనకు బీజేపీ ప్రభుత్వం రెండోసారి అదే పదవిని కట్టబెట్టింది. బీజేపీ పాలనలో ఓరా అనేక పదవులు నిర్వహించారు. అహ్మదాబాద్ మేయర్‌గా, మున్సిపాలిటీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు.

ప్రభుత్వ ప్రమేయంతోనే : కాంగ్రెస్

గత దశాబ్ద కాలంలో ప్రభుత్వోద్యోగాలలో నియామకాలకు సంబంధించి 14 పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని కాంగ్రెస్ ప్రతినిధి మనీష్ దోషీ చెప్పారు. 2020-21, 2022-23 మధ్యకాలంలో గుజరాత్‌లో విద్యార్థుల ఆత్మహత్యలు 21 శాతం పెరిగాయి. పరీక్షా పత్రాల లీకేజీలు కూడా ఆత్మహత్యలకు కారణమయ్యాయి. ప్రభుత్వ ప్రమేయం లేకుండా పేపర్ లీకేజీలు ఎలా జరుగుతాయని దోషీ ప్రశ్నించారు. రాష్ట్రంలో పేపర్ లీకేజీలు వ్యవస్థీకృత నేరంగా మారాయని మండిపడ్డారు. ఉద్యోగ ప్రకటన వెలువడిన వెంటనే రేటు నిర్ణయిస్తారని, లక్షలాది రూపాయలకు ప్రశ్నాపత్రాన్ని అమ్ముకుంటారని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886